

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఖమ్మం

fb.com/vaartha Digital

Published from Khammam, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

30-10-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 270 పేజీలు: 8+16 వెల: 6.50


ఆర్టీసీకి డబుల్ ధమాకా.. తగ్గనున్న డీజిల్ భారం

6

కెటిఆర్‌పై వ్యాఖ్యలకు చింతిస్తున్నా: కొండా సురేఖ

సైబర్ నేరాలకు బ్యాంకులదే బాధ్యత

3




బాధితులకు పరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

నియంత్రణ చట్రంలో నిబంధనలు చేర్చాలి

కేంద్రానికి, ఆర్‌బిఐకి సుప్రీం ధర్మాసనం ఆదేశం

ఆకాశం ఎందుకో ఎర్రబడింది!

3



ఛత్తీస్‌గఢ్‌లో అరుదైన దృశ్యం ఆవిష్కరణ

ఆందోళనకు గురైన స్థానికులు

సోషల్ మీడియాలో వైరల్

ఎల్‌నినో.. వాతావ'రణం'!

3



పెరగనున్న పగటి ఉష్ణోగ్రతలు

మానవాళి మనుగడకు పెనుముప్పు

ఆరు నెలల్లో 55 వేల మరణాలు!

క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక



ఆ 550 ఎకరాలు ప్రభుత్వానివే!

మియాపూర్ భూములపై సుప్రీంకోర్టు తీర్పు

3 దశాబ్దాల పోరుకు న్యాయస్థానం తెర

ఆ భూములపై అప్పీళ్ల పిటిషన్ల కొట్టివేత

పహాణిలో పేర్లున్నంత మాత్రాన వాక్కులు రావు

హైకోర్టు తీర్పును సమర్థించిన ధర్మాసనం

తెలంగాణ సర్కార్‌కు అతిపెద్ద విజయం

సైబరాబాద్ ప్రతినిధి, ఆక్టోబర్ 29 ప్రభాతవార్త: హైటెక్‌సిటీకి అత్యంత చేరువలోవున్న మియాపూర్ భూముల వివాదంలో దేశ సర్వోన్నత న్యాయస్థానం చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ప్రస్తుత మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ.60వేల కోట్ల రూపాయల విలువచేసే 550 ఎకరాల ఈ భూములు ప్రభుత్వానికే చెందుతాయని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్,జస్టిస్ సతీష్‌చంద్రశర్మలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం >>2

ఫ్యూచర్‌సిటీకి రండి

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం


తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కండి

2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు నాది భరోసా

'గ్లోబల్ సమ్మిట్ 2026 కర్టెన్ రైజర్'లో సిఎం రేవంత్‌రెడ్డి

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు29: తెలంగాణ రైజింగ్‌లో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఆహ్వానించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే పారిశ్రామికవేత్తలకు తమ ప్రభుత్వం పూర్తి మద్దతుగా నిలుస్తుందని, రాష్ట్రంలో పెట్టే ప్రతి పెట్టుబడికి తనది భరోసా అని సీఎం హామీ ఇచ్చారు. హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026 సన్నాహక కార్యక్రమాన్ని ఢిల్లీలో గురువారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమానికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, వాకిటి శ్రీహరి, వివేక్ వెంకటస్వామి, అంతర్జాతీయస్థాయి పారిశ్రామికవేత్తలు, విధాన నిర్ణేతలు, అధికారులు పాల్గొన్నారు,సాన్నాహక కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి >>2



గురువారం న్యూఢిల్లీలో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026' సన్నాహక కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్, సిఎం రేవంత్‌రెడ్డి ముచ్చట్లు

తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యం సాధ్యమే

రాష్ట్రాభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం

ఫార్మా, ఏరోస్పేస్, ఎఐ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో అపార అవకాశాలు : కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

2



గురువారం కర్మన్‌ఘాట్‌లో తనిఖీలు చేస్తున్న అధికారులు

రేషన్ బియ్యంకు పాలీష్..

బ్రాండ్‌పేరుతో విక్రయాలు

సివిల్‌సప్లయ్ విజిలెన్స్ తనిఖీలో గుట్టురట్టు

హైదరాబాద్,అక్టోబరు 29,ప్రభాతవార్త: పౌరసరఫరాలశాఖ సరఫరా చేసే బియ్యంకు పాలీష్‌కొట్టి బ్రాండ్‌పేరు పెట్టి రంగురంగు సంచుల్లో నింపి విక్రయించే అక్రమార్కుల గుట్టును గురువారం హైదారాబాద్ ఈ తనిఖీల్లో అంబర్‌పేట, ఖైరతాబాద్, సికింద్రాబాద్, మెహిదీపట్నం, నాంపల్లి సర్కిళ్ల పరిధిలోని విజిలెన్స్,సివిల్‌సప్లయ్ అధికారులు రట్టుచేశారు. కర్మన్‌ఘాట్‌లో సివిల్‌సప్లయ్ విజిలెన్స్ అధికారులు ఏకాలంలో దాడులు చేస్తున్నా రనే సమాచారం అందగానే గ్రేటర్‌హైదరాబాద్ పరిధిలోని వ్యాపారులు దుకాణాలను మూసివేశారు. సివిల్ సప్లయ్ విజిలెన్స్ శాఖ అధికారులు కర్మన్‌ఘాట్ ప్రాంతంలో >>2

రైసుమిల్లు భాగస్వాములకు తప్పని కేసులు, అరెస్టులు

6

నేనున్నా... అధైర్యపడొద్దు!



ప్రతి బాధితుడిని ఆదుకుంటాం..

తుఫానుతో రూ.4,600 కోట్ల నష్టం

హోంమంత్రి అమిత్ షాతో మాట్లాడా..

పంటల నష్టానికి పరిహారం అందిస్తాం

ప్రజల ప్రాణాలను కాపాడటమే తొలి ప్రాధాన్యం: ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి,అక్టోబర్ 29,ప్రభవార్త: అర్నబ్ తుఫాను కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు రూ.4,600 కోట్ల మేర నష్టం వాటిల్లిందని, పూర్తిస్థాయి నష్టాల అంచనా అనంతరం ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు శుక్రవారం కేంద్ర బృందాలు రాష్ట్రానికి రానున్నాయని తెలిపారు. ప్రకృతి విపత్తుల సమయంలో ముందస్తు ప్రణాళిక, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, అధికార యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తే ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు.గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని గచ్చకాయలపొర గ్రామంలో తుఫాను ప్రభావిత ప్రాంతాలను పరిశీలించిన అనంతరం ముఖ్యమంత్రి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అర్నబ్ తుఫాను కారణంగా రాష్ట్రంలో సంభవించిన నష్టం, ప్రభుత్వం చేపట్టిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలు, పునరుద్ధరణ పనులు, బాధితులకు అందించనున్న పరిహారం తదితర అంశాలను వివరించారు. అర్నబ్ తుఫాను వల్ల రాష్ట్రానికి జరిగిన నష్టంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో మాట్లాడినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. రాష్ట్రంలో తుఫాను ప్రభావం, ప్రాణ, ఆస్తి నష్టం, ప్రభుత్వ యంత్రాంగం చేపట్టిన సహాయక చర్యలను కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించేందుకు శుక్రవారం కేంద్ర బృందాలను పంపిస్తామని కేంద్ర హోం మంత్రి హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటికే ప్రాథమిక నష్టాల అంచనాకు సంబంధించిన నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపినట్లు వివరించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం రూ.4,600 కోట్ల మేర నష్టం జరిగినట్లు గుర్తించామని, వ్యవసాయం, ఉద్యానవనం, విద్యుత్, రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలకు జరిగిన నష్టాన్ని పూర్తిస్థాయిలో అంచనా వేసిన తర్వాత ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అన్ని విధాలా సహకరిస్తోందని పేర్కొన్నారు. తుఫాను కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి తెలిపారు. తుఫాను ప్రభావంతో దెబ్బతిన్న కొబ్బరి చెట్టుకు రూ.1,500, ఆయిల్ పామ్ చెట్టుకు రూ.1,500 చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించారు. వ్యవసాయ, ఉద్యానవన పంటలకు జరిగిన నష్టాన్ని సంబంధిత శాఖల అధికారులతో అంచనా వేయించి, అర్హులైన రైతులకు పరిహారం మొత్తాన్ని త్వరితగతిన జమ చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రకృతి విపత్తుల వల్ల రైతులు ఆర్థికంగా నష్టపోకుండా కాపాడటమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తుఫాను ప్రభావంతో పునరావాస కేంద్రాలకు తరలించిన బాధితులు తిరిగి ఇళ్లకు వెళ్లే సమయంలో వారికి అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందిస్తుందని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి అర్హతగల బాధిత కుటుంబానికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకుల ప్యాకెట్‌తో పాటు ఖర్చుల నిమిత్తం నగదు సాయం అందించనున్నట్లు వెల్లడించారు.

పంటలెండుతున్నాయ్..

రైతులను ఆదుకోండి!

డిపిఆర్ లేకుండా మూసీ సుందరీకరణ ఎందుకు?

ఆ లక్షన్నర కోట్లతో ప్రజలను ఆదుకోండి: కెటిఆర్



గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కెటిఆర్

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: 420 హామీలకు హాలిడే.. ఆరు గ్యారెంటీలకు హాలిడే.. క్రాప్ హాలిడే, పవర్ హాలిడే, పీఆర్సీకి హాలిడే, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు హాలిడే.. ఇలా అన్నింటికీ హాలిడే ప్రకటించిన ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికే మనం హాలిడే ఇస్తే దరిద్రం పోతుందని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. గురువారం సాయంత్రం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు రైతు డిక్లరేషన్లు ప్రకటించిన కాంగ్రెస్.. ఇప్పుడేమో రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పంటలు తామే కాపాడుకుంటామని రైతులు సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాల్సిన దుస్థితి నేడు తెలంగాణలో ఏర్పడిందని మండిపడ్డారు. కాంగ్రెస్ తెచ్చిన కరువు వల్ల జెనరేటర్లు, ట్యాంకర్లతో తెలంగాణ రైతులు పంటల్ని కాపాడుకుంటున్నారని రేవంత్ సర్కార్‌పై ధ్వజమెత్తారు. రైతులు తమ పంటల్ని తామే తగలబెట్టుకునే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 420 >>2

రైతులకు ఎకరాకు 30 వేలివ్వండి

ఒక్కో కరవు మండలానికి రూ.10 కోట్లు విడుదల చేయాలి: బిజెపి కిసాన్ మోర్చా



హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అతికొద్ది కాలంలోనే పచ్చని తెలంగాణను కరువు తెలంగాణగా మార్చేసిందని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీనర్సయ్య విమర్శించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సస్యశ్యామలంగా పాడిపంటలతో విలసిల్లిన తెలంగాణలో కాంగ్రెస్ పాలకుల అనాలోచిత నిర్ణయాలు, ముందస్తు ప్రణాళిక లేకపోవడం వల్లనే నేడు కరువు తాండవిస్తోందని మండిపడ్డారు. ఎల్ నినో హెచ్చరికలు గత ఫిబ్రవరి నుంచే కేంద్ర ప్రభుత్వంతో పాటు శాస్త్రవేత్తలు జారీ చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ లభ్యతను గానీ, రిజర్వాయర్లలో నీటి నిల్వలను గానీ సమన్వయం చేసుకోకుండా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించిందని, ఇప్పుడు ఆ వైఫల్యాన్ని ఎల్ నినో మాటున కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రికార్డుల కోసం కేవలం 365 మండలాల్లోనే కరువు ఉన్నట్లు >>2

కరవు మండలాలపై రైతుల అసంతృప్తి

జాబితాలో చోటుదక్కని పలు ప్రాంతాలు

దెబ్బతిన్న పంటలతో కొట్టుమిట్టాడుతున్న అన్నదాతలు

6

సర్కార్‌కు ఎల్‌నినో సవాళ్లు!



ఖజానాపై ఊహించని భారం

కరవు ప్రాంతాలకు రూ.20 వేల కోట్లు..

మార్కెట్ రుణాలు, కేంద్ర ఆర్థిక సాయంపైనే ఆశలు

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్నినో రూపంలో ఊహించని ప్రకృతి, పరిపాలనా సవాళ్లు ఎదురవుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి నిల్వలు క్షీణించి భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోవడంతో, క్షేత్రస్థాయిలో వ్యవసాయం దెబ్బతింటోంది. మరోవైపు వ్యవసాయానికి సాగు నీటి నిమిత్తం బోర్లు వాకడంపెరుగుతుండగా, పరిశ్రమలు, >>2

ప్రతిష్టాత్మకంగా ఖేలో ఇండియా గేమ్స్

- కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవీయ

ఖేలో ఇండియా గేమ్స్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలి: మంత్రి వాకిటి శ్రీహరి

7

వార్త, ఖమ్మం, శుక్రవారం 30, అక్టోబరు 2026



శ్రీనగర్‌లో గురువారం జమ్మూ కాశ్మీర్ పోలీసులు నిర్వహించిన 'పెడల్ త్రూ ప్యారడైజ్' సైకిల్ రేసులో దివ్యాంగులు

బ్రాండ్‌పేరుతో విక్రయాలు

>> అనేక రైస్‌డిపోలపై మెరుదాడులు చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, హైదరాబాద్ జిల్లా ముఖ్య రేషన్ అధికారి కార్యాలయానికి చెందిన అధికారులు హైదరాబాద్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో బియ్యం వ్యాపార సంస్థలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. బియ్యం వ్యాపారులు సంబంధిత చట్టాలు, నిబంధనలు పాటిస్తున్నారా లేదా అనే అంశాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల్లో అంబర్‌పేట, ఖైరతాబాద్, సికింద్రాబాద్, మెహిదీపట్నం, నాంపల్లి సర్కిళ్ల పరిధిలోని మొత్తం 10 బియ్యం వ్యాపార సంస్థల్లో వివిధ రకాల అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు గుర్తించి, సంబంధిత వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. మూడు బియ్యం వ్యాపార సంస్థలు అవసరమైన ట్రేడ్ లైసెన్సులు లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రెండు వ్యాపార సంస్థల్లో బియ్యం బస్తాల్లో తక్కువ తూకం ఉన్నట్లు గుర్తించారు. ఒక సంస్థలో 26 కిలోల బరువు ఉండాల్సిన గజరాజ్ బ్రాండ్ బియ్యం బస్తాలో కేవలం 24.960 కిలోల బియ్యం మాత్రమే ఉండగా, ఒక్కో బస్తాలో 1.040 కిలోల తక్కువ తూకం ఉన్నట్లు గుర్తించారు. మరో సంస్థలో కూడా 26 కిలోల బియ్యం బస్తాల్లో తక్కువ తూకం ఉన్నట్లు గుర్తించారు. ధృవీకరణ పొందని తూకపు యంత్రాలను వినియోగించడం, ధృవీకరణ గడువు ముగిసిన తూకపు యంత్రాలను ఉపయోగించడం, వ్యాపార లావాదేవీల్లో తూకపు యంత్రాలను వినియోగించకపోవడం వంటి ఉల్లంఘనలను గుర్తించి లీగల్ మెట్రాలజీ చట్టం, 2009 కింద కేసులు నమోదు చేశారు. కొన్ని బియ్యం బస్తాలపై తయారీదారు పేరు, ఇతర నిర్దేశిత వివరాలను ముద్రించకపోవడాన్ని గుర్తించి చర్యలు చేపట్టారు. కొన్ని వ్యాపార సంస్థల్లో GST రిజిస్ట్రేషన్, లైసెన్సులకు సంబంధించి లోపాలు ఉన్నట్లు తనిఖీల్లో గుర్తించారు.గుర్తించిన ఉల్లంఘనలకు సంబంధించి వర్తించే చట్టాలు, నిబంధనల ప్రకారం సంబంధిత వ్యాపారులపై చర్యలు చేపట్టారు. వినియోగదారులకు సరైన పరిమాణంలో బియ్యం అందించడం, తప్పుడు తూకం ద్వారా జరిగే మోసాలను అరికట్టడం, పారదర్శకమైన వ్యాపార విధానాలను అమలు చేయడం ఈ తనిఖీల ప్రధాన ఉద్దేశ్యం.జిల్లాలోని బియ్యం వ్యాపారులందరూ అవసరమైన లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు తప్పనిసరిగా కలిగి ఉండాలని, ధృవీకరించిన తూకపు యంత్రాలను మాత్రమే వినియోగించాలని, బియ్యం బస్తాల్లో సరైన తూకం ఉండేలా చూడాలని, బస్తాలపై నిర్దేశిత వివరాలను ముద్రించాలని పౌర సరఫరాల శాఖ సూచించింది. 25 కిలోల బరువు ఉండే బ్యాగులో 23, 24 కిలోల రైస్ బ్యాగ్‌లను అమ్ముతున్నట్లు కర్మన్‌ఘాట్‌లో తనిఖీలో వెల్లడైందని అలాంటి వారి ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేస్తామని సివిల్ సప్లైస్ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర హెచ్చరించారు.

ఫ్యూచర్‌సిటీకి రండి

>> మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధికి అవసరమైన విధాన నిర్ణయాలు, ప్రభుత్వ సహకారం అందించేందుకు తాను వ్యక్తిగతంగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌కు నాలుగు వందల ఏళ్ల క్రితమే ప్రపంచ నగరంగా గుర్తింపు ఉందని సీఎం తెలిపారు. ప్రపంచీకరణ అనే మాట ప్రాచుర్యంలోకి రాకముందే అనేక దేశాల నుంచి వ్యాపారులు హైదరాబాద్‌కు వచ్చి వ్యాపారాలు చేసేవారని గుర్తు చేశారు. చార్మినార్ పరిసరాల్లో ముత్యాలు, సుగంధ ద్రవ్యాలు, నఖాసీ వస్తువుల వ్యాపారం జరిగేదని గుర్తు చేశారు. నిజాం పాలనలో హైదరాబాద్‌లో అనేక చారిత్రక కట్టడాలు, అంతర్జాతీయ స్థాయి మ్యూజియాలు, టంకశాల, విమానాశ్రయం, రైల్వే వ్యవస్థ, విద్యాసంస్థలు ఏర్పాటయ్యాయని సీఎం తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదువుకున్న సత్య నాదెళ్ల (మైక్రోసాఫ్ట్), అజయ్ బంగా (ప్రపంచ బ్యాంకు), శంతను నారాయణ్ (అడోబ్), ప్రేమ్ వత్స వంటి వారు ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు అంతర్జాతీయ స్థాయి ప్రతిభావంతులను అందించడంలో హైదరాబాద్‌కు ప్రత్యేక గుర్తింపు సీఎం తెలిపారు. పారిశ్రామికవేత్తలు తమ లక్ష్యాలను చేరుకోవడానికి ప్రభుత్వం నుంచి ఏం కావాలో చెప్పాలని, విధానపరమైన మార్పుల నుంచి అవసరమైన సహకారం వరకు అన్నింటినీ అందించేందుకు వ్యక్తిగతంగా తాను బాధ్యత తీసుకుంటానని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యం వికసిత్ భారత్2047 దార్శనికతకు అనుగుణంగా ఉంటుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదిగే సమయంలో దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 5 శాతం నుంచి 10 శాతానికి పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సీఎం వివరించారు. 2034 నాటికి తెలంగాణను ఒక ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని సీఎం ప్రకటించారు.కేంద్ర, రాష్ట్ర సంబంధాలపై పెట్టుబడిదారులకు సందేహాలు ఉండొచ్చని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అయితే, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావులేదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ ముఖ్య అతిథిగా హాజరుకావడమే ఇందుకు నిదర్శనమని సీఎం తెలిపారు. దేశంలో ఏడు హైస్పీడ్ రైలు కారిడార్ల ఏర్పాటుకు కేంద్రం నిర్ణయించగా, వాటిలో హైదరాబాద్ నుంచి చెన్నై, బెంగళూరు, పుణెకు మూడు కారిడార్లు కేటాయించారని తెలిపారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో కొత్త విమానాశ్రయాల ఏర్పాటుకు కూడా కేంద్రం సహకరిస్తోందన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు విస్తరణ, నేవీ లోఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్‌తో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో కేంద్రం నుంచి సహకారం అందుతోందని సీఎం తెలిపారు. పారిశ్రామికవేత్తలు విజయాలు సాధించే మార్గంలో ఉన్న అడ్డంకులను తొలగించడమే తన బాధ్యతని తెలిపారు. హైదరాబాద్ పోటీ ఢిల్లీ, ముంబయి, చెన్నై, బెంగళూరు నగరాలతో కాదని, న్యూయార్క్,లండన్, టోక్యో,సియోల్, దుబాయ్‌వంటి ప్రపంచ నగరాలతోనేనని సీఎం అన్నారు. ప్రపంచస్థాయి ఆలోచనలు, మెరుగైన విధానపరమైన సూచనలను పారిశ్రామికవేత్తలు అందించాలని కోరారు. వారి సూచనలను ప్రభుత్వ విధానాల్లోకి తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. తెలంగాణ ప్రగతి పథంలో ముందుకు సాగుతోందని, ఈ ప్రయాణంలో ప్రపంచ పెట్టుబడిదారులు భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. అంతా కలిసి ముందుకు సాగితే చరిత్ర సృష్టించగలమని సీఎం రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీలు అభిషేక్ మను సింఘ్వీ, రేణుకా చౌదరి, డాక్టర్ మల్లు రవి, వేం నరేందర్ రెడ్డి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, బలరాం నాయక్, సురేశ్ షెట్కార్, రామసహాయం రఘురాంరెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి ఏపీ జితేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఏపి సిఎం చంద్రబాబును అభినందిస్తున్నా: కెటిఆర్

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందనలు కురిపించారు. తెలంగాణలో కరవు పరిస్థితులపై స్పందిస్తూ, పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రిని ఆయన ప్రశంసించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణ కంటే ఏపీలో తక్కువ వర్షపాతం ఉన్నా ఏపీలో కరువు లేదు చంద్రబాబు ముందు చూపుతో నీళ్ల ఎత్తిపోసుకున్నారు. నీళ్ల ఎత్తిపోసుకోవడం వల్లే ఏపీలో కరువు,క్రాప్‌హాలిడే లేవు, ఈ విషయంలో చంద్రబాబును అభినందిస్తున్నా' అని పేర్కొన్నారు. ఎక్కువ కరవు ఉన్నప్పటికీ, చంద్రబాబు పరిస్థితులను సమర్థవంతంగా నిర్వహించారని కేటీఆర్ అన్నారు. పక్క రాష్ట్రాలైన ఏపీ, కర్ణాటకలో లేని కరవు తెలంగాణలోనే ఎందుకు వచ్చిందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.తెలంగాణలో లోటు వర్షపాతం 17 నుంచి 20 శాతం మాత్రమే ఉందని సిఎం రేవంత్ వల్లే రాష్ట్రంలో కరవు వచ్చిందన్నారు. కరవుపై రేవంత్‌రెడ్డి అవాస్తవాలు చెబుతున్నారని తప్పుపట్టారు. ఇది 30 శాతం కమీషన్ సర్కార్ అని రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలు చేశారని కూడా తెలిపారు. ఇదే సమయంలో, గతంలో తనపై చేసిన వ్యాఖ్యలకు మాజీ మంత్రి కొండా సురేఖ క్షమాపణ చెప్పడంపై కేటీఆర్ స్పందించారు. నిజం నిలకడ మీద తెలుతుంది అని వ్యాఖ్యానించారు. కొండా సురేఖ ఏం చెప్పారో ఇంకా పూర్తిగా చూడలేదని, ఆ వివరాలు చూశాక లీగల్ టీమ్‌తో చర్చించి తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

30 వేలివ్వండి

>> జీవో ఇచ్చి చేతులు దులుపుకుందని, వాస్తవానికి రాష్ట్రంలో 90 శాతానికి పైగా మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు నెలకొన్నాయని లక్ష్మీనర్సయ్య పేర్కొన్నారు. ఖరీఫ్ సీజన్‌లో సరైన విద్యుత్, సాగునీరు అందించకపోవడం వల్లనే దాదాపు 18 శాతం విస్తీర్ణంలో సుమారు 13 లక్షల ఎకరాలకు పైగా వరి పంట పూర్తిగా ఎండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ప్రస్తుత రబీ సీజన్‌లో రైతులపై ఒత్తిడి తెస్తూ, విత్తన కేంద్రాల్లో వ్యవసాయ అధికారులు రైతుల నుంచి పంట ఎండినా, నష్టం వచ్చినా ప్రభుత్వానికి సంబంధం లేదని బాండ్ పేపర్లు రాయించుకోవడం అత్యంత దుర్మార్గమైన చర్య అని దుయ్యబట్టారు. అన్నదాతలను ఆదుకోవాల్సిన ప్రభుత్వమే బాధ్యతల నుంచి తప్పుకుంటూ వారిని నట్టేట ముంచాలని చూస్తోందని, వరి వద్దంటున్న ప్రభుత్వం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను ఎందుకు ప్రకటించలేదని నిలదీశారు.

వారం - వర్జ్యం

30-10-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆశ్వీయుజ మాసం, దక్షిణాయణం,
శరదృతువు, కృష్ణపక్షం, స్వాతి కార్తె
తి.పంచమి రా.7.28, న.మృగశిర ఉ.9.05
వ.సా.4.50-సా.6.18
దు.1.ఉ.8.22-ఉ.9.08
దు.2.మ.12.13-మ.12.59
రాహు. ఉ.10.30-మ.12.00
శుభ ఉ.10.00-ఉ.11.00

వార్తాఫలం

మేషం : భూములు క్రయవిక్రయాలలో ఆశించిన లాభాలు ఉండవు. ఋణ బాధలు ఎదురై చికాకు పెడతాయి.

వృషభం : శ్రమకు తగిన ఫలితం కష్టమే. బంధువులను కలసి కష్టసుఖాలను పంచుకుంటారు. వివాదాలకు దూరంగా ఉండండి.

మిథునం : గుడ్డిగా ఎదుటివారి మాటలను నమ్మటం వలన మోసపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రయాణాలు.

కర్కాటకం : వ్యాపారంలో కొంతమేర మార్పులు చేయడం వలన కొంత లాభ పడతారు. ఉద్యోగస్తులకు స్థాన చలనం.

సింహం : భగవదానుగ్రహం వలన ప్రతి విషయంలో అనుకూల ఫలితాలు సాధిస్తారు. వివాహ ప్రయత్నాలు ముమ్మరం చేస్తారు.

కన్య : సంతానానికి సంబంధించిన విషయ వ్యవహారాలను మీకను సన్నలలో నడుస్తాయి. ఇతరుల విషయాలలో జోక్యం వద్దు.

తుల : నూతన వ్యక్తులతో, పెద్దలతో పరిచయాలు పెరుగుతాయి. తద్వారా మీరు కొంత మేర లాభ పడతారు. వస్త్ర లాభం.

వృశ్చికం : మీరు చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొంటారు. దీర్ఘకాలిక సమస్యలు తీరుతాయి.

ధనుస్సు : ఇష్టపడి కొనుగోలు చేసిన వాటిని తిరిగి మార్పు చేయాలని యోచిస్తారు. ఇతరుల పోరు మీకు విసుగు కలిగిస్తుంది.

మకరం : ఋణాల ద్వారా అందుకున్న ఆదాయాన్ని శుభకార్యాల కొరకు వినియోగిస్తారు. అధిక శ్రమకు లోనవుతారు.

కుంభం : మీ మంచితనంతో వ్యతిరేక వర్గమును అనుకూలంగా మార్చుకుంటారు. క్రమశిక్షణ మరింత మేలు చేస్తాయి.

మీనం : మానసిక ధైర్యం అన్నిటికన్న గొప్పదని గుర్తించండి. దైనందిన జీవితంలో మార్పులు చేసుకుంటారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

తెలంగాణ రైజింగ్-2047 లక్ష్యం సాధ్యమే

తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సంపూర్ణ సహకారం

ఫార్మా, ఏరోస్పేస్, ఎఐ, క్వాంటం కంప్యూటింగ్ రంగాల్లో అపార అవకాశాలు

తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్

ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,అక్టోబరు29: తెలంగాణ నిర్దేశించుకున్న 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యం సవాలుతో కూడుకున్నదే అయినప్పటికీ.. సమష్టి కృషితో దానిని సాధించవచ్చని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా సహకరిస్తుందన్నారు.రాష్ట్రంలో ఫార్మా, అంతరిక్షం, ఏరోస్పేస్, రక్షణ, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, ఆహార శుద్ధి, పరిశోధన, ఆవిష్కరణల రంగాల్లో విస్తృత అవకాశాలున్నాయని చెప్పారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్2026 కర్టెన్ రైజర్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కేంద్ర మంత్రి మాట్లాడుతూ పెట్టుబడులు పెట్టే ముందు పారిశ్రామికవేత్తలు ప్రధానంగా ఆశించేది విధానాల్లో స్థిరత్వం, నిబంధనల్లో స్పష్టత, వ్యాపార నిర్వహణలో పారదర్శకతేనని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ అన్నారు. ఇందుకు తెలంగాణ చరిత్రలోని కాకతీయుల కాలం నాటి ఉదాహరణను ప్రస్తావించారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యాన్ని స్వాగతిస్తున్నట్లు కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ తెలిపారు. తెలంగాణ నుంచి ఎగుమతులు పెంచేందుకు రాష్ట్రం ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ సూచించారు. తాండూరు కందిపప్పు, చపాటా మిర్చి, నిజామాబాద్ పసుపు వంటి ఉత్పత్తులకు ప్రపంచ మార్కెట్లలో మంచి అవకాశాలున్నాయని కేంద్ర మంత్రి గుర్తు చేశారు. వాటికి అంతర్జాతీయంగా మెరుగైన ధర లభించేలా చర్యలు తీసుకుంటే రైతుల ఆదాయం పెరుగుతుందని చెప్పారు.ఇటీవల తాండూరు ఎర్ర కందిపప్పు ఉత్పత్తులను హైదరాబాద్ నుంచి ఆస్ట్రేలియాకు ఎగుమతి చేయడం తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులకు ఉన్న అవకాశాలకు నిదర్శనమని కేంద్ర మంత్రి అన్నారు.తెలంగాణ ఫార్మా రంగంలో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని గోయల్ సూచించారు. జనరిక్ ఔషధాల తయారీకి మాత్రమే పరిమితం కాకుండా, అధిక విలువ కలిగిన బ్రాండెడ్ ఔషధాలు, వినూత్న ఔషధాలు, బయోసిమిలర్ల తయారీపై దృష్టి పెట్టాలని సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని అంతరిక్షం, విమానయాన రంగాలు, విమాన విడిభాగాల తయారీ, నిర్వహణమరమ్మతు సేవలు (ఎంఆర్ఓ), రక్షణ పరికరాలు, ఎలక్ట్రానిక్స్, కృత్రిమ మేధ, క్వాంటం కంప్యూటింగ్, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో తెలంగాన పెట్టుబడులను ప్రోత్సహించాలని చెప్పారు. తెలంగాణలో పారిశ్రామికాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ఈ సందర్భంగా జహీరాబాద్ పారిశ్రామిక స్మార్ట్ సిటీ, వరంగల్‌లో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అభివృద్ధిని ఆయన ప్రస్తావించారు. కేంద్రం, రాష్ట్రాలు సమన్వయంతో పనిచేస్తేనే వివిధ పరిశ్రమల్లో ప్రపంచ స్థాయి నాయకత్వం సాధ్యమవుతుందని చెప్పారు. దీపావళి పండుగ సమయంలో ఒక్కో దీపం వెలిగించడం ద్వారా వెలుగులు విస్తరించినట్లే.. ఒక్కో పెట్టుబడి, ఒక్కో ఎగుమతి, ఒక్కో కొత్త ఉద్యోగం, ఒక్కో స్టార్టప్ దేశాభివృద్ధికి దోహదపడతాయన్నారు. భారత్, తెలంగాణ భవిష్యత్తు ఉమ్మడి కృషిపైనే ఆధారపడి ఉందన్నారు. దేశీయ, అంతర్జాతీయ పెట్టుబడిదారులు తెలంగాణలోని అవకాశాలను పరిశీలించి, దీర్ఘకాలిక భాగస్వామ్యాలు ఏర్పాటు చేసుకోవాలని ఆహ్వానించారు. ఈ పెట్టుబడుల ద్వారా ఉద్యోగాల సృష్టి, ప్రజల సంపద పెరుగుదల, సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతాయని చెప్పారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ విజయవంతం కావాలని ఆకాంక్షి ంచారు.

పెట్టుబడుల సాధనలో తెలంగాణ ముందు : సుచిత్ర ఎల్లా

కొత్త రాష్ట్రమైనా పెట్టుబడుల సాధనలో తెలంగాణ దేశంలోనే ముందు వరుసలో ఉందని భారత్ బయోటెక్ సీఎండీ సుచిత్ర ఎల్లా అన్నారు. తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్‌రైజర్ సమావేశంలో మాట్లాడిన ఆమె పెట్టుబడుల సాధన కోసం సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రయత్నం అభినందనీయమన్నారు. ఐటీ, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందన్న ఆమె హైదరాబాద్‌లోని జీనోమ్ వ్యాలీ నుంచే కరోనా టీకా కోవాగ్జిన్ వచ్చిందని గుర్తుచేశారు. ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లోనూ..హైదరాబాద్ తనదైన ముద్ర వేస్తోందని చెప్పారు. ఎయిర్‌క్రాఫ్ట్, స్పేర్‌పార్ట్స్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్‌కు సంబంధించి హైదరాబాద్‌లో మంచి అవకాశాలు ఉన్నాయన్నారు. డిసెంబర్‌లో జరిగే ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు శక్తిమంతమైన వేదిక కానుందన్న ఆమె తెలంగాణ, హైదరాబాద్‌లో వ్యాపార అవకాశాల్లో నిరుత్సాహం అనేది ఉండదన్నారు.



పాట్నాలో గురువారం పాట్లీపుత్ర ఏక్తా నగర్ ప్రత్యేక రైలును జెండా ఊపి ప్రారంభిస్తున్న బీహార్ సిఎం సామ్రాట్ చౌదరి

ఆ 550 ఎకరాలు ప్రభుత్వానివే!

>> స్పష్టంచేసింది. ఈభూమి తమదేనంటూ వివిధ సంస్థలు, వ్యక్తులు కలిసి వేసిన అప్పీళ్లను తోసిపుచ్చి ఈభూమిపై కేవలం ప్రభుత్వానికే హక్కు ఉంటుందని సుస్పష్టమైన తీర్పును వెలువరించింది. దీనితో 23 ఏళ్లపాటు సుప్రీంకోర్టులో సుదీర్ఘంగా సాగిన పోరాటానికి తెరపడినట్లయింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చొరవతోనే సుప్రీంకోర్టులో ప్రభుత్వానికి అనుకూల తీర్పు సాధ్యమైందని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇలావున్నాయి. కాగా రంగారెడ్డి జిల్లా, శేరిలింగంపల్లి మండలం, మియాపూర్ గ్రామ సర్వేనెంబర్ 100లో 277.05 ఎకరాలు,101లో 273.34ఎకరాలు మొత్తం కలిసి 550.39 ఎకరాల ప్రభుత్వభూమి ఉన్నది.ఖాస్రాపహానీ ప్రకారం ఈభూమి ప్రైవేటు వ్యక్తులకు సంబంధించినదిగా ఉండడంతో ప్రభుత్వం సైతం ఈభూములవైపు ఎప్పుడూ చూడలేదు. దీంతో ఈ భూముల్లోనే కొందరు వ్యక్తులు అప్పటి హుడా అనుమతితో వెంచర్లు కూడా వేశారు. ఇదిలావుండగా అప్పటి ఉమ్మడి రాష్ట్రంలో 1982లో అమలులోకి వచ్చిన భూకబ్జా నిరోధక చట్టం ప్రకారం ఏర్పాటైన ల్యాండ్ గ్రాబింగ్ కోర్టు ఈ భూములను గుర్తించి 1997లో ఇవి ప్రభుత్వానికి చెందుతాయని తీర్పును వెలువరించింది. ఈభూములను రెవెన్యూ శాఖ వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు ఇవ్వగా దీన్ని సవాలు చేస్తూ సదరు కబ్జాదారులు హైకోర్టులో రిట్ పిటిషన్ (889/1998)దాఖలు చేశారు. మొత్తం తొమ్మిది రిట్ పిటిషన్లను పరిశీలించిన హైకోర్టు వాటిని కొట్టివేస్తూ 16/04/2003న ఉత్తర్వులు జారీచేసింది. అనంతరం ఈ భూములను అప్పటి హుడా స్వాధీనం చేసుకోగా మరో 20మంది హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ 14917/2003ను దాఖలు చేశారు. గత ప్రభుత్వాలు తగినంత ప్రాధాన్యతను ఇవ్వని కారణంగా దాదాపు 23 ఏళ్లపాటు ఈకేసు సుప్రీంకోర్టులోనే కొనసాగింది. తాజాగా సుప్రీంకోర్టు ఈభూములు ప్రభుత్వానివే అని సుస్పష్టమైన తీర్పును వెలువరించడంతో గతంలో ప్రభుత్వమే తనది కాదని వదిలేసిన భూమి తిరిగి వచ్చేసినట్లయింది.

ఆ మలుపుతోనే ప్రభుత్వానికి గోల్డ్‌మైన్

తెలంగాణ ప్రభుత్వానికి ప్రస్తుతం గోల్డ్‌మైన్‌గా మారిన ఈభూముల వ్యవహారంలో కీలక మలుపు మాత్రం ల్యాండ్ గ్రాబింగ్ కోర్టు ఉత్తర్వులతోనే మొదలైంది. సేత్వార్ ప్రకారం ప్రభుత్వ భూమిగా ఉన్న ఈస్థలం ఖాస్రాలో మాత్రం ప్రైవేటుగా నమోదై ఉంది. ఈ కరణంగానే ప్రైవేటు వ్యక్తులు ఈ భూముల్లోకి చొరబడ్డారు. అయితే నిజాం కాలంలో ఉన్న జాగీర్లన్నీ రద్దయిన తర్వాత అవార్డు పాస్ చేసి నష్టపరిహారం ఇచ్చినా ఇదే భూముల్లో ప్రైవేటు వ్యక్తులు తిష్టవేసి ఉన్నారు. 1995లో ఎల్‌జిసి కోర్టు కలెక్టర్‌ను పార్టీ చేస్తూ భూములను రక్షించాల్సిందిగా ఆదేశించేవరకు ఇది ప్రైవేటు భూమిగానే చెలామని అయింది. ఇందులో భాగంగానే అంతకు ముందు ఇక్కడ వేసిన లేఅవుట్‌లకు హెచ్‌ఎండిఎ కూడా అనుమతులు మంజూరు చేసింది. అప్పటి జాగీర్దార్ కైసరుద్దీన్‌కు చట్టబద్ధమైన వారసురాలైన అమీరున్నిసాబేగం నుంచి తాము కొనుగోలు చేశామని పలుకుబడి కలిగిన కొందరు వ్యక్తులు ఈభూముల్లో తిష్టవేశారు. ల్యాండ్ గ్రాబింగ్ కోర్టు తీర్పును సమర్థిస్తూ అప్పటి హైకోర్టు, ప్రస్తుతం సుప్రీంకోర్టు కూడా తీర్పును వెలువరించడంతో ప్రభుత్వానికి ఒక గోల్డ్‌మైన దొరికినట్లయింది.

150 ఎకరాల్లో ఇప్పటికే నిర్మాణాలు

మొత్తం 551 ఎకరాల ఈభూమిలో ప్రసుతం 400 ఎకరాలు మాత్రమే ఖాళీగా వుండగా 150 ఎకరాలకు పైగా భూమిలో ఇప్పటికే నిర్మాణాలు వచ్చాయి. భూమి మధ్యలో గత కొన్ని దశాబ్దాలుగా పేదలకోసం ముజఫర్ అహ్మద్‌నగర్, స్టాలిన్ నగర్ అనే బస్తీలు ఏర్పడగా భూమి సరిహద్దుల్లో మాత్రం బడాబాబులు తిష్టవేసి అందినకాడికి కబ్జాచేశారు. ఈవిషయమై ప్రభాతవార్త పలుమార్లు కథనాలు వెలువరించగా అడ్డుకున్న అధికారులు ఆతర్వాత వదిలేశారు. ఏడాది క్రితం కూడా '55వేల కోట్ల ప్రభుత్వ భూమిలో ఇరుశాఖల దొంగాట' అనే శీర్షికన హెచ్‌ఎండిఎ,రెవెనూ య అధికారుల తీరును ఎండగడుతూ కథనాన్ని వెలువరించింది. ఎట్టకేలకు గత ఏడాది ఖాళీగావుండి కబ్జా అవుతున్న భూమికి హెచ్‌ఎండిఎ అధికారులు కంచెవేశారు. కంచె వేసే సమయంలోనే ప్రశాంత్‌నగర్ వైపు ఉన్న దాదాపు 40ఎకరాలభూమిని వదిలివేయడంతో అక్కడ కూడా అక్రమాలకు తావు ఇచ్చినట్లయింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఇలా ఆక్రమణలకు పాల్పడిన బడాబాబుల నుంచి భూమిని వెనక్కితీసుకొని ప్రజా అవసరాలకోసం వినియోగించాల్సి వుంది. ప్రస్తుతం ప్రభుత్వం చేతికి వచ్చిన మియాపూర్ భూముల విలువ ఎకరం వందకోట్లకు పైగానే ధరపలికే అవకాశముంది. ఈకేసులో ప్రభుత్వం తరపున వాదించిన ప్రముఖ న్యాయవాది వైద్యనాథన్ ఒక్క వాయిదాకు 25లక్షలు తీసుకునేవారని ప్రచారంజరుగగా ఈకేసును ప్రభుత్వం ఎంతప్రతిష్ఠాత్మకంగా తీసుకుందో అవగతమవుతోంది. ప్రత్యర్థి వర్గం సైతం అంతకు రెండింతలు ఖర్చుపెట్టి ఈ కేసును గెలిచేందుకు శతవిధాల ప్రయత్నించినట్లు తెలిసింది. ఎట్టకేలకు ఈభూములు ప్రభుత్వానికి చెందుతాయన్న తీర్పు వెలువడిన నేపథ్యంలో ఈభూములు ఏరూపును సంతరించుకోనున్నాయన్నది చర్చనీయాంశంగా మారింది.

సర్కార్‌కు ఎల్‌నినో సవాళ్లు!


>> ఐటీ రంగంలోనూ విద్యుత్ వినియోగం గరిష్ట స్థాయికి చేరుకుంది. ఇదే సమయంలో రైతులకు రెండో పంట వేసుకునే అవకాశం తగ్గడం వల్ల పంటల నష్టం వేల కోట్లకు చేరే ప్రమాదం పొంచి ఉంది. రాష్ట్రంలో కరువు నుండి వివిధ వర్గాలకు వెన్నుదన్నుగా నిలిచేందుకు దాదాపు రూ.20 వేల కోట్లు అత్యవసరం కానున్నాయి. ఇటు విద్యుత్ కొనుగోళ్లకు అదనపు భారం పడటం, అటు వివిధ వర్గాలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అమలు, తప్పనిసరి కావడంతో ప్రభుత్వ ఖజానాపై ఊహించని భారం పడుతోంది. ఈ అదనపు ఖర్చులను తట్టుకునేందుకు మరియు హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగించేందుకు నిధులు అత్యవసరంగా మారాయి. సంక్షేమ పథకాలు, అధిక రుణ పరిమితులు, భారీ వడ్డీ చెల్లింపులు, పింఛన్లు, బలహీనమైన పన్నేతర రాబడి వసూళ్ల రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు ఇప్పటికే ఆర్థిక ఒత్తిళ్లను మరింత పెంచుతున్నాయి. ఏప్రిల్ నుండి సెప్టెంబర్ మధ్య కాలంలో, బడ్జెట్‌లో అంచనా వేసిన రూ.6,857.76 కోట్ల మిగులుకు బదులుగా, తెలంగాణ రూ. 15,096.18 కోట్ల రెవెన్యూ లోటును నమోదు చేసింది. ప్రస్తుత 2026-27 మొదటి ఆరు నెలల్లోనే రెవెన్యూ పరిస్థితి చూస్తే సెప్టెంబర్ నాటికి ప్రాథమిక లోటు రూ.28,046.81 కోట్లకు చేరుకుంది. ఇది పూర్తి సంవత్సర లక్ష్యంలో 75.49 శాతానికి సమానం. సాధారణ ఖర్చులను తీర్చడానికి మార్కెట్ రుణాలపై ఆధారపడటం పెరుగుతోందని ఈ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వార్షిక నికర రుణ పరిమితి రూ.58,458.71 కోట్లలో రూ.44,612.16 కోట్లను వినియోగించుకుంది. ఇది నిర్దేశించిన పరిమితిలో 76.31 శాతానికి సమానం. దీంతో ఈ నెల నుండి మార్చి 2027 వరకు కేవలం రూ.13,846.55 కోట్లు మాత్రమే రుణాలకు అవకాశం ఉండనుంది. సెప్టెంబర్ నాటికి నికర ప్రభుత్వ రుణం రూ.35,536.27 కోట్లుగా ఉంది. ప్రభుత్వ ఖాతా బాధ్యతలు మొత్తం రూ.9,309.83 కోట్లుగా ఉన్నాయి. రాష్ట్ర సొంతఆదాయం సరిపోకపోవడంతో మార్కెట్ రుణాల ద్వారా నిధులను సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం విధించే ఫిజికల్ రెస్పాన్సిబిలిటీ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్బీఎమ్) రుణ పరిమితిని పెంపుదల చేయాలని తెలంగాణ సర్కార్ కేంద్రాన్ని కోరేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం జీఎస్డీపీలో 3 శాతంగా ఉన్న రుణ పరిమితిని కనీసం4 నుంచి 4.5శాతానికి పెంపుచేయాలనే దిశగా కేంద్రంతో సంప్రదించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. సాధారణంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కఠినమైన ద్రవ్య లోటు లక్ష్యాలను అనుసరిస్తుంది. గతంలో కోవిడ్ మహమ్మారి లేదా తీవ్రమైన జాతీయ విపత్తుల సమయంలో మాత్రమే అన్ని రాష్ట్రాలకు సడలింపులు ఇచ్చింది. ఇప్పుడు ఎల్ నినో వల్ల కేవలం తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ప్రభావం ఉంటుంది కాబట్టి, ఒకే రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎఫ్ఆర్బీఎమ్ పరిమితి పెంచడం కేంద్రానికి నిబంధనల రీత్యా అనుమతి ఇస్తుందా లేదా అనేది ప్రభుత్వ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

రైతులను ఆదుకోండి!

>> హామీలకు హాలిడే, ఆరు గ్యారెంటీలకు హాలిడే, క్రాప్ హాలిడే, పవర్ హాలిడే, పీఆర్సీకి హాలిడే, రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు హాలిడే.. ఇలా అన్ని రంగాల్లోనూ ప్రజలకు నిరాశే మిగిలిందని కేటీఆర్ విమర్శించారు. రైతులు పంటలను కాపాడుకోలేని పరిస్థితి, పరిశ్రమలు కరెంట్ కోతలతో ఇబ్బందులు పడే పరిస్థితి, ఉద్యోగులు తమ హక్కుల కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, ప్రజల సమస్యలను పరిష్కరించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలం వెళ్లదీస్తోందని మండిపడ్డారు. రైతుల నుంచి సెల్ఫ్ డిక్లరేషన్లు తీసుకునే పరిస్థితి రావడం ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని పేర్కొన్నారు.ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, కరువు పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాలని, పెండింగ్‌లో ఉన్న రైతుబంధు నిధులు విడుదల చేయాలని, సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయాలని, విద్యుత్ కోతలను నివారించాలని డిమాండ్ చేశారు. మూసీ సుందరీకరణ పేరుతో చేపట్టిన ప్రాజెక్టును వెంటనే నిలిపివేసి, ఆ లక్షన్నర కోట్ల రూపాయలను ప్రజల సంక్షేమానికి, రైతుల ఉపశమనానికి వినియోగించాలని కోరారు. అన్ని పథకాలకు, అన్ని రంగాలకు హాలిడే ప్రకటిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికే ప్రజలు హాలిడే ఇస్తే రాష్ట్రానికి పట్టిన దరిద్రం పోతుందని కేటీఆర్ పిలుపునిచ్చారు. సాగునీళ్ల లేక, కరెంట్ కోతలతో ఓవైపు పంటలు ఎండిపోతుంటే.. రేవంత్ రెడ్డి మాత్రం కమీషన్ల కోసం మూసీ సుందరీకరణ జపం చేస్తున్నారని కేటీఆర్ ఫైర్ అయ్యారు. ఎవరు అడిగారు మూసీ సుందరీకర? డీపీఆర్ లేకుండానే లక్షన్నర కోట్ల దోపిడీకి స్కెచ్ వేశారని ఆరోపించారు. మూసీ సుందరీకరణ పేరుతో రేవంత్ రెడ్డి ఆడుతున్న డ్రామాలను వెంటనే బంద్ చేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి నివేదికలు, ప్రజల అంగీకారం లేకుండా తీవ్ర విధ్వంసం సృష్టిస్తున్న ఈ ప్రాజెక్టు వల్ల ఎవరికీ ఎలాంటి లాభం లేదని కేటీఆర్ స్పష్టం చేశారు. ఒకవైపు ప్రజలను నరకయాతనకు గురిచేస్తూ, హాలిడేల పేరుతో వారి జీవితాలను ఇబ్బందుల్లోకి నెట్టిన కాంగ్రెస్ పార్టీ నేతలు, రేవంత్ రెడ్డి తదితరులు కమీషన్లతో జాలీ దేస్ గడుపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూసీ ప్రాజెక్టును వెంటనే ఆపి, ఆ లక్షన్నర కోట్లతో ప్రజలను ఆదుకోవాలని కోరారు.తాగునీటికి కష్టాలు ఉన్నప్పటికీ రూ.1,50,000 కోట్లతో మూసీ బ్యూటిఫికేషన్ ప్రాజెక్టుకు టెండర్లు పిలవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రాష్ట్రంలో వర్షాలు లేక కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో కరువు తాండవిస్తున్నా, తాగునీటి ఎద్దడి ఉన్నా పట్టించుకోకుండా ప్రభుత్వం మూసీ సుందరీకరణ ప్రాజెక్టుకు లక్షన్నర కోట్లు కేటాయించి దానిపైనే పూర్తిగా దృష్టి పెట్టడం విచిత్రంగా ఉందన్నారు,మూసీ సుందరీకరణపై ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలను, బాధితులను, ప్రజాప్రతినిధులను మాట్లాడనివ్వకుండా అణచివేశారని, ఇది ప్రజాస్వామ్యానికి విరుద్ధమని కేటీఆర్ తెలిపారు. రాష్ట్రంలో కరువు పరిస్థితులు నెలకొన్నా, రైతులు ఇబ్బందులు పడుతున్నా, పరిశ్రమలు కరెంట్ కోతలతో సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. రాష్ట్రం కరువుతో, కరెంట్ కోతలతో తల్లడిల్లుతుంటే గ్లోబల్ సమ్మిట్ పేరుతో గోబెల్స్ సమ్మిట్ నిర్వహిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. ఒకవైపు పొదుపు మంత్రం పాటించాలని చెబుతూ, వందల కోట్ల రూపాయలు ప్రచారం కోసం, ఫ్లెక్సీల కోసం, ప్రకటనల కోసం దుబారా చేస్తున్నారని ఆరోపించారు. ఈ రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక కొత్త పెట్టుబడి, కొత్త ఉద్యోగం తీసుకురాలేకపోయిందని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఐటీ ఉద్యోగాలు తగ్గాయని స్వయంగా ప్రభుత్వమే చెప్పిందని గుర్తు చేశారు. తాము దిగిపోయేనాటికి 9,46,000గా ఉన్న ఐటీ ఉద్యోగాలు.. కాంగ్రెస్ సర్కారు వచ్చాక 7,000 వరకు తగ్గాయని ప్రభుత్వం ఒప్పుకుందని తెలిపారు.

ఆకాశం ఎర్రబడింది!

చత్తీస్‌గఢ్‌లో అరుదైన ఆవిష్కరణ



రాయ్‌పూర్, అక్టోబరు 29: ఛత్తీస్‌గఢ్‌లో ఆకాశం ఒక్కసారిగా ఎర్రగా, రక్తం రంగులోకి మారిపోవడం స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. అర్నబ్ తుఫాను కారణంగా ఈ ప్రాంతంలో వీస్తున్న ఈదురు గాలులు, అస్థిరమైన వాతావరణం నడుమ ఈ వింత దృశ్యం ఆవిష్కృతమైంది. ఆకాశం ఎరుపు రంగులోకి మారిన వీడియోలు, ఫోటోలు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ కావడంతో, దీని వెనుక ఉన్న కారణాలపై తీవ్ర స్థాయిలో చర్చ నడుస్తోంది. మధ్య భారతంలో అర్నబ్ తుఫాను అవశేషాలు ముందుకు కదలడంతో భారీ వర్షాలు, బలమైన గాలులు, ఉరుములతో కూడిన తుఫాను హెచ్చరికలు జారీ అయ్యాయి. సరిగ్గా ఇదే సమయంలో ఈ ఎర్రటి ఆకాశం కనిపిచేసరికి అందరి దృష్టి దీనిపై పడింది. అయితే, ఈ ఎరుపు రంగు ఆకాశానికి తుఫాను వంటి వాతావరణ పరిస్థితులు కొంతవరకు దోహదపడి ఉండవచ్చు. కానీ అర్నబ్ తుఫానుకు, ఈ రంగు మార్పునకు ప్రత్యక్ష సంబంధం ఉందనడానికి ఇప్పటివరకు స్పష్టమైన ఆధారాలు లేవని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఆకాశం ఎరుపు రంగులోకి మారడానికి సూర్యకాంతి వాతావరణంలోని అణువులు, కణాల ద్వారా చెల్లాచెదురు అవ్వడమే ముఖ్య కారణమట. ముఖ్యంగా సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో సూర్యకాంతి వాతావరణంలో ఎక్కువ దూరం ప్రయాణించాల్సి వస్తుంది. ఆ సమయంలో తక్కువ తరంగదైర్ఘం కలిగిన నీలం రంగు కాంతి ఎక్కువగా చెల్లాచెదురై పోతుంది. ఇక, ఎక్కువ తరంగదైర్ఘం ఉన్న ఎరుపు, నారింజ రంగులు మాత్రమే మన కంటికి స్పష్టంగా కనిపిస్తాయి. దీనిని శాస్త్రీయంగా రేలీ స్కాటరింగ్ అంటారు. దీనికి తోడు వాతావరణంలో దుమ్ము, పొగ, నీటి బిందువులు వంటి పెద్ద కణాలు ఉన్నప్పుడు ఎరుపురంగు తీవ్రత ఇంకా పెరుగుతుంది. తుఫాను మేఘాలు, దుమ్ము, వెలుతురు నీడల కలయిక వల్ల కొన్ని ప్రత్యేక పరిస్థితుల్లో ఆకాశం ఇలా అత్యంత భయానకం గా, ఎర్రగా కనిపిస్తుంది. ఈ అంశంపై శాస్త్ర వేత్తలు ఇంకా పరిశోధనలు జరుపుతూనే ఉన్నారు. ఈ తరుణంలో స్థానికులు అధికారులు జారీచేసే హెచ్చరికలను పాటిస్తూ జాగ్రత్తగా ఉండాలి.

ఎల్‌నినో.. వాతావ'రణం'

పెరగనున్న పగటి ఉష్ణోగ్రతలు

మానవాళి మనుగడకు పెనుముప్ప

ఆరు నెలల్లో భారత్‌లో 55 వేల మరణాలు

క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ నివేదిక



న్యూఢిల్లీ, అక్టోబరు 29: పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన ఎల్ నినో ప్రపంచాన్ని వణికిస్తోంది. దీని ప్రభావం వల్ల ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర వాతావరణ మార్పులు సంభవించ బోతున్నాయి. ఈ ఏడాది ఎల్ నినో భారతదేశంపై తీవ్ర ప్రతికూల ప్రభావాలు చూపించే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ రూపొందించిన ఎల్ నినో హీట్ మోర్టాలిటీ ట్రాకర్ అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా వచ్చే ఆరు నెలల్లో అధిక ఉష్ణోగ్రతల కారణంగా 3.73 లక్షల మంది ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇందులో భారత్‌లో అక్టోబర్ నుంచి వచ్చే ఏడాది మార్చి మధ్య సుమారు 55వేల మంది ఉష్ణ సంబంధిత మరణాలు నమోదు కావచ్చని అంచనా వేసింది. వీటిలో అత్యధిక మరణాలు మార్చిలోనే నమోదయ్యే అవకాశం ఉందని చెప్పింది. భూమిపై వాతావరణ పరిస్థితుల్ని తీవ్రంగా ప్రభావితం చేసే సహజ వాతావరణ దృగ్విషయాల్లో ఎల్ నినో ఒకటి. ఈ ఏడాది ఇది అసాధారణ స్థితికి చేరబోతున్నట్లు నిపుణులు చెబుతున్నారు. సెప్టెంబర్ నాటికి భూమధ్యరేఖకు సమీపంలోని పసిఫిక్ మహాసముద్రం మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు 3.08 డిగ్రీల మేర పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. గతంలో నమోదైన ఎల్ నినోలతో పోలిస్తే ఇది అత్యధిక స్థాయి. దీంతో ఈ ఏడాది ఏర్పడిన ఎల్ నినోను సూపర్ ఎల్ నినోగా అభివర్ణిస్తున్నారు. దీని ప్రభావం వల్ల కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు సాధారణంగా పెరిగితే, మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాల కారణంగా వరద ముప్పు కలుగవచ్చు. ప్రపంచ వాతావరణ సంస్థ ఈ ఏడాది ఎల్ నినో 1950 తర్వాత అత్యంత బలమైనదిగా మారింది. డిసెంబర్‌లో ఎల్ నినో ఎఫెక్ట్ గరిష్ట స్థాయికి చేరవచ్చు. క్లైమేట్ ఇంపాక్ట్ ల్యాబ్ రూపొందించిన ఎల్ నినో హీట్ మోర్టాలిటీ ట్రాకర్ ప్రకారం భారత్ లాంటి గ్లోబల్ సౌత్ దేశాల్లో అత్యధిక మరణాలు నమోదయ్యే అవకాశం ఉందని హెచ్చరించింది. అక్టోబర్ నుంచి మార్చి వరకు భారత్‌లో సుమారు 55 వేల మరణాలు సంభవించొచ్చని అంచనా వేసింది. నైజీరియాలో 56 వేల మరణాలు సంభవించే అవకాశం ఉందని పేర్కొంది. ఆగ్నేయాసియాలో కూడా ఎల్ నినో ప్రభావం గణనీయంగా ఉంటుందని చెప్పింది. ఇండోనేషియాలో 29 వేలు, బ్రెజిల్‌లో 19 వేల మంది ఉష్ణోగ్రత సంబంధిత కారణాల వల్ల మరణించొచ్చు.

సైబర్ నేరాలకు బ్యాంకులదే బాధ్యత

బాధితులకు పరిహారం చెల్లించేలా జవాబుదారీగా చేయాలి

ప్రతిపాదిత నియంత్రణ చట్రంలో నిబంధనలు చేర్చాలి

కేంద్రానికి, ఆర్‌బిఐకి సుప్రీంకోర్టు త్రిసభ్య ధర్మాసనం ఆదేశం



న్యూఢిల్లీ, అక్టోబరు 29: సైబరా నేరాలు, డిజిటల్ మోసాల బాధితులకు నష్టపరిహారం చెల్లించేలా బ్యాంకులను జవాబుదారీగా చేయాలి. ఒకవేళ బ్యాంక్ తగిన శ్రద్ధ వహించడంలో విఫలమవడం వల్లే మోసం జరిగినట్లు రుజువైతే, డిజిటల్ అరెస్టుల వంటి నేరాల బాధితులకు వారు కోల్పోయిన మొత్తాన్నైనా నష్టపరిహారంగా అందించాలి. బాధితులకు తగిన నష్టపరిహారం అందించేందుకు ప్రతిపాదిత నియంత్రణ చట్రం తప్పనిసరిగా నిబంధనలు కల్పించాల్సి అని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. విడియో కాల్ చేసి డిజిటల్ అరెస్ట్‌తో జరుగుతున్న సైబర్ నేరాల అంశంపై చీఫ్ జస్టిస్ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రి సభ్య ధర్మాసనం గురువారం విచారణ జరుపుతూ, ఈ వ్యాఖ్యలు చేసింది. డిజిటల్ లావాదేవీల పేరుతో జరుగుతున్న మోసాలను అరికట్టడంలో బ్యాంకుల పాత్ర అత్యంత కీలకమని విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం అభిప్రాయపడింది.
డిసెంబరు 31 నాటికి అమల్లోకి రానున్న ఆర్‌బిఐ కెవైసి సవరణ ఆదేశాలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు తెలిపింది. ప్రతిపాదిత మార్గదర్శకాల పరిధిలోకి వచ్చే ఆర్థిక సంస్థల వివరాలను, బాధితులకు నష్టపరిహారం అందించడానికి పరిశీలిస్తున్న చర్యలను తెలియజేయాలని ధర్మాసనం ఆర్‌బిఐని కోరింది. మోసపోతున్న వినియోగదారుల అసాధారణ లావాదేవీల గురించి సమీపంలోని పోలీస్ స్టేషన్లను అప్రమత్తం చేయడం బ్యాంకుల విధి అని తెలిపింది. ఖాతాదారుని నిర్ధారిత లావాదేవీల నరళికి భిన్నంగా ఉండే అసాధారణ లావాదేవీలను తాత్కాలికంగా నిలిపివేయడం, అనుమానాస్పద కార్యకలాపాలపై ఆటోమేటెడ్ రిపోర్టింగ్, లావాదేవీల ప్రామాణికతను నిర్ధరించడానికి భౌతిక ధ్రువీకరణ వంటి తప్పనిసరి నివారణ చర్యల అవసరాన్ని గుర్తు చేసింది. 'డిజిటల్ అరెస్ట్' పేరుతో అమాయకులను భయపెట్టి డబ్బులు వసూలు చేస్తున్న సైబర్ నేరాలపై సుప్రీంకోర్టు సుమోటోగా విచారణ చేపట్టింది. ఈ కేసులో జోక్యం చేసుకునేందుకు వాట్సాప్ సంస్థకూ అనుమతి ఇచ్చింది. ఈ సందర్భంగా ఇప్పటివరకు 9,400 అనుమానాస్పద ఖాతాలను నిషేధించినట్లు ఉన్నత న్యాయస్థానానికి వాట్సాప్ వెల్లడించింది. విచారణ సందర్భంగా కేంద్రం, ఇతర అధికారుల తరఫున హాజరైన అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి, గత యేడాదితో పోలిస్తే నమోదైన డిజిటల్ అరెస్టు కేసులు సుమారు 50శాతం తగ్గాయని కోర్టుకు తెలిపారు. కోర్టు జోక్యం, ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు, విభాగాల సమన్వయ చర్యలు, ప్రజా అవగాహన ప్రచారాల వల్లే ఈ తగ్గుదల సాధ్యమైందని ఆయన పేర్కొన్నారు. మరోవైపు విద్యావంతులైన పౌరులు కూడా ఇలాంటి డిజిటల్ మోసాలకు ఎలా బలి అవుతున్నారంటూ సుప్రీం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ప్రజా చైతన్య కార్యక్రమాలు, వార్తా కథనాలు, కోర్టు ఆదేశాలు ఉన్నప్పటికీ ప్రజలు ఇంకా మోసపోతుండటం పట్ల భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

జిఆర్ఎంబి చైర్మన్‌గా వినీత్ గుప్తా

నేడు జిఆర్ఎంబి సమావేశం

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: గోదావరి నది యాజమాన్య బోర్డు చైర్మన్‌గా వినీత్‌గుప్తాను నియమించారు. ప్రస్తుత చైర్మన్ పద్మ దోర్జే గ్యాంబను డబ్యుపిఅండ్‌పికు బదలీ చేశారు. సెంట్రల్ వాటర్ ఇంజనీరింగ్ సర్వీస్‌లోని హ్యార్ అడ్మినిస్ట్రేటివ్‌గ్రేడ్ గ్రూప్-ఎ ఆఫీసర్లు, సీనియర్ అడ్మినిస్ట్రేటివ్ అధికారులు ఐదుగురికి స్థానచలనం కల్పించారు. ఇందులో రవీందర్ డి దేశ్‌పాండే, పియూష్‌కుమార్ వినీత్‌గుప్తాలకు పదోన్నతిపై పోస్టింగ్ ఇచ్చారు. పద్మ, డిఎస్‌చాస్కర్ బదలీపై వెళుతున్నారు. మరోవైపు నేడు జిఆర్ఎంబి సమావేశం జరుగుతోంది. కొత్తగా పోస్టింగ్ ఇచ్చిన వారు వెంటనే విధుల్లో చేరిపోవాలని కేంద్ర సర్కారు సెక్రటరీ జితేంద్రకుమార్ ఆదేశించారు.

గవర్నర్‌తో హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి భేటీ

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ పి. సామ్ కోషి గురువారం సాయంత్రం లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు.



ప్రధానమంత్రి దీపావళి కానుక పేరుతో కొత్తరకం మోసం

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: ఎంత కఠినమైన ఆంక్షలు పెడుతున్నా.. ప్రజలు ఎంత అప్రమత్తంగా ఉన్నా.. సైబర్ నేరగాళ్లు మాత్రం కొత్త ప్లాన్లు వేస్తూ ప్రజల్ని మోసం చేసే ప్రయత్నాలు చేయడం మాత్రం ఆపడం లేదు. లేటెస్ట్‌గా ప్రధానమంత్రి దీపావళి కానుక పేరుతో కొత్త రకం మోసానికి తెరలేపారు సైబర్ కేటుగాళ్లు. ప్రధానమంత్రి, కేంద్ర ప్రభుత్వం పథకం పేరుతో దీపావళి పండుగ సందర్భంగా ప్రజలకు రూ.8,000 ఇస్తామంటూ వాట్సాఎ ్లో ప్రచారనం చేస్తున్నారు. అనుమానాస్పద వెబ్‌సైట్ లింక్‌లపై క్లిక్ చేయాలని సందేశాలు పంపుతున్నారు. నకిలీ లింక్‌ల ద్వారా వ్యక్తిగత, బ్యాంకింగ్ వివరాలు తస్కరించేందుకు ప్రయత్నిస్తున్నారు. సైబర్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేస్తున్నారు. యుపిఐ ద్వారా అక్రమ లావాదేవీలు, మొబైల్‌లో హానికరమైన సాఫ్ట్‌వేర్ ప్రవేశపెట్టే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెస్తాం

తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బక్కని నర్సింలు

వనపర్తి, అక్టోబరు 29, ప్రభాతవార్త : రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తెచ్చేందుకు తాము శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నామని తెలుగుదేశం పార్టీ జాతీయ పొలిటి బ్యూరో సభ్యులు పార్టీ అధ్యక్షులు భక్కని నర్సింలు వెల్లడించారు. గురువారం రోజు ఆత్మకూరు మండలంలోని మల్లాపురం ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు తెలంగాణలో మీకోసం పాదయాత్ర చేపట్టి 14 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మల్లాపురం ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్ర ప్రజలకు రాజకీయం నేర్పిన ఘనత కీర్తిశేషులు నందమూరి తారక రామారావుకు దక్కుతుందని, అనంతరం చంద్రబాబు నేతృత్వంలో తెలుగుదేశం పార్టీ పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణం పట్టిస్తాం చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర విభజన అనంతరం టిడిపిలో స్తబ్ధత నెలకొన్న విషయం వాస్తవమేనని ప్రస్తుత పరిస్థితిలో రాష్ట్ర రాజకీయాల్లో భ్రష్టు పట్టాయని గ్రామీణ ప్రాంత ప్రజలకు సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అందాలంటే తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అంతకు ముందుగా ఆయన ఆత్మకూరు పట్టణంలోని కీర్తిశేషులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ తెలంగాణ రాష్ట్ర లీగల్ అడ్వైజర్ దివాన్ జి అశోక్ కుమార్, నందమూరి బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్టిడి శ్రీనివాసులు, స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుపతయ్య గౌడ్, కట్టెలమండి రాములు, వెంకటేష్, నారాయణ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సామినేని రామారావు హత్య కేసులో ఎట్టకేలకు వీడిన మిస్టరీ

నలుగురు నిందితుల అరెస్టు

హత్యకు ఉపయోగించిన కత్తులు, సెల్‌ఫోన్లు ఇతర వస్తువులు స్వాధీనం

విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించిన పోలీస్ కమిషనర్ సునీల్‌దత్

ఖమ్మం క్రైమ్, ప్రభాతవార్త: ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడు మాజీ సర్పంచ్, సిపిఎం నాయకుడు సామినేని రామారావు హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ కేసులో నలుగురు నిందితులను వైరా సబ్‌డివిజన్ పోలీసులు హత్య జరిగిన యేడాదికి ఒక్కరోజు ముందు అరెస్టు చేశారు. స్పెషల్ బ్రాంచ్ కాన్ఫరెన్స్‌హాల్‌లో గురువారం విలేకరుల సమావేశంలో ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ వైరా ఏసిపి సారంగపాణితో కలిసి వివరాలు వెల్లడించారు. 2025 అక్టోబరు 31వ తేదీ ఖమ్మం జిల్లా చింతకాని మండలం పాతర్లపాడుకు చెందిన స్వామినేని రామారావు (72) తెల్లవారుజామున తన ఇంటి పక్కన ఉన్న కొట్టంలో హత్యకు గురయ్యాడు. ఈ ఘటనపై చింతకాని పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా క్లూస్ టీం, ఫోరెన్సిక్‌సైన్స్ బృందం సహాయంతో ఘటన స్థలాన్ని పరిశీలించి నిందితుల సంబంధించినవిగా అనుమానిస్తున్న చెప్పులు, కాలి పాదముద్రలు, ఎరుపురంగు వస్త్రపు ముక్క, తెలుపు రంగుపై నల్లటి గీతలు ఉన్న మరొక వస్త్రపు ముక్కను కత్తి కవర్‌తోపాటు ఇతర భౌతిక ఆధారాలను పోలీసులు సేకరించి, మృతుడి శరీరంపై ఉన్న గాయాలు, ఘటన స్థల పరిస్థితులు, సాక్షుల వాంగ్మూలాలు పోలీసులు సేకరించినట్లు సిపి తెలిపారు. హత్య కేసులో నిందితులను గుర్తించేందుకు పోలీ సులు విస్తృత స్థాయిలో సాంకేతిక దర్యాప్తు చేపట్టారని, దర్యాప్తులో భాగంగా ఫిర్యాదులో పేర్కొన్న అనుమా నితులు, సాక్షులు, ఫిర్యాదు దారులు తెలిపిన వివరాల ఆధారంగా ఈ కేసులో మొత్తం 24 మందిని అను మానితులుగా గుర్తించా మన్నారు. అనుమానితులుగా గుర్తించిన వ్యక్తులకు పాలిగ్రాఫ్ పరీక్షలు నిర్వహించేందుకు ఖమ్మంలోని మూడవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు అనుమతి కోరామని, కోర్టు సమన్లు అందుకున్న వారిలో ఆరుగురు వ్యక్తులు మాత్రమే స్వచ్ఛందంగా అనుమతి తెలిపారని, తదనుగుణంగా 2026 జనవరిలో కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో ఫోరెన్సిక్ లాబరోటిలో ఈ పరీక్షలు నిర్వహించామని తెలిపారు. దర్యాప్తును మరింత బలోపేతం చేసేందుకు గుజరాత్ రాష్ట్రం గాంధీనగర్‌లోని నేషనల్ ఫ్లోరెన్స్ సైన్సెస్ నిపుణుల సహకారం కోరామని, ఆరుగురు సభ్యులతో కూడిన నిపుణుల బృందం ఖమ్మంకు వచ్చి ఫోరెన్సిక్ విశ్లేషణ నిర్వహించిందన్నారు. దర్యాప్తులో సేకరించిన భౌతిక సాంకేతిక ఆధారాలు ఇతర సంబంధిత సమాచారాన్ని విశ్లేషించిన అనంతరం నలుగురు నిందితులను గురువారం అరెస్టు చేశామని సిపి సునీల్ దత్ వెల్లడించారు. అరెస్ట్ అయిన నిందితులు ఖమ్మం రూరల్ మండలం తెల్లాలపల్లి గ్రామానికి చెందిన బోడపట్ల శ్రీనివాసరావు అలియాస్ మెంటల్ శ్రీను, నూకల లింగయ్య, మల్లారపు లక్ష్మయ్య, కర్లపూడి ఉదయ్ కుమార్ నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని నిందితుల నుంచి నేరానికి ఉపయోగించినట్లు ఆరోపణలు ఉన్న రెండు కత్తులు, నిందితులు రెక్కీ నిర్వహించే సమయంలో ఉపయోగిం చినట్లు ఆరోపణలు ఉన్న నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సామినేని రామారావు హత్య కేసులో వైరా ఏసిపి సారంగపాణి పాత్ర కీలకమని సిపి సునీల్ తెలిపారు. ఈ హత్య కేసు చేతనలో విశేష ప్రతిభ కనబరిచిన దర్యాప్తు బృందంలోని అధికారులు వైరా సీఐ వెంకటప్రసాద్, మధిర రూరల్ సీఐ మధు, ఎస్సైలు వీరేందర్, నరేష్, విశ్వతేజ సిబ్బందిని సిపి ప్రత్యేకంగా అభినందించారు.

న్యాయాన్ని హత్య చేసిన పోలీసులు

విలేకరుల సమావేశంలో తమ్మినేని, నున్న ధ్వజం

అసలైన హత్య హంతకులను పట్టుకొని శిక్షి ంచి చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులు న్యాయాన్ని, నిజాన్ని హత్య చేశారని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండల పరిధిలోని పాతర్లపాడు సిపిఎం పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మినేని, నున్న మాట్లాడుతూ సిపిఎం రాష్ట్ర నేత సామినేని రామారావును హత్యచేసి అతి కిరాతకంగా గత అక్టోబర్ 30వ తేదీ తెల్లవారుజామున హంత కులు తన ఇంట్లోనే వాకింగ్ చేస్తుండగా కత్తులతో పొడిచి చంపి పారిపోతే.. నేటికీ 365 రోజులు గడిచిన గాని ఇంతవరకు అసలైన హంతకులను వారి వెనుక ఉన్న రౌడీలను పట్టుకోకుండా అబద్ధాలు కట్టు కథలు అల్లుకొని.. మసిబూసి మారేడు కాయ చేసిన రీతిలో హంతకులు దొరికారు.. వారిని అరెస్టు చేసి రిమాండ్ చేశామని ప్రెస్ మీట్ పెట్టి సీపీ చెప్పటం సిగ్గుచేటన్నారు. భట్టి విక్రమార్క ప్రోద్బలంతో ఇప్పుడు అసలు హంతకులను తప్పించిన గాని ప్రభుత్వం మారిన వెంటనే నిజమైన హంతకులను బొంద పెట్టే వరకు వదిలిపెట్ట మని ఆయన హెచ్చరించారు. ప్రజలు పాతర్లపాడును సిపిఎం కంచుకోటగా మార్చారని రామారావు ఆశయం నిజమైన సార్థకం అవుతుందని అన్నారు

నిమ్స్‌పై ముప్పేట దాడి

ఏకకాలంలో ఎసిబి, డ్రగ్ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

40 మంది అధికారులు, సిబ్బందితో

వివిధ విభాగాల్లో దర్యాప్తు

డాక్టర్ లక్ష్మీభాస్కర్ కేసు దర్యాప్తుతో విస్తరించిన విచారణ.. పదేళ్లకు పైగా వ్యవహారాలపై ఆరా

హైదరాబాద్ (జూబ్లీహిల్స్), అక్టోబరు 29, ప్రభాతవార్త: నిమ్స్ ఆసుపత్రిలో అవినీతి ఆరోపణలపై వివిధ ప్రభుత్వ శాఖలు ముప్పేట దాడులు చేపట్టాయి. ఏసీబీ, ఫుడ్ సేఫ్టీ, డ్రగ్ కంట్రోల్ విభాగాలకు చెందిన అధికారులు ఏకకాలంలో రంగంలోకి దిగి ఆసుపత్రిలోని పరిపాలనా విభాగం, క్యాంటీన్, మెడికల్, సర్జికల్ స్టోర్లలో తనిఖీలు నిర్వహించారు. సుమారు 40 మందికి పైగా అధికారులు ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. నిమ్స్ అదనపు మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నోరి లక్ష్మీ భాస్కర్ సంబంధించిన ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు నిర్వహించింది. తొలిదశలో సుమారు రూ.6.13 కోట్ల విలువైన ఆస్తులకు సంబం ధించిన పత్రాలను గుర్తించగా, తదుపరి సోదాల్లో అనుమానిత బినామీలుగా భావిస్తున్న కొందరికి సంబంధించిన నగదు, భూములు, స్థలాల పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. అక్టోబర్ 13 నుంచి మూడు రోజులపాటు ఆయనను కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించారు. ఈ విచారణలో లభించిన సమాచారం, ఆర్థిక లావాదేవీలు, ఇతర ఆధారాల నేపథ్యంలో దర్యాప్తును మరింత విస్తరించినట్లు తెలుస్తోంది. తాజా తనిఖీల్లో భాగంగా ఏసీబీ అధికారులు నిమ్స్ పరిపాలనా విభాగంలో టెండర్లు, కాంట్రాక్టుల కేటాయింపు, బిల్లుల చెల్లింపులు, సంబంధిత ఆర్థిక లావాదేవీల రికార్డులను పరిశీలిస్తున్నారు. క్యాంటీన్‌లో ఫుడ్ సేఫ్టీ అధికారులు ఆహార పదార్థాల నాణ్యత, నిల్వలు, పరిశుభ్రతను తనిఖీ చేస్తుండగా, సర్జికల్ స్టోర్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు మందులు, వైద్య పరికరాల నిల్వలు, కొనుగోళ్ల పత్రాలను పరిశీలిస్తున్నారు. క్యాంటీన్, సెక్యూరిటీ, మెడికల్ షాప్, సర్జికల్ విభాగాలకు సంబంధించిన కాంట్రాక్టుల ప్రక్రియలో నిబంధనలు పాటించారా? కేటాయింపుల్లో అక్రమాలు చోటుచేసుకున్నాయా? అనే కోణాల్లోనూ విచారణ సాగుతున్నట్లు సమాచారం. 2014 నుంచి నిమ్స్‌లో జరిగిన వ్యవహారాలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. టెండర్ల ఆహ్వానం నుంచి కాంట్రాక్టుల ఖరారు వరకు జరిగిన ప్రక్రియ, బిడ్డర్ల అర్హతలు, బిల్లుల చెల్లింపులు, సంబంధిత వ్యక్తుల ఆర్థిక లావాదేవీలను అందుబాటులో ఉన్న సాంకేతిక ఆధారాలతో సరిపోల్చి విశ్లేషించే అవకాశం ఉంది. క్యాంటీన్, మెడికల్ స్టోర్ల నుంచి కొందరు కీలక అధికారులకు ముడుపులు అందాయన్న కోణంలోనూ విచారణ జరుగుతున్నట్లు నిమ్స్‌లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ విభాగాల నుంచి లక్షల్లో లంచాలు చేతులు మారినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ, ఈ మొత్తంపై అధికారికంగా ఎలాంటి ధ్రువీకరణ లేదు. లక్ష్మీ భాస్కర్‌కు సంబంధించిన గదిని కూడా అధికారులు సీజ్ చేశారు. ఉదయం నుంచి మొదలైన తనిఖీలు రాత్రి పొద్దు పోయేవరకు కొనసాగాయి. ఈ తనిఖీలు అర్ధరాత్రి వరకు కొనసాగుతాయా లేదంటూ మరో రోజు పొడగిస్తామా అనే విషయాన్ని స్పష్టం చేయలేమని తనిఖీలు చేపడుతున్న ఒక అధికారి తెలిపారు. మరోవైపు వివిధ విభాగాల్లోని కీలకమైన ఫైల్స్‌తోపాటు సాంకేతిక అంశాలపైన దృష్టి పెట్టినట్లు తెలుస్తుంది. ప్రస్తుత తనిఖీల్లో లభించే ఆధారాలు, పత్రాల విశ్లేషణ అనంతరం అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంది.



మందుల దుకాణంలో వివరాలను పరిశీలిస్తున్న డ్రగ్ కంట్రోల్ విభాగ అధికారులు

లంచం తీసుకుంటూ ఎసిబికి చిక్కిన జిపిఒ

రూ.50 వేలు డిమాండ్

రూ.22 వేలకు ఒప్పందం

కాగజ్‌నగర్‌రూరల్, అక్టోబరు 29, ప్రభాతవార్త : భూమి విరాసత్ ప్రక్రియకు సంబంధించి లంచం తీసుకుంటుండగా కాగజ్‌నగర్ మండలంలోని మోసం గ్రామ పంచాయతీ జీపీవో శ్రీనివాస్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. గురువారం కాగజ్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. ఏసీబీ డీఎస్పీ మధు తెలిపిన వివరాల ప్రకారం.. మోసం గ్రామ పంచాయతీకి చెందిన ఓ బాధిత కుటుంబం తమ తాత పేరిట ఉన్న 18 ఎకరాల భూమి విరాసత్ కోసం జీపీవో శ్రీనివాస్‌ను సంప్రదించారు. పట్టాదారు ఆధార్ కార్డులో పేరు తప్పుగా నమోదైందని, దాన్ని సరిచేసి సరైన పత్రాలతో ఉన్నతాధికారులకు సమర్పించేందుకు రూ.50 వేలు ఇవ్వాలని జీపీఓ బాధితుడిని డిమాండ్ చేశాడు. బేరసారాల అనంతరం రూ.22 వేలకు ఒప్పందం కుదిరిందని డిఎస్పీ వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఈ నెల 27న బాధిత కుటుంబం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏసీబీ అధికారులు చర్యలు చేపట్టారు. గురువారం బాధితుడి నుంచి డబ్బులు తీసుకుంటుండగా జీపీవో శ్రీనివాస్‌ను రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీబీ డీఎస్పీ వెల్లడించారు. ప్రభుత్వ అధికారులు ఎవరైనా ప్రభుత్వ పనులు చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లయితే ప్రజలు భయపడకుండా 9154388963,1064 నెంబర్‌కు సమాచారం అందించాలని డీఎస్పీ పేర్కొన్నారు. అవినీతికి పాల్పడే అధికారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.



లంచం తీసుకుంటూ ఎసిబికి పట్టుబడిన జిపిఒ శ్రీనివాస్

వార్త

మౌనం ఎల్లప్పుడూ బంగారం కాజాలదు.
అప్పడప్పుడూ అది అపరాధం అవుతుంది.

- అసన్

పేదరికం తగ్గేదెలా?

దేశంలో పేదరికం తగ్గిందన్న గణాంకాలు ఏమి చెప్పినా క్షేత్రస్థాయిలో పేదరికం ఇంకా వెక్కిరిస్తూనే ఉంది. ఆర్థిక వృద్ధి కొసచివర భాగంలో అలో లక్ష్మణా! అని ఏడవని వారు ఉన్నారని నిరూపితమయినప్పుడే పేదరికం తగ్గినట్లు భావించాల్సి ఉంటుంది. విభిన్న మానవాభివృద్ధి సూచికల్లో పేదరికం తాలూకు అంచనాలు వేర్వేరుగా ఉన్నప్పటికీ క్షేత్రస్థాయి పరిశీలనలో అంశాల క్రోడీకరణ అనూహ్యంగాఉంది. 2026 సంవత్సరం గ్లోబల్ హంగర్ ఇండెక్స్‌లో ప్రపంచంలోని 122 దేశాల్లో భారత్ 100వస్థానంలో ఉంది. ఈ సూచికను కొన్ని ఐరిష్, స్విస్, జర్మన్ సంస్థలు సంయుక్తంగా విడుదల చేశాయి. ఈ సూచిక ప్రకారం జనాభాలో 9.8 శాతం మంది ఇప్పటికే పోషకాహార లోపంతో బాధపడ్తున్నారు. ఐదేళ్లలోపు పిల్లల్లో 29శాతం మంది ఎదుగుదల లోపంతో ఉండగా కొంతమంది కనీస బరువును చేరుకోలేదు. ఇవన్నీ పేదరిక సూచీని నిష్ఫలం చేసేవే. సుస్థిరాభివృద్ధి అంశాలన్నీ సమర్థంగా చేరుకున్నప్పుడేదేశసౌభాగ్యం కనపడుతుంది. భారత్‌లో పేదరికం తగ్గిందనడానికి ఆయా ప్రభుత్వాలు చేపట్టిన సంస్కరణ, అభి వృద్ధి గణాంకాలను ప్రాతిపదికగా తీసుకోవడం వలనే వాస్తవికతను ప్రతిబింబింప చేయలేకపోవడం గమనార్హం. 2011-12లో నీతి ఆయోగ్ అంచనాల మేరకు దేశంలో 29.2 శాతంగా ఉన్న పేదరికం 2022-23 నాటికి 11.28 శాతం తగ్గినట్లు అంచనా వేయబడింది. ఈ మధ్యకాలంలో సుమారు 24.82 కోట్ల మంది బహుళ అంశాలలో పేదరికం నుంచి బయటపడినట్లు గోచరమవు తోంది. అయినా భారత్‌లో తీరని పేదరికం ఉందని పలుఅంశాలపై చర్చకు వచ్చినప్పుడు అవగతమవుతోంది. దేశం ఎన్నో విధాలుగా అత్యంత వేగంగా ఎదుగుతున్న ఆర్థికవ్యవస్థకు తార్కాణంగా ఉన్నప్పటికీ పేదల జీవన విధానం కానీ జీవన స్థాయి కానీ ఏమాత్రం మారలేదు. కానీ స్వల్పదాయ వర్గాలు మధ్యాదాయ వర్గాలుగా ఎంత మంది మారారు? అలాగే మధ్యాదాయవర్గాలు ఉన్నతవర్గాలుగా మారినవారు ఎంతమంది? అన్న అంశంలో కూడాపెద్దగా స్పష్టత కనిపించదు. కానీ పేదరికం తగ్గిపోయినట్లే సూచీల విషయంలో కూడా కొంత అస్పష్టత ఉంది. గణాంకాల పరంగా పేదరికం తగ్గినట్లున్నా నాణ్యమైన జీవన ప్రమాణాల దృష్ట్యా క్షేత్రస్థాయిలో పరిశీలనలు ఎన్నో సందేహాలు మిగులుస్తున్నాయి. ఐక్యరాజ్య సమితి సుస్థిరాభివృద్ధి లక్ష్యాలలో భారత్‌లో 2030 నాటికి పేదరికాన్ని నిర్మూలించాలన్న అంశం ప్రధానంగా ఉంది. దేశంలో 2021 -2025ల మధ్య 415 మిలియన్ల మంది ప్రజలు పేదరికం నుంచి గట్టెక్కిన విషయాన్ని కొన్ని సర్వే నివేదికలు తేటతెల్లం చేస్తున్నాయి. 2023 నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం ఈ అయిదేళ్లలో భారత్‌లో10శాతంమంది పేదరికం నుంచి గట్టెక్కారు. ఇలాంటి సానుకూల మార్పులకు దోహదపడు తున్న అంశాల్లో జరిగిన సర్వేల్లో వాస్తవిక దృక్పథమే కనపడుతోంది. కానీ పేదలు, నిరుపేదలు ఇప్పటికీ ఆకలి కేకలువేస్తున్న సందర్భాలు మనంచూస్తూనే ఉన్నాం. ఆర్థిక వ్యవస్థ ఎంతగా అభివృద్ధి చెందుతున్నా సంపద కొన్ని వర్గాల వద్ద మాత్రమే కేంద్రీకృతమైంది. సంపన్నులు మరింత సంపన్నులుగా, పేదలు మరీపేదలుగా మిగిలిపోతున్నారనే భావన ఉంది. ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులలో నాణ్యత లోపించడంవల్ల ప్రైవేట్ రంగంలోకి మారడంతో ఆ విధంగా అయ్యే వ్యయం కుటుంబ ఆదాయవృద్ధిని దెబ్బతీస్తోంది. ఉచితాలు ఎన్నిఅందుతున్నా వాటిలో పోషకాహార స్థాయి తక్కువగా ఉన్నందున ప్రతి గృహస్థు బహిరంగ మార్కెట్‌ను ఆశ్రయించాల్సి వస్తోంది. స్థిరమైన ఉపాధి కల్పన, నాణ్యమైన విద్యసరసమైన ఫీజులకు అంది వ్వడం, నైపుణాభివృద్ధికి ప్రోత్సహమిచ్చే పథకాలను ప్రవేశ పెట్టే విషయంలో కేంద్రప్రభుత్వానికి ఇంకా బాధ్యతఉంది. ప్రభుత్వాలు అందించే ఉచిత రేషన్ నగదు బదిలీ వంటి పథకాలవల్ల తాత్కాలిక ఊరటమాత్రమే లభిస్తోంది. తప్ప స్వయం సమృద్ధి సాధించినట్లు కాదు. ఉద్యోగ లేదా ఉపాధి రహిత వృద్ధి వలన ఎంతో మందికి ఉపాధి లభిస్తోందని భావించినప్పటికీ తగిన వేతనాలు లేక వారి కొనుగోలు శక్తి అంతంత మాత్రంగానే ఉంది. తాత్కాలిక ఉపాధి ఎన్నడూ శాశ్వత జీవన వృద్ధి కానేరదు. ఏది ఏమయినా కారణంఏదైనా ఇటీవలి కాలంలో పెరిగిననిత్యావసర వస్తువులు, ఇంధన, విద్యుత్, రవాణాధరలుసామాన్య మానవుని జీవన వ్యయాన్ని కుదేలుచేస్తున్నాయి. పేదరికమంటేఅదొక సామాజిక ఆర్థిక వేదనగా అన్నిదేశాలు గుర్తించినా భారతదేశం అంతర్గత సామాజిక జీవనాన్ని ప్రత్యేకంగానే గుర్తించాలి. కనీస అవసరాలైన ఆహారం, గృహవసతి, దుస్తులు పొందలేని పరిస్థితిని దుర్భరంగా భావిస్తాము. పేదరిక నిర్మూలన, సామాజిక పురోగతి కోసం చేపడుతున్న కార్యక్రమాలకు, పెరుగుతున్న ఆర్థికఅసమానతల వలన కలుగుతున్న ప్రయోజనాలకు మధ్య కొన్ని అంతరాలున్నాయి. వాటిని తొలగించే ప్రక్రియ సజావుగా సాగితే సంపన్నులు, పేదలు అనే రెండువర్గాల మధ్య ఎంతోకొంత తారతమ్యాలు తగ్గుతాయి. 1990నాటి మొత్తం జనాభాలో 36శాతం మంది పేదరికంలో ఉంటే 2025 నాటికి అది 10శాతానికి మాత్రమే తగ్గినట్లని వివిధ సర్వేలు చెబుతున్నాయి. జీవన ప్రమాణాల సూచికలో తీసుకురాగలిగిన గణనీయ ప్రగతిమాత్రమే పురోగతిగా చెప్పుకోగలిగిన విషయం. దేశంలోని ప్రతి నలుగురిలోనూ ఒకరు పేదరికంలో ఉన్నారని చెప్పుకునే స్థాయి నుంచి, ప్రతి పదిమందిలో ఒక్కరు మాత్రమే పేదరికంలో మగ్గుతున్నారని చెప్పుకోదగిన స్థాయి అనగానే అది పేదరికం తగ్గిందనడానికి సంకేతమే. మరిన్ని ప్రజాప్రయోజనకర ప్రణాళికలు ద్వారా పేదరికాన్ని మరికొంత మేరకు తగ్గించవచ్చు. అందరికీ ఉపాధి దొరికిన సందర్భాల్లో పేదరికం తగ్గి ఆదాయ అసమానతలు తగ్గుతాయి. తద్వారా పేదరికం తగ్గిందని చెప్పుకోవడానికి మరో పెద్ద మంత్రదండం మనవద్ద ఉన్నట్లే.

చైనా ఆర్థిక మందగమనం భారత్‌పై ప్రభావం

చైనా ఆర్థికవ్యవస్థలోని బలహీనతలు భారత్‌కు ఒక అవకాశ ద్వారాన్ని తెరిచాయి. కానీ ఆ ద్వారం గుండా ముందుకు సాగడానికి కేవలం అనుకూల అంతర్జాతీయ పరిస్థితులు సరిపోవు. దేశీయ సంస్కరణలు, ఉత్పాదకత పెంపు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశ్రామిక విధానాల సమర్థ అమలు అత్యవసరం. వ్యవసాయం నుంచి ఆధునిక తయారీ వరకు, చిన్న పరిశ్రమల నుంచి ప్రపంచ స్థాయి సంస్థల వరకు అన్ని రంగాలూ పరస్పరం బలపడేలా అభివృద్ధి వ్యూహం ఉండాలి. చైనా ఎదుర్కొంటున్న సమస్యలను భారత్ తన విజయానికి ఆధారంగా భావించకూడదు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో మార్పులు ఎప్పటికప్పుడు జరుగుతుంటాయి. వాటిని ముందుగానే గుర్తించి, దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా సిద్ధపడే దేశాలే విజేతలుగా నిలుస్తాయి. చైనా మందగమనం భారత్‌కు లభించిన అవకాశం మాత్రమే.


వనకళ్ళ వీరప్ప

ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులు కొన్ని దేశాలకు సవాళ్లను విసురుతుంటే, మరికొన్ని దేశాలకు అభివృద్ధికి కొత్త అవకాశాలను అందిస్తాయి. ప్రస్తుతం చైనా ఆర్థిక వ్యవస్థ ఎదుర్కొంటున్న ఒడిదుడుకులు ఈ కోవకు చెందినవే. ఒకప్పుడు ప్రపంచ తయారీ రంగానికి తిరుగులేని కేంద్రంగా ఎదిగిన చైనా, ఇప్పుడు దేశీయ వినియోగం మందగించడం, రియల్ ఎస్టేట్ రంగంలో సంక్షోభం, కంపెనీల లాభదాయకతపై ఒత్తిడి, పెట్టుబడిదారుల విశ్వాసంలో అనిశ్చితి వంటి సమస్యలను ఎదుర్కొంటోంది. ఈ పరిణామాలు అంతర్జాతీయ మార్కెట్లను ప్రభావితం చేస్తున్న నేపథ్యంలో భారత్ తన పారిశ్రామిక సామర్థ్యాన్ని పెంచుకోవడానికి, విదేశీ పెట్టుబడులను ఆకర్షించడానికి లభిస్తున్న అవకాశాలను సమర్థంగా వినియోగించుకోవాలి. అయితే, చైనా ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని భావించడం వాస్తవిక దృక్పథం కాదు. ప్రపంచ తయారీ, ఎగుమతులు, సాంకేతిక రంగాల్లో ఆ దేశానికి ఇప్పటికీ గణనీయమైన స్థానం ఉంది. సమస్యలతో పాటు బలమైన పారిశ్రామిక పునాదులు కూడా చైనాకు ఉన్నాయి. అందువల్ల భారత్ అనుసరించాల్సిన వ్యూహం చైనా పతనంపై ఆశలు పెట్టుకోవడం కాదు, అక్కడి పరిణామాల నుంచి పాఠాలు నేర్చుకుంటూ మన బలాలను పెంచుకోవడం. కృత్రిమ మేధస్సు (ఏఐ), విద్యుత్ వాహనాలు, బ్యాటరీల తయారీ వంటి ఆధునిక రంగాల్లో ప్రపంచ అగ్రగామిగా నిలవాలని చైనా ప్రయత్నిస్తోంది. ఈ లక్ష్యాల సాధనకు ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెడుతోంది. అయినప్పటికీ, సాంకేతిక పురోగతి ఒక్కటే ఆర్థిక విజయానికి హామీ ఇవ్వదని ప్రస్తుత పరిణామాలు గుర్తుచేస్తున్నాయి. కొత్త ఆవిష్కరణలకు మార్కెట్ డిమాండ్, వినియోగదారుల కొనుగోలు శక్తి, కంపెనీల లాభదాయకత తోడైనప్పుడే పెట్టుబడులకు ఆశించిన ఫలితాలు లభిస్తాయి. చైనాలో ప్రజల వినియోగ వ్యయం ఆశించిన స్థాయిలో పెరగకపోవడం, రియల్ ఎస్టేట్ రంగంపై నెలకొన్న ఆందోళనలు, భవిష్యతుపై కుటుంబాలు జాగ్రత్తగా వ్యవహరించడం ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపుతున్నాయి. ఎగుమతుల ద్వారా ఆదాయం పెంచుకున్నప్పటికీ, దేశీయ మార్కెట్‌లో బలమైన డిమాండ్ లేకపోతే వృద్ధి నిలకడగా కొనసాగడం కష్టమే. ఈ అనుభవం భారత్‌కు కూడా ఒక ముఖ్యమైన పాఠం. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంతో పాటు ప్రజల ఆదాయాలు, ఉపాధి అవకాశాలు, కొనుగోలు శక్తిని బలోపేతం చేయడం సమతుల్య అభివృద్ధికి అవసరం. అంతర్జాతీయ కంపెనీలు తమ తయారీ, సరఫరా వ్యవస్థల కోసం ఒకే దేశంపై ఆధారపడటం వల్ల ఎదురయ్యే ప్రమాదాలను తగ్గించుకోవాలని భావిస్తున్నాయి. ఈ వ్యూహాన్నే 'చైనా ప్లస్ వన్'గా వ్యవహరిస్తున్నారు. చైనాతో పాటు మరో దేశంలోనూ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయడం ద్వారా సరఫరాలో అంతరాయాలు, వాణిజ్య వివాదాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ప్రభావాన్ని తగ్గించుకోవడం దీని ప్రధాన ఉద్దేశం. భారత్‌కు ఉన్న విస్తారమైన దేశీయ మార్కెట్, యువ మానవ వనరులు, పెరుగుతున్న డిజిటల్ మౌలిక సదుపాయాలు ఈ వ్యూహానికి అనుకూలంగా ఉన్నాయి. ముఖ్యంగాఎలక్ట్రానిక్స్, ఔషధాలు, ఆటోమొబైల్ విడిభాగాలు, సౌర విద్యుత్ పరికరాలు, సెమీకండక్టర్లు, రక్షణ ఉత్పత్తుల తయారీ వంటి రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించే అవకాశం ఉంది. అయితే, కంపెనీలు చైనాను విడిచిపెట్టి భారత్‌కు రావడం సహజంగా జరిగే పరిణామం కాదు. నాణ్యమైన మౌలిక సదుపాయాలు, వేగవంతమైన రవాణా, నమ్మకమైన విద్యుత్ సరఫరా,



నైపుణ్యంతో కూడిన కార్మికులు, స్థిరమైన విధానాలు, సరళమైన అనుమతుల వ్యవస్థలను భారత్ అందించాలి. మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాల తయారీలో భారత్ సాధిస్తున్న పురోగతి ఆశాజనకమే. అయినప్పటికీ, తుది ఉత్పత్తులను అసెంబ్లింగ్ చేయడానికే పరిమితమైతే ఆశించిన స్థాయిలో దేశీయ విలువ జోడింపు జరగదు. కీలక విడిభాగాలు, యంత్రాలు, ఎలక్ట్రానిక్ చిప్‌లు, ప్రత్యేక పదార్థాలు ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తే సరఫరా వ్యవస్థలో స్వయంసమృద్ధి సాధించడం కష్టమవుతుంది. చైనా పారిశ్రామిక ఆధిపత్యానికి ప్రధాన కారణాల్లో ఒకటి దాని విస్తృతమైన అనుబంధ పరిశ్రమల వ్యవస్థ. ముడిసరుకుల నుంచి తుది ఉత్పత్తుల వరకు అనేక దశలను అనుసంధానించే తయారీ నెట్‌వర్క్ అక్కడ ఏర్పడింది. భారత్ కూడా పరిశోధన, రూపకల్పన, విడిభాగాల తయారీ, నైపుణ్యాభివృద్ధి, నాణ్యతా ప్రమాణాల పెంపుపై దృష్టి సారించాలి. చిన్న, మధ్యతరహా పరిశ్రమలను పెద్ద సంస్థల సరఫరా చైన్ సిస్టమ్‌లతో అనుసంధానించడం ద్వారా ఉపాధి పెరగడమే కాకుండా దేశీయ తయారీ పునాదులు బలపడతాయి. చైనాలో దేశీయ డిమాండ్ బలహీనపడినప్పుడు అక్కడి కంపెనీలు తమ ఉత్పత్తులను విదేశీ మార్కెట్లలో విక్రయించడానికి మరింత దూకుడుగా వ్యవహరించే అవకాశం ఉంది. తక్కువ ధరలకు దిగుమతులు రావడం భారత వినియోగదారులకు ప్రయోజనం కలిగించవచ్చు. కొన్నిపరిశ్రమలకు అవసరమైన ముడిసరుకులు కూడాచౌకగా లభించవచ్చు. అయితే, ప్రభుత్వ సబ్సిడీలు, అధిక ఉత్పత్తి సామర్థ్యం లేదా ఇతర అనుచిత వాణిజ్య పద్ధతుల కారణంగా దిగుమతి ఉత్పత్తులు అసాధారణంగా తక్కువ ధరలకు వస్తే దేశీయ తయారీదారులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. ఈ పరిస్థితిని ఎదుర్కోవడానికి నాణ్యత, ఉత్పాదకత, సాంకేతిక పరిజ్ఞానం, వ్యయ నియంత్రణలో భారతీయ సంస్థలు పోటీతత్వాన్ని పెంచుకోవాలి. అవసరమైన సందర్భాల్లో ప్రపంచ వాణిజ్య నిబంధనలకు అనుగుణంగా యాంటీ డంపింగ్ చర్యలు, తగిన వాణిజ్య రక్షణ విధానాలను అమలు చేయాలి. అదే సమయంలో, ఆరోగ్యకరమైన పోటీకి ఆటంకం కలిగించకుండా వినియోగదారుల ప్రయోజనాలను కూడా కాపాడాలి. చైనా నుంచి బయటకు వెళ్లే పెట్టుబడులన్నీ భారత్‌కే వస్తాయని ఆశించడం సరైంది కాదు. వియత్నాం, ఇండోనేషియా, మెక్సికో వంటి దేశాలు కూడా అంతర్జాతీయ తయారీ పెట్టుబడుల కోసం పోటీపడుతున్నాయి. ప్రపంచ మదుపర్లు తమ పెట్టుబడులను అమెరికా లేదా ఇతర మార్కెట్లలోకి మళ్లించే అవకాశమూ ఉంది. కాబట్టి, భారత్ తన ఆకర్షణీయతను నిరంతరం పెంచుకోవాలి. విధానాల్లో స్థిరత్వం, ఒప్పందాల అమలు, భూసేకరణలో పారదర్శకత, న్యాయపరమైన స్పష్టత, పరిశ్రమలకు అందుబాటులో ఉండే ఆర్థిక వనరులు పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతాయి. చైనా ఆర్థికవ్యవస్థలోని బలహీనతలు భారత్‌కు ఒక అవకాశ ద్వారాన్ని తెరిచాయి. కానీ ఆ ద్వారం గుండా ముందుకు సాగడానికి కేవలం అనుకూల అంతర్జాతీయ పరిస్థితులు సరిపోవు. దేశీయ సంస్కరణలు, ఉత్పాదకత పెంపు, నైపుణ్యాభివృద్ధి, పరిశోధన, మౌలిక సదుపాయాల విస్తరణ, పారిశ్రామిక విధానాల సమర్థ అమలు అత్యవసరం. వ్యవసాయం నుంచి ఆధునిక తయారీ వరకు, చిన్న పరిశ్రమల నుంచి ప్రపంచ స్థాయి సంస్థల వరకు అన్ని రంగాలూ పరస్పరం బలపడేలా అభివృద్ధి వ్యూహం ఉండాలి. చైనా ఎదుర్కొంటున్న సమస్యలను భారత్ తన విజయానికి ఆధారంగా భావించకూడదు. ప్రపంచ ఆర్థికవ్యవస్థలో మార్పులు ఎప్పటికప్పుడు జరుగుతుంటాయి. వాటిని ముందుగానే గుర్తించి, దీర్ఘకాలిక ప్రయోజనాలకు అనుగుణంగా సిద్ధపడే దేశాలే విజేతలుగా నిలుస్తాయి. చైనా మందగమనం భారత్‌కు లభించిన అవకాశం మాత్రమే. దానిని ఆర్థిక విజయంగా మార్చే శక్తి మాత్రం మన విధానాల్లో, పరిశ్రమల్లో, ప్రజల నైపుణ్యంలో, జాతీయ సంకల్పంలోనే ఉంది. ఇదే భారత్ ముందున్న అసలైన పరీక్ష. అదే అభివృద్ధి చెందిన దేశంగా ఎదగడానికి బలమైన పునాది! •

కళ్లుపోయినవాడు అంధుడు కాదు. తప్పులను కప్పిపుచ్చుకునేవాడే అంధుడు.



మహాత్మా గాంధీ

నేరస్తులను శిక్షించుటే ప్రధానం కాదు. నేరం చేయడానికి ఏ పరిస్థితులు పురికొల్పుతున్నాయో వాటిని తొలగించడం ముఖ్యం.



ఆల్బర్ట్ కామూ

ప్రజావాక్కు



ఎటియంలలో రూ.500 నోట్లు ఉండకూడదు

మనదేశంలో డిజిటల్ చెల్లింపులు ఎంత పెరుగుతున్నా అంతకన్నా ఎక్కువస్థాయిలో కరెన్సీ నోట్ల చలామణి పెరుగుతోంది. ఇది గత ఏడాది కంటే 13.5 శాతం ఎక్కువగా ఉండటం ఆందోళనకరం. పెద్దనోట్ల చలామణి వల్ల అవినీతి పెరుగుతోందనటంలో ఎలాంటి సందేహం లేదు. సామాన్యులు పానీపూరిలు కొనుగోలు చేయటానికి పది రూపాయల డిజిటల్ చెల్లింపులు చేస్తుంటే బడాబాబులు, వ్యాపారవేత్తలు ఇతర చెల్లింపుదారులు జి.ఎస్.టిని ఎగ్గొట్టటానికి పెద్ద మొత్తాలుగా నగదు చెల్లింపులు జరుపుతున్నారు. మన బ్యాంకుల ఏటీయంల ద్వారా దాదాపు అన్ని 500 రూపాయల నోట్లు చేతులు మారి నల్లధనంగా రూపాంతరం చెందుతోంది. అవినీతి తగ్గాలంటే బ్యాంకు ఏటియంలలో200,100,50,20 కరెన్సీ నోట్లను మాత్రమే అందుబాటులో ఉంచాలి. 500 రూపాయల నోట్లు కేవలం బ్యాంకుల కౌంటర్ల ద్వారానే వినియోగదారులకు ఇవ్వాలి. దీనిపై భారత రిజర్వుబ్యాంకు స్పందించాలి.

- కప్పగంతు వెంకట రమణమూర్తి, సికింద్రాబాద్

ప్రభుత్వాలు బాబాల కోసమా! ప్రజల కోసమా?

కంచి పీఠాధిపతి జయేంద్ర సరస్వతిని ఆరునెలలపాటు జైల్లోపెట్టినజయలలిత లాంటిపాలకులుకావాలి. పూర్వం మునులుననబడేవారు అన్ని వదిలిపెట్టి అడవులకు వెళ్ళి, ఆకు అలమో తింటూ కాలం గడిపేవారు. మరి వారి వారసులం అంటూ ఈరోజు సన్యాసులు, బాబాలు దేశం మీద పడిజనాలను పీక్కుతుంటున్నారు. స్వతంత్రంరాకముందు ఎక్కడో ఒక బాబా ఉండేవాడు. జనాలలోకి వచ్చేవారు కాదు. వస్తే తంతారని భయం ఆరోజుల్లో ఉండేది. మనది లౌకిక రాజ్యం అన్న ధ్యాస ఒక్కడికి లేదు. ఇకనైనా ప్రభుత్వాలు ఈ దొంగ బాబాలను దరిదాపులకు రాకుండా చూడాలి. జయలలిత జయేంద్ర సరస్వతిని ఆరు నెలలు జైల్లో పెట్టిన స్ఫూర్తితో ముందుకు సాగాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

కేసులను వెంటనే పరిష్కరించాలి

వినియోగదారుల ఫోరంలో రోజురోజుకి ఇంత జాప్యం జరుగుతున్నా పట్టించుకునేవారు లేరు. ఈ కోర్టు కేసులో ఫోరంలో కేసు వేసినచో 90రోజుల్లో పరిష్కారం లభించేది. కానీ ఇప్పుడు మూడు నాలుగు సంవత్సరాలు గడిచిన కానీ కేసు పరిష్కారం జరగటం లేదు కానీ కేసు బాధితులు మాత్రం కోర్టుచుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు.

-సి. లక్ష్మీనారాయణ, కరీంనగర్

అర్నబ్ బాధితులను ఆదుకోవాలి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం సందర్భంగా అర్నబ్ తుఫాన్ ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా ప్రభావం చూపింది. ఈదురు గాలులు స్వల్పంగా 125 కిలోమీటర్ల వేగం నుండి గరిష్ఠంగా 150 కిలోమీటర్ల వేగంతో విచాయి. దీంతో ఆంధ్రలో 2.24హెక్టార్లలో పంటలు నష్టపోయి, మూడున్నర లక్షల రైతులపై ప్రభావం పడిందని అధికారుల అంచనా. విద్యుత్ స్తంభాలు, చెట్లు నెలకొరిగాయి, స్వల్పప్రాణ నష్టం జరిగింది. వారి కుంటుబాలను ఆదుకోవాలి. ప్రభుత్వ యంత్రాంగం ఎప్పటికి అప్పుడు సంబంధిత అధికారులతో సమీక్షలు చేస్తూ జాగ్రత్తలుతీసుకుంటుంది. అయినా జరగాల్సి ననష్టంజరిగింది. తుఫాన్ వల్ల నష్టపోయిన వారికి తక్షణమే సహాయం అందించి ఆదుకోవాల్సిన భాధ్యత కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంపై ఉందనే విషయం తెలుపుతూ యథావిధిగా రవాణా, కమ్యూనికేషన్, శానిటరీ ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు త్వరితగతిన పునర్ వ్యవస్థీకరించాలి.

- మిద్దె సురేష్, నాగర్ కర్నూల్ జిల్లా

ఆకస్మిక తనిఖీలు అవసరం

మనిషి ఆరోగ్యానికి పునాది స్వచ్ఛమైన ఆహారం. కానీ రోజువారీ అవసరాలైన పాలు, నీరు, పండ్లు, నూనెలు, మసాలాలు వంటివాటిలో కల్తీ లేదానాణ్యత లోపంఉంటే వినియోగదారుడి ఆరోగ్యం ప్రమాదంలో పడుతుంది. మార్కెట్లో కొనుగోలుచేసే ప్రతి వస్తువునూ సామాన్యుడు స్వయంగా పరీక్షించి నాణ్యతను నిర్ధారించుకోవడం సాధ్యం కాదు. అందుకే ఆహార భద్రతను నిర్ధారించే వ్యవస్థ మరింత పటిష్ఠంగా పనిచేయాల్సిన అవసరం ఉంది. కల్తీని సమర్థంగా అరికట్టాలంటే కేవలం ఫిర్యాదులు వచ్చినప్పుడు తనిఖీలు చేయడం సరిపోదు. ఆహారపరీక్ష ప్రయోగశాలలు, శిక్షణ పొందిన సిబ్బంది, ఆకస్మిక తనిఖీలు, నమూనాల సేకరణ, వేగవంతమైన పరీక్షలు ఒక సమగ్రవ్యవస్థగా నిరంతరంపనిచేయాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

పరిశోధనలు జరిపించాలి

రాష్ట్రంలోని గిరిజన ఆర్థిక సామాజిక సాంస్కృతిక అభి వృద్ధిపై పరిశోధనలు చేయవలసిన అవసరముఉంది. గిరిజన గురుకులాలలోపనిచేస్తున్న లెక్చరర్స్, టీచర్స్‌తో పరిశోధనలు జరిపించాలి. టీచింగ్ సిబ్బందిలో చాలామంది పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో ట్రైబల్ స్టడీస్ ఒక ఆప్షనల్ సబ్జెక్టుగా పోస్ట్ గ్రాడ్యుయేషన్ పూర్తి చేయడం జరిగింది. వీరితో గిరిజన సంక్షేమంపై పరిశోధనలు జరిపించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

ఆదాయం కన్నా పొదుపు మిన్న

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి

రెక్కాడితే డొక్క నిండని అత్యాధునిక అకాలాలు. యువత నిరుద్యోగ బతుకు బహు వెతలు. నైపుణ్య చేతులకే పరిమితమైన పనులు, ఆదాయాలు. దినసరి కూలీ రేట్ల పతనాలు. నేడు పని దొరుకుతుందన్న ఆశలు కరవు. ఇన్ని సంక్షోభాల నడుమ డిజిటల్ యువత తమ కుటుంబ స్థాయిని మరిచి, విచ్చలవిడిగా, అనాలోచితంగా, విచక్షణ రహితంగా ధనాన్ని నీళ్లవలె ఖర్చు చేయడం చూస్తున్నాం. ఆదాయానికి, ఖర్చుకు సంబంధం లేకుండా పోతున్నది. నేటి ఆదాయం రేపటి విపత్తుల్లో ఆదుకుంటుందన్న ఇంగితం మరిచారు యువజనులు. ఆర్థిక క్రమశిక్షణ లోపించి కుటుంబాలు విచ్ఛిన్నం అవుతూ, అశాంతి నిలయాలుగా దర్శనమిస్తున్నాయి. రాబడి కన్న ఖర్చులు అధికం అవుతున్నాయి. ఎంత సంపాదిస్తున్నామనేది ముఖ్యం కాదని, ఎంత ఆదా లేదా పొదుపు చేస్తున్నామనేది ప్రధానమని తెలుసుకోని యువత నేడు ఆర్థిక నిరక్షరాస్యులుగా మిగిలిపోతున్నారు. రేపటి ఆపదలు చెప్పి రావు. ఆపద వచ్చినపుడు బ్యాంకు బ్యాలెన్స్ ఖాళీగా ఉంటుంది. ఇలాంటిఆర్థిక సంకట స్థితికి కారణం నేటి ప్రజల్లో, ముఖ్యంగా యువతలో పొదుపు ప్రాధాన్యం తెలియకపోవడమే అని నిర్ధారించాల్సిన సమయం ఆసన్నమైంది. నేటి విద్యా వ్యవస్థలో ఆర్థిక క్రమశిక్షణ, పొదుపు పాఠాలు చెప్పడానికి అవకాశం లేకుండా పోయింది. ఎంత ఖర్చు పెడితే అంత గౌరవం పెరుగుతుందనే దురభిప్రాయంలో యువత కొట్టుమిట్టాడుతోంది. చిన్నపాటి నుంచే పిల్లల్లో పొదుపు పట్ల అవగాహన కల్పించాలి. పొదుపుకు, పిసినారితనానికి వ్యత్యాసం నేర్పాలి. సంపాదించిన నెలసరి వేతనంతో కొంత మేరకు పొదుపు చేయడం కనీస కర్తవ్యమని నేర్పుకోవాలి. మొక్కై వంగనిదే, మానై వంగదు కదా. లేత మనసుల్లో ఆర్థిక అక్షరాస్యత బీజాలు నాటాలి. చిన్నతనంలో పొదుపు పాఠాలు నేర్పినపిల్లలు రేపటి కుటుంబానికి సుఖ సంతోషాలను అందించగలడని తెలుసుకోవాలి. ప్రపంచవ్యాప్తంగా పొదుపు ప్రాధాన్యాన్ని అవగాహన కల్పించటానికి ప్రతి ఏటా 31 అక్టోబర్ రోజున ప్రపంచ పొదుపు దినోత్సవం (వరల్డ్ థ్రిఫ్ట్ లేదా సేవింగ్స్ డే) పాటించడం 1925నుంచి ఆనవాయితీగా వస్తున్నది. భారత మాజీ ప్రధానమంత్రి ఇందిరా గాంధీ 31 అక్టోబర్ 1984 రోజు మరణించడంతో, 1985 నుంచి ప్రపంచ పొదుపు దినాన్ని భారత ప్రభుత్వం 30 అక్టోబర్ రోజున నిర్వహించడం కొనసాగుతున్నది. 2026 ప్రపంచ పొదుపు దినోత్సవం ఇతివృత్తంగా 'ఏఐసలహాలు, మానవుడి నిర్ణయాలు' అనే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం కొనసాగుతున్నది. నేటి డిజిటల్ యువత ఉద్యోగాలు చేస్తూ పరిమిత వేతనాలను పొందుతున్నారు. తాము పొందిన వేతనాలతో కుటుంబాలను సజావుగా నడపడం లేదు. ప్రాధాన్యాలు మరిచిపోతున్నారు. విలాసాలు కూడా కనీస అవసరాలు అనుకుంటున్నారు. డబ్బు చేతిలో ఉన్నపుడు చేతులకు ఎముకలు లేవన్నట్లు అనాలోచితంగాఖర్చు చేస్తున్నారు. ధనం ఉన్నపుడు ఎగిరి పడడంతోపాటు లేనపుడు అప్పులు చేయడానికి కూడా వెనకాడడం లేదు. విలాసాలకు, కనీస అవసరాలకు వ్యత్యాసాలు మరిచిపోతున్నారు. ఎంత సంపాదించిన నెలలోని తొలి వారంలోనే ఖర్చు పెడుతున్నారు. రేపటి అనుకోని ఆపదలను తట్టుకోవడానికి పొదుపు ధనం వినియోగపడుతుందనే కనీస అవగాహన కోల్పోతున్నారు. నేటి విద్యాలయాలు మార్కులు, ర్యాంకుల పాఠాలు నేర్పుతున్నారు. ఉద్యోగాలు పొందడానికి అవసర విద్యను బోధిస్తున్నారు. సంపాదించిన ధనాన్ని పొదుపుగా వాడుకోవడాన్ని నేర్పే విద్య కరువైయ్యింది. చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకోవడం నేర్పాలి. దీపం ఉండగానే ఇల్లు చక్కదిద్దు కోవడం బోధించాలి. ప్రమాదాలు చెప్పి రావని, అనారోగ్యాలు అడిగిరావని తెలుసుకోవాలి. చిన్నతనంనుంచే పాకెటమనీని దాచుకోవడం నేర్పించాలి. నేటిపొదుపుచేసిన ధనమేరా రేపటి కుటుంబ సంతోషాలకు పునాది. •

యువత మత్తుని వదిలించడం ఎలా?

డి జె మోహన రావు

మన దేశంలో యువత మత్తు పదార్థాలకు బానిసవుతున్న తీరు గతంలో ఎప్పుడూ లేనంతగా ఆందోళనకరంగా మారిపోయింది. ఒకప్పుడు దేశంలో డ్రగ్స్ వ్యసనానికి సంబంధించిన చర్చలు కొన్ని పరిమిత ప్రాంతాలకే, అంటే పట్టణాల్లోని కొన్ని మూలలకు, సాధారణ గంజాయి వినియోగానికి లేదా పూర్తిగా పేదరికంలో ఉన్నవారికో పరిమితమై ఉండేవి. నేడు ఆపరిస్థితి పూర్తిగా కనుమరుగైపోయింది. కళాశాల క్యాంపస్‌లు, కార్పొరేట్ హాస్టళ్లు, చిన్న చిన్న పట్టణాలలో ఒక నిశ్శబ్దమైన, ప్రమాదకరమైన ఆరోగ్య సంక్షోభం నెలకొంది. ఈరోజు మత్తు పదార్థాలను వాడుతున్న కొత్త తరం వ్యక్తులు గతంలో మాదిరిగా సమాజం నుండి చెడిపోయిన వారు కాదు. నిత్యం ఫోన్లతో గడుపుతూ, చదువులో ముందుంటూ, మరోవైపు మానసికంగా చితికిపోతున్న ఆధునిక యువతే దీనికి ఎక్కువగా బానిసవుతున్నారు. ఈ తరానికి చెందిన యువత ఇంత భారీ సంఖ్యలో మత్తు వైపు ఎందుకు మళ్లుతున్నారో అర్థం చేసుకోవాలంటే, పాతకాలపు 'చెడు స్నేహాలు' వంటి సాధారణ కారణాలను పక్కన పెట్టి, నేటి ఆధునిక జీవితాన్ని మారుస్తున్న వాస్తవాలను లోతుగా పరిశీలించాల్సి ఉంటుంది. ఈ సంక్షోభానికి అసలు మూలకారణం మనుషుల సమయాన్ని, ఆసక్తిని వ్యాపారంగా మార్చేసే ఫోన్లు, సోషల్ మీడియా, నిరంతరం కష్టపడి పనిచేయాలనే విపరీతమైన ఒత్తిడి. నేటి యువత తీవ్రమైన పోటీ వాతావరణంలో చిక్కుకుపోయింది. కఠినమైన ప్రవేశ పరీక్షల కోచింగ్‌ల నుండి శాశ్వత ఉద్యోగాలు దొరక్క అడ్డా కూలీలలా ప్రాజెక్టుల వారీగా పనిచేసే పద్ధతి వరకు, అలాగే కార్పొరేట్ ఉద్యోగాల టెన్షన్ వరకు ఇదే పరిస్థితి కొనసాగుతోంది. మెదడు చురుగ్గా పని చేయించే మందుల వాడకం మొదట్లో సరదా కోసం కాకుండా కేవలం తమ పనితీరును మరింత మెరుగుపరచుకోవడం కోసమే ప్రారంభమవుతుంది. విద్యార్థులు 18 గంటల పాటు చదువుకునే కఠినమైన షెడ్యూల్‌ను తట్టుకోవడానికి ఇటువంటి మందులను వాడుతున్నారు. సమాజం మోపిన భరించలేని అంచనాల కారణంగా మెదడు సహజ శక్తి తగ్గిపోవడంతో, కేవలం చదువు కోసం ప్రారంభించిన ఈ అలవాటు కాస్తా తీవ్రమైన బానిసత్వంగా మారుతుంది. ఈ విద్యాపరమైన, ఉద్యోగపరమైన ఒత్తిడికి తోడు, మానసిక వేదనను అణచివేయడానికి డిజిటల్ ప్రపంచం దారితీస్తోంది. గత తరాలు తమ కష్టాలను, ఒంటరితనాన్ని నలుగురితో కలిసి మాట్లాడుకుంటూ అధిగమిస్తే, నేటియువత దానిని ఒక మొబైల్ స్క్రీన్ ద్వారా ఎదుర్కొంటోంది. దీనివల్ల అందరితో ఉన్నట్లు అనిపించినా తీవ్రమైన ఒంటరితనం చుట్టుముడుతోంది. అందరి దృష్టిని ఆకర్షించేలా రూపొందించిన సోషల్ మీడియా యాప్స్ యుక్తవయసులోని వారి మెదడును తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. డిజిటల్ ప్రపంచం ద్వారా వచ్చే తాత్కాలిక సంతోషం సరిపోనప్పుడు, మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి యువత కృత్రిమ మత్తు పదార్థాల వైపు మొగ్గు చూపుతోంది. టీవీలు, ఓటీటీ సిరీస్‌లు కూడా మత్తులోతేలిపోవడాన్ని ఒక ఫ్యాషన్‌లా చూపించడం ద్వారా ఈధోరణిని మరింత పెంచుతున్నాయి. అంతేకాకుండా డ్రగ్స్ సరఫరా చేసే పద్ధతిలో ఒక



నిశ్శబ్దమైన, ప్రమాదకరమైన విప్లవం వచ్చిపడింది. సంప్రదాయకంగా ఎవరిదగ్గరికో వెళ్లి కొనే పద్ధతి పోయి ఫోన్ల ద్వారానే అన్నీ జరిగేలా కొత్త నెట్‌వర్క్‌లు వచ్చాయి. ఎవరికీ చిక్కకుండా రహస్యంగా మెసేజ్‌లు పంపే యాప్‌లు, ఆన్‌లైన్ డిజిటల్ కరెన్సీల ద్వారా జరిగే లావాదేవీలు, ఏది ఆర్డర్ చేసినా ఇంటికి డెలివరీ అయినట్లే మత్తు పదార్థాలు కూడా సులభంగా డెలివరీ అయిపోతున్నాయి. అదే సమయంలో, గతంలో లాగా మొక్కల నుంచి వచ్చేవి కాకుండా, పూర్తిగా రసాయనాలతో ల్యాబ్‌లలో తయారు చేసే ప్రమాదకరమైన మత్తు పదార్థాలు మార్కెట్లోకి వచ్చాయి. ఇవి చాలా ప్రాణాంతకమైనవి, తక్కువ ధరకే లభించేవి, సాధారణ పరీక్షలకు దొరకనటువంటివి కావడం మరింత ఆందోళనకరం. ఈ సాంకేతిక మార్పునకు తోడు, తల్లిదండ్రులు, పిల్లల మధ్య ఉండాల్సిన అనుబంధం కూడా చెడిపోతోంది. వేగవంతమైన పట్టణీకరణ, ఉమ్మడి కుటుంబాలు పోయి అమ్మా, నాన్న, పిల్లలు మాత్రమే ఉండే చిన్న కుటుంబాలు రావడం వల్ల గతంలో యువతను కాపాడిన పెద్దల సలహాలు కరువయ్యాయి. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాల ఒత్తిడిలో ఉండటంతో, ఇళ్లలో ఆర్థిక అవసరాలు తీరుతున్నాయే తప్ప భావోద్వేగ బంధాలు కరువవుతున్నాయి. యువత ఎదుర్కొనే మానసిక ఆరోగ్య సమస్యలను కుటుంబాలు తరచుగా 'వాడికి పొగరు, సోమరితనం' అని పొరబడుతున్నాయి. దీనివల్ల యువత తమ మానసిక వేదనను ఎవరికీ చెప్పుకోలేక రహస్యంగానే మందుల ద్వారా తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ సంక్లిష్టమైన వాస్తవికతను ఎదుర్కోవాలంటే, నేరస్థులుగా ముద్ర వేయడం, కఠినమైన పోలీసు చర్యలు, భయపెట్టే పద్ధతులు అనేవి ఏమాత్రం పనిచేయవు. ఒక సంక్షోభానికి తగినట్లుగా అందరూ కలిసి చేసే మార్పు అవసరం. దేశం శిక్షించే పద్ధతి నుండి ఆరోగ్యకరమైన పద్ధతికి మారాలి. అంటే డ్రగ్స్ తీసుకోవడాన్ని పెద్ద నేరంగా కాకుండా ఒక మానసిక సమస్యగా గుర్తించి, వైద్యులు మంచి పునరావాస కేంద్రాల ద్వారా బాధితులను బయటపడేలా చేయాలి. అదే సమయంలో రహస్య ఆన్‌లైన్ దందాలను పర్యవేక్షించడానికి ప్రత్యేక నిఘా విభాగాలు ఏర్పాటు చేయాలి. మెడికల్ షాపుల్లో డాక్టర్ చీటీ లేకుండా మెదడును మత్తెక్కించే మందులు అక్రమంగా బయటికి రాకుండా కఠినమైన నిఘా ఉండాలి. విద్యాసంస్థలు, సమాజంలో కూడా పెద్ద మార్పులు రావాలి. పాఠశాలలు, విశ్వవిద్యాలయాలు ఇకపై చూస్తూ ఊరుకోకూడదు. ప్రతి విద్యాసంస్థలోనూ విద్యార్థులకు అండగా ఉండేందుకు నిపుణులైన కౌన్సిలర్లను తప్పనిసరి చేయాలి. చదువులలో ఒత్తిడిని తగ్గించాలి. చివరిగా కేవలం డ్రగ్స్ పూర్తిగా మానేయాలని బెదిరించడం కంటే వాస్తవికతను అర్థం చేసుకుని ప్రాణాలు కాపాడే ముందస్తు చర్యలు తీసుకోవాలి. మొత్తంగా చెప్పాలంటే నేటి భారతీయ యువత ఒక వైపు అసాధారణమైన పనిభారాన్ని మోస్తూ, మరోవైపు కనీస మానసిక భద్రతను ఇవ్వని ప్రపంచంలో జీవిస్తోంది. మాదకద్రవ్యాల వ్యసనం అనేది కేవలం చట్టపరమైన సమస్య మాత్రమే కాదు. దేశం తన గొప్ప యువ శక్తి ఫలాలను పొందాలనుకుంటే, ఈ సంక్షోభాన్ని పాత పద్ధతులతో ఎదుర్కోవడం ఆపాలి. భవిష్యత్తును రక్షించుకోవడానికి నైతిక తీర్పులపై కాకుండా, పరస్పర సహానుభూతి, వ్యవస్థాగత మార్పులు, వాస్తవికతపై ఆధారపడిన వాతావరణాన్ని నిర్మించాలి. •

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

ఉగ్రవాదంపై భారత్ వైఖరి మారలేదు!

ఫిలిప్పీన్స్‌లో అమెరికా, భారత్ రక్షణ మంత్రుల భేటీ: రాజ్‌నాథ్‌సింగ్



సెబూ, అక్టోబరు 29: భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్‌తో ఫిలిప్పీన్స్‌లోని సెబూలో కీలక చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఉగ్రవాద సంస్థలకు మద్దతు ఇచ్చే, శిక్షణ అందించే లేదా నిధులు సమకూర్చే దేశాల పట్ల ప్రపంచ దేశాలు ఎలాంటి ఉపేక్ష చూపకూడదని రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే దేశాలపై ‘జీరో టాలరెన్స్ విధానాన్ని అనుసరించాలని ఆయన పిలుపునిచ్చారు. భారత్ అమెరికా మధ్య కుదిరిన పదేళ్ల రక్షణ సహకార ఒప్పందం అమలులో పురోగతిని ఇరువురు నేతలు సమీక్షించారు. సైనిక సాంకేతికత, సమాచార మార్పిడి, రక్షణ రంగంలో ఉమ్మడి ఉత్పత్తి వంటి కీలక అంశాల్లో ఇరు దేశాల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంపై చర్చించారు. సరిహద్దుల అవతలి నుంచి జరిగే ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో భారత్‌కు అమెరికా అండగా ఉంటుందని పీట్ హెగ్‌సెత్ పునరుద్ఘాటించారు. ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు అమెరికా అందిస్తున్న నిరంతర, బలమైన మద్దతుకు రాజ్‌నాథ్ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలోని పరిస్థితులు, వేగంగా మారుతున్న ప్రాంతీయ భద్రతా పరిణామాలపై కూడా ఇరువురు నేతలు చర్చించారు. ముఖ్యంగా, గత ఏడాది అక్టోబర్‌లో కుదిరిన పదేళ్ల భారత్ అమెరికా రక్షణ సహకార ఒప్పందం అమలులో సాధించిన పురోగతిని సమీక్షించారు. ఒప్పందం ద్వారా రెండు దేశాల మధ్య రక్షణ భాగస్వామ్యాన్ని మరింత విస్తరించేందుకు విస్తృత కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. హెగ్‌సెత్‌తో జరిగిన సమావేశాన్ని రాజ్‌నాథ్ సింగ్ అద్భుతమైన సమావేశంగా అభివర్ణించారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమ వేదికలో స్పందించారు. పదేళ్ల భారత్‌అమెరికా రక్షణ సహకార ప్రణాళికలో సాధించిన పురోగతిని సమీక్షించామని, సైనిక సాంకేతికత, సమాచార మార్పిడి, ఉమ్మడి రక్షణ ఉత్పత్తి వంటి రంగాల్లో వ్యూహాత్మక సహకారాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చించామని తెలిపారు. స్వేచ్ఛాయుత, బహిరంగ, సురక్షిత ఇండోపసిఫిక్ ప్రాంత నిర్మాణంలో భారత్‌అమెరికా బలమైన భాగస్వామ్యం కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. మరోవైపు, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో సమావేశం కావడం సంతోషంగా ఉందని పీట్ హెగ్‌సెత్ తెలిపారు. అమెరికాభారత్ ప్రధాన రక్షణ భాగస్వామ్యానికి సంబంధించిన ఒప్పందం మొదటి వార్షికోత్సవాన్ని గుర్తుచేసుకుంటూ, రెండు దేశాల మధ్య సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై చర్చించినట్లు వెల్లడించారు. భారత్, అమెరికా మధ్య ఇప్పటికే కుదిరిన కీలక భద్రతా ఒప్పందాల అమలులో గణనీయమైన పురోగతి నమోదవుతున్నట్లు ఇరు దేశాలు గుర్తించాయని భారత రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. సైనిక దళాల కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచడం, సాంకేతిక పరిజ్ఞానాన్ని పంచుకోవడం, రక్షణ పరిశ్రమల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయడం వంటి అంశాలపై కొత్త మార్గాలను అన్వేషించినట్లు తెలిపింది. పదేళ్ల భారత్‌అమెరికా రక్షణ సహకార ప్రణాళిక పురోగతిని సమీక్షించిన ఇరువురు నేతలు, రెండు దేశాల రక్షణ సంబంధాలను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేందుకు తమ నిబద్ధతను పునరుద్ఘాటించారని మంత్రిత్వ శాఖ పేర్కొంది.

పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.35 కోట్లు మాయం!

కస్టమర్ల సేవింగ్స్ ఖాతాల్లో సొమ్ములు కాజేసిన వైనం

నోయిడా, అక్టోబరు 29: బ్యాంకులో డబ్బులు దాచుకుంటే భద్రంగా ఉంటాయని నమ్ముతాం. కానీ, తమ అనుమతి లేకుండానే ఖాతాల్లోని సొమ్ము మాయమైందని కొందరు ఖాతాదారులు ఆరోపిస్తున్నారు. కనీసం మెసేజ్ కూడా రాలేదని, డబ్బు బదిలీకి తాము ఎలాంటి పత్రాలపై సంతకాలు చేయలేదని చెబుతున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో పంజాబ్ నేషనల్ బ్యాంకు (పీఎన్‌బీ) శాఖలో సుమారు రూ.35 కోట్ల మేర నిధులు మాయమైనట్లు ఆరోపణలు రావడం కలకలం రేపుతోంది. ఈ వ్యవహారంపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బ్రాంచ్ మేనేజర్ సహా పలువురు బ్యాంకు ఉద్యోగులను అధికారులు సస్పెండ్ చేశారు. గ్రేటర్ నోయిడాలోని ఐచ్చర్ ప్రాంతంలో ఉన్న పంజాబ్‌నేషనల్‌బ్యాంకు శాఖలో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. పొదుపు ఖాతాలతో పాటు ఫిక్స్‌డ్ డిపాజిట్లలోని డబ్బు కూడా మాయమైనట్లు ఖాతాదారులు ఫిర్యాదు చేశారు. తమ అనుమతి లేకుండానే లావాదేవీలు జరిగాయని, వాటిపై బ్యాంకు నుంచి ఎలాంటి సమాచారం అందలేదని ఆరోపించారు. ఒక ఖాతాదారుడి ఖాతాలో రూ.39 లక్షలు ఉండగా, ఇప్పుడు సొమ్ము కనిపించడం లేదని హనీఫ్ ఖాన్ తెలిపారు. లావాదేవీలకు తాను సంతకం చేయలేదని, ఎలాంటి మెసేజ్ రాలేదని చెప్పారు. మరో ఖాతాదారుడు జకీర్ తన ఖాతాలోని రూ.9.5 లక్షలు మాయమైనట్లు ఆరోపించారు. బ్యాంకుకు వెళ్లాకే విషయం తెలిసిందన్నారు. విజేంద్ర సింగ్ అనే రైతు ఖాతాలో గతంలో రూ.8788 లక్షలు ఉండేవి. ఇప్పుడు కేవలం రూ.లక్ష మాత్రమే కనిపిస్తోందని ఆయన చెప్పారు. భూసేకరణకు పరిహారంగా వచ్చిన సొమ్ములో ఎక్కువ భాగం మాయమైందని ఆరోపించారు. జేవర్ విమానాశ్రయం కోసం భూమి కోల్పోయిన సంతోష్ అనే 60 ఏళ్ల మహిళ ఖాతాలోనూ ఇదే పరిస్థితి ఎదురైంది. ఆమె ఖాతాలో పరిహారంగా జమ చేసిన రూ.1.29 కోట్లలో రూ.1.18 కోట్లు కనిపించడం లేదని ఆరోపించారు. ఖాతాదారుల ఫిర్యాదులతో బ్యాంకు శాఖ మేనేజర్ సహా పలువురు ఉద్యోగులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. గ్రేటర్ నోయిడాలోని బీటా2 పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. డబ్బు ఎలా బదిలీ అయింది ఇందులో ఎవరెవరి పాత్ర ఉంది అనే అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. ఖాతాదారుల ఫిర్యాదులను పరిష్కరిస్తామని బ్యాంకు అధికారులు హామీ ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. నిధులు మాయమైన తీరుపై పూర్తి వివరాలు ఇంకా వెల్లడి కాలేదు.

నీట్ లీకేజి కేసులో నవంబరు 18న తీర్పు!

న్యూఢిల్లీ, అక్టోబరు 29: దేశంలో సంచలనం సృష్టించిన నీట్ యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో విచారణ కీలక దశకు చేరింది. ఈ కేసుకు సంబంధించి మొత్తం 14 మంది నిందితులపై అభియోగాల నమోదుపై ఢిల్లీలోని ప్రత్యేక కోర్టు గురువారం తన ఉత్తర్వులను రిజర్వ్ చేసింది. ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి అజయ్ గుప్తా ఈ కేసుకు సంబంధించిన ఉత్తర్వులను నవంబర్ 18న వెలువరించనున్నట్లుగా ప్రకటించారు. పబ్లిక్ పరీక్షల్లో పేపర్ లీకులు, అక్రమాలపై విచారణ జరిపేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ఈ విచారణ కొనసాగుతోంది. నీట్ పేపర్ లీక్ కుంభకోణానికి సంబంధించి గతంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ 13 మంది నిందితులపై తొలి ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. ఆ తర్వాత మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన శ్రేషావ్ బజ్రంగ్ సూర్యవంశీ అలియాస్ రాజ్ సూర్యవంశీని సెప్టెంబర్ 2న అరెస్టు చేసి, ఆయనపై సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడంతో నిందితుల సంఖ్య 14కి చేరింది. కాగా, వైద్య విద్య కోర్సుల ప్రవేశాల కోసం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్టీయే నిర్వహించే నీట్ యూజీ పరీక్షల్లో పేపర్ లీక్ ఆరోపణలు రావడంతో తీవ్ర దుమారం చెలరేగింది. దీంతో మే 12న నిర్వహించిన పరీక్షను రద్దు చేస్తున్నట్లుగా ఏజెన్సీ ప్రకటించింది. ఆ తర్వాత జూన్ 21న మళ్లీ తిరిగి రీ ఎగ్జామ్ నిర్వహించిన సంగతి తెలిసిందే.

చెన్నై బిర్యానీ సెంటర్‌లో కత్తులతో హాల్‌చల్

చెన్నై, అక్టోబరు 29: చెన్నై నగరంలో పట్టపగలే ఇద్దరు యువకులు వీరంగం సృష్టించారు. రాయపేట ప్రాంతంలోని ప్రముఖ చార్మినార్ బిర్యానీ సెంటర్‌లోకి చొరబడిన దుండగులు కత్తులతో విరుచుకుపడ్డారు. కౌంటర్‌లో ఉన్న క్యాషియర్‌పై విచక్షణారహితంగా, అత్యంత క్రూరంగా దాడికి పాల్పడ్డారు. అనంతరం క్యాష్ కౌంటర్‌లోని నగదును దోచుకుని అక్కడి నుంచి పరారయ్యారు. పట్టపగలు బహిరంగంగా జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తించింది. అయితే ఈ దారుణ దాడికి దారితీసిన కారణాలు విస్మయం కలిగిస్తున్నాయి. హోటల్‌లో సర్వ్ చేసిన బ్రెడ్ హల్వా రుచి బాగాలేదంటూ సదరు యువకులు సిబ్బందితో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. ఆ చిన్నపాటి గొడవ చిలికి చిలికి గాలివానలా మారి, చివరకు ప్రాణాంతక దాడికి దారితీసిందని తెలుస్తోంది. మాటమాట పెరగడంతో దుండగులు కత్తులు తీసి నేరుగా క్యాషియర్‌పై దాడి చేసి, దుకాణంలోని నగదును లూటీ చేశారు. ఈ దాడికి సంబంధించిన భయానక దృశ్యాలు రెస్టారెంట్‌లోని సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఆ వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ కావడంతో నగరవాసులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు తక్షణమే రంగంలోకి దిగి దర్యాప్తు ముమ్మరం చేశారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

సంక్లిష్ట శస్త్రచికిత్సలోనూ మచ్చర్ మృత్యుంజయుడే!



న్యూఢిల్లీ, అక్టోబరు 29: విమానం కాక్‌పిట్‌లో తోటి పైలట్ గొడ్డలితో దాడి చేసినా ప్రాణాలతో బయటపడి, వందలాది మంది ప్రయాణికులను కాపాడిన భారత పైలట్, కెప్టెన్ స్మిత్ మచ్చర్ అసలైన హీరో అనిపించుకున్నారు. ఆ దాడి నుంచి ఆయన బయటపడటమే కాదు, ఆ తర్వాత జరిగిన సర్జరీలోనూ మృత్యువును జయించారు. యూఏఈలో జరిగిన ఓ సన్మాన కార్యక్రమం సందర్భంగా బయటకు వచ్చిన ఆయన ఫొటోలు, తల గాయాల తీవ్రతను, సర్జరీ సంక్లిష్టతను కళ్లకు కట్టాయి. ఆయన తలకు పడిన కుట్లు, గాయం తీరును చూసిన ప్రముఖ న్యూరోసర్జన్లు, స్మిత్ ప్రాణాలతో బయటపడటం ఓ అద్భుతమని అభివర్ణిస్తున్నారు. సెప్టెంబర్ 30న దుబాయ్ నుంచి టెల్ అవీవ్ వెళుతున్న ఫ్లైదుబాయ్ విమానంలో ఈ ఘటన జరిగింది. అల్‌ఖైదా భావజాలంతో ప్రభావితుడైన ఒమన్‌కు చెందిన కోపైలట్ హామామ్ అల్‌హామామి, కాక్‌పిట్‌లోని అత్యవసర గొడ్డలితో స్మిత్ తలపై పలుమార్లు దాడి చేశాడు. ఈ దాడిలో స్మిత్ పుర్రె ఎముక లోపలికి చొచ్చుకుపోయింది. దీనిని వైద్య పరిభాషలో డిప్రెస్డ్ స్కల్ ఫ్రాక్చర్ అంటారు. అమెరికాకు చెందిన న్యూరోసర్జన్ డాక్టర్ సనత్ దీక్షిత్ ప్రకారం గాయం అయిన చోట మెదడులోని రెండు భాగాల మధ్య ఉండే పోస్టీరియర్ సుపీరియర్ సాజిట్టల్ సైనస్ అనే ఒక ప్రధాన రక్తనాళం ఉంటుంది. ఈ రక్తనాళానికి గాయమైతే తీవ్ర రక్తస్రావం జరుగుతుంది. సర్జరీ సమయంలో పుర్రె ఎముక ముక్కలను తొలగిస్తుండగా, ఆ రక్తనాళం చిట్లితే కేవలం ఒక్క నిమిషంలోనే దాదాపు రెండు లీటర్ల రక్తం కోల్పోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ఇలాంటి గాయాలకు 40 పైగా మరణం లేదా శాశ్వత వైకల్యం సంభవించే అవకాశం ఉంటుందని వివరించారు. సిడ్నీకి చెందిన న్యూరోసర్జన్ డాక్టర్ సోను భాస్కర్, స్మిత్ తలపై ఉన్న క్రాస్ ఆకారపు కుట్ల గుర్తును విశ్లేషించారు. మెదడులో వాపు (స్వెల్లింగ్) ఒత్తిడిని తగ్గించడానికి, సర్జన్లు పుర్రెలో కొంత భాగాన్ని తొలగించి ఉంటారని (డీకంప్రెసివ్ క్రానియెక్టమీ), అది మొదటి సర్జరీ అని అంచనా వేశారు. స్మిత్ ప్రాణాపాయం నుంచి బయటపడిన తర్వాత, తొలగించిన ఎముక భాగాన్ని తిరిగి అమర్చడానికి రెండో సర్జరీ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఈ గాయం కంటి చూపును నియంత్రించే విజువల్ కార్టెక్స్‌కు సమీపంలో జరగడం కూడా ప్రమాద తీవ్రతను పెంచిందని తెలిపారు. దాడి నుంచి ఎలా బయటపడ్డారంటే తలపై తీవ్ర గాయమై, రక్తస్రావంతో కంటిచూపు మందగించి, స్పృహ కోల్పోతున్నప్పటికీ, కెప్టెన్ స్మిత్ ధైర్యం కోల్పోలేదు. ఆయన అతి కష్టం మీద కాక్‌పిట్ డోర్ తెరవడంతో, సిబ్బంది, ప్రయాణికులు అప్రమత్తమై ఉగ్రవాద కోపైలట్‌ను బంధించారు.

ఇంట్లోనే గొయ్యితవ్వి నోట్లకట్టలు దాచిన యజమానులు

మూడు స్టీలు డ్రమ్ముల్లో నిండా రూ.500 నోట్ల కట్టలు



ప్రయాగరాజ్, అక్టోబరు 29: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో షాకింగ్ ఘటన వెలుగులోకి వచ్చింది. ఇంట్లోనే భారీ గొయ్యి తవ్వి అందులో డమ్ముల కొద్ది నోట్ల కట్టలు దాచిపెట్టడం కలకలం రేపింది. ఈ విస్తుపోయే సంఘటన ప్రయాగ్‌రాజ్‌లోని నవాబ్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బరాయ్‌పూర్ రామ్‌నగర్ గ్రామంలో వెలుగు చూసింది. గ్రామంలోని ఒక ఇంట్లో భారీగా అక్రమ నగదు దాచినట్లు పోలీసులకు అందిన మేరకు అక్కడికి వెళ్లి తవ్వి చూడగా కళ్లుబైర్లు కమ్మే సన్నివేశాలు కనిపించాయి. ఇంటి ఆవరణంలో నేల కింద 5 మీటర్లు తవ్వి ఆ గుంతలో మూడు భారీ స్టీల్ డ్రమ్ముల్లో నిండుగా రూ.500 నోట్ల కట్టలు దాచిన గుట్టు రట్టైంది. లభ్యమైన నగదు విలువ సుమారు రూ.8 నుంచి రూ.10 కోట్ల వరకు ఉంటుందని అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. ఆ నగదును స్వాధీనం చేసుకున్న పోలీసులు ఆ డబ్బును సీజ్ చేసి ఐటీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల ప్రాథమిక విచారణ ప్రకారం ఆ ఇల్లు యాదవ్ కుటుంబానికి చెందినది. ఆ కుటుంబానికి చెందిన రాకేష్ యాదవ్, రాజేష్ యాదవ్ గతంలో మహారాష్ట్రలోని పూణేలో ఉద్యోగం చేసేవారు. వారు 2020లో తిరిగి సొంత గ్రామానికి వచ్చారు. అంతా సాధారణంగా నడుస్తోంది. ఈ క్రమంలో పూణే నుంచి గ్రామానికి వచ్చిన కొద్దికాలంలోనే వారు భారీగా భూములు, కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. ఇటీవల గ్రామంలో జరిగిన ఒక గొడవ సందర్భంగా ఈ కుటుంబం వద్ద భారీగా నగదు ఉందనే ప్రచారం జరిగింది. ఈ విషయం ఆ నోటా ఈనోట పాకి చివరకు పోలీసుల వద్దకు చేరింది. దీంతో రంగంలోకి దిగిన పోలీసులు ఆరోపణలు వచ్చిన ఇంటిపై తనిఖీలు చేపట్టగా డ్రమ్ముల్లో దాచిన నగదు కట్టలు బయటకు వచ్చాయి. ఇంట్లో తనిఖీల అనంతరం ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు ఈ కేసును తీవ్రంగా విచారిస్తున్నారు. అంత భారీ ఎత్తున నగదు ఎక్కడి నుంచి వచ్చింది దీని వెనుక ఉన్న సూత్రధారులు ఎవరు అనే కోణంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

అవును నేను దిమాగీ నక్సల్‌నే!

బాలీవుడ్ నటుడు నసీరుద్దీన్‌షా



న్యూఢిల్లీ, అక్టోబరు 29: బాలీవుడ్ ప్రముఖ నటుడు నసీరుద్దీన్ షా, కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు మధ్య మాటల యుద్ధం మొదలైంది. విద్యార్థుల ఆందోళనలకు మద్దతుగా మాట్లాడిన నసీరుద్దీన్ షాను కిరణ్ రిజిజు విమర్శించారు. ఆయనను ప్రమాదకరమైన అర్బన్ దిమాగీ నక్సల్ అని అభివర్ణించిన మంత్రి, ఆయన వ్యాఖ్యలు భారత ప్రజాస్వామ్యానికి ఎంతో హానికరమని అన్నారు. ఒకప్పుడు ఆయనను ఎంతో గౌరవించేవాడినని, కానీ ఆయన నిజస్వరూపం ఆలస్యంగా తెలిసిందని పేర్కొన్నారు. ఢిల్లీలోని జామియా మిల్లియా ఇస్లామియా విశ్వవిద్యాలయంలో విద్యార్థి యూనియన్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థులకు మద్దతుగా నసీరుద్దీన్ షా ఒక వీడియోను సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఆ వీడియోలో ఆయన దిమాగీ నక్సల్ అని రాసి ఉన్న బ్యాడ్జ్ ధరించి కనిపించారు. దేశంలో విద్యా వ్యవస్థను నాశనం చేయడానికి, యువత ధైర్యాన్ని దెబ్బతీయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపణలు చేశారు. నేను దిమాగీ నక్సల్‌నే అని గర్వంగా చెబుతున్నాను. నాలాంటి వారిని దేశద్రోహులని, తుక్డేతుక్డే గ్యాంగ్ అని పిలుస్తున్నారు. ఈ ప్రభుత్వం ఇంకా ఎంతకాలం ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి నెడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యాఖ్యలపై శివసేన నాయకురాలు షైనా ఎన్‌సి కూడా స్పందించారు. నసీరుద్దీన్ షా సర్ఫరోష్ సినిమాలో ఏసీపీ రాథోడ్ లాగా ఆలోచిస్తున్నారా లేక విలన్ గులామ్ హసన్ లాగా ఆలోచిస్తున్నారా అని ప్రశ్నించారు. ఆయన దేశానికి అనుకూలంగా ఉన్నారో లేక వ్యతిరేకంగా ఉన్నారో స్పష్టం చేయాలన్నారు. దిమాగీ నక్సల్ అనే పదాన్ని గతంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తమ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ఉపయోగించారు. వ్యవస్థలోకి ప్రవేశించి విధానాలను తప్పుదోవ పట్టించేవారిని ఉద్దేశించి ఆయన ఈ పదాన్ని వాడారు. గత కొన్ని రోజులుగా నీట్ పరీక్షల్లో అక్రమాలు, వివిధ ఫిల్మ్ ఇన్స్టిట్యూట్లలో విద్యార్థుల నిరసనలకు మద్దతుగా నసీరుద్దీన్ షా నిత్యం వీడియోలు విడుదల చేస్తూ ప్రభుత్వంపై తన వ్యతిరేకతను వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ పరీక్షల వ్యవస్థ సమీక్షకు పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ,అక్టోబరు 29: దేశంలో జాతీయ స్థాయి పరీక్షల నిర్వహణ తీరు, వాటి పారదర్శకతపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో పార్లమెంటరీ కమిటీ కీలక నిర్ణయం తీసుకుంది. దేశీయ ప్రభుత్వ పరీక్షల వ్యవస్థలో తేవాల్సిన సంస్కరణలపై సమగ్రంగా సమీక్ష జరిపేందుకు సిద్ధమైంది. ఈ ఏడాది ఆరంభంలో వైద్య విద్య ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్‌యుజి ప్రశ్నాపత్రాల లీకేజీ ఉదంతం తీవ్ర దుమారం రేపిన సంగతి తెలిసిందే. ఎన్ని కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినప్పటికీ నీట్‌యుజి 2026 రద్దు కావడం, పరీక్షల నిర్వహణలో మరింత మెరుగైన విధానపరమైన, సంస్థాగత మార్పుల అవసరాన్ని స్పష్టం చేస్తోందని గత పార్లమెంటరీ కమిటీ కూడా అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో విద్యా, మహిళా, శిశు, యువజన, క్రీడల శాఖల పార్ల మెంటరీ స్థాయీ సంఘం రంగంలోకి దిగింది. ఇందులో భాగంగా కోచింగ్ సెంటర్ల పనితీరు, వాటికి సంబంధించిన నిబంధనలు, అమలు తీరు, అవి ఏ మేర నిబంధనలు పాటిస్తున్నాయో ప్రత్యేకంగా సమీక్షించనుంది. ఈ ఏడాది సెప్టెంబరులో ఏడాది వ్యవధి కోసం పునర్వ్యవస్థీకరించబడిన ఈ పార్లమెంటరీ కమిటీ, 2026-27 సంవత్సరానికి గాను తాము చేపట్టబోయే సమీక్షాంశాలను ఎంచుకుంది. లోక్‌సభ విడుదల చేసిన బులెటిన్ ప్రకారం జాతీయ విద్యా విధానం 2020 అమలు పురోగతిని కూడా ఈ ప్యానెల్ క్షుణ్ణంగా పరిశీలించనుంది. దీంతో పాటు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ పనితీరును, వాటి గుర్తింపులు, నిబంధనలు, పరీక్షల నిర్వహణ, విదేశీ కార్యకలాపాలతో పాటు సెంట్రల్ అడ్వైజరీ బోర్డ్ ఆఫ్ ఎడ్యుకేషన్ మూలాలను కూడా సమీక్షిస్తుంది. పాఠశాల విద్యలో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, మానసిక ఉల్లాసం, సమ్మేళిత విద్య, ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలతో సహా వారి సంక్షేమానికి సంబంధించిన మద్దతు విధానాలపై దృష్టి సారిస్తుంది. అంతేకాకుండా, విద్యారంగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, నూతన సాంకేతికతల ప్రభావం, విద్యార్థుల ఉద్యోగావకాశాలపై దాని ఫలితాలను పరిశీలిస్తూనే ఉన్నత విద్య అంతర్జాతీయకరణపై యుజిసి నిబంధనలు, మార్గదర్శకాల అమలు తీరును కూడా ఈ కమిటీ నిశితంగా అంచనా వేయనుంది.

పోలీసులకు భయపడొద్దు.. అందరూ ర్యాలీకి రండి!

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ



న్యూఢిల్లీ, అక్టోబరు 29: కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ దేశ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో నిర్వహించనున్న ‘చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్‌కు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ మేరకు ఆయన ఎక్స్ వేదికగా ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. దేశ ఆత్మను, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకే ఈ ఉద్యమమని, ఓట్ల దొంగతనాన్ని అడ్డుకోవాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ఏ ఒక్క రాజకీయ పార్టీకి మాత్రమే పరిమితం కాదని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా, ఎన్నికల కమిషన్ వైఖరితో విభేదించే ప్రతి ఒక్కరూ, ప్రజాస్వామ్యాన్ని కాంక్షించే పౌరులందరూ ఈ మార్చ్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యంగా విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. మీ భావ ప్రకటనా స్వేచ్ఛ, ఆలోచనలు, జీవన విధానంపై దాడి జరుగుతోందని మీరు భావిస్తే, ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా ఈ మార్చ్‌కు తరలిరండి. పోలీసులకు, లాఠీలకు భయపడవద్దు. బీజేపీ ప్రభుత్వం అణచివేత చర్యలకు పాల్పడే సాహసం చేయదని విద్యార్థులకు భరోసా ఇచ్చారు. దేశవ్యాప్తంగా వేలాది మంది ఈ కార్యక్రమంలో పాల్గొని, దీనిని విజయవంతం చేస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ‘ఓటు చోరీకి వ్యతిరేకంగా, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవడానికి నవంబర్ 1న నిర్వహించనున్న ‘చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్‌లో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. సామాజిక మాధ్యమం ‘ఎక్స్ లో పంచుకున్న ఒక వీడియో సందేశంలో రాహుల్ గాంధీ మాట్లాడుతూ ఈ పాదయాత్ర ఓట్ల దొంగతనాన్ని అడ్డుకోవడానికేనని, ఇది ఏ ఒక్క రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని స్పష్టం చేశారు. ఇది భారత ఆత్మకు సంబంధించిన యాత్ర అని అభివర్ణించారు. నరేంద్ర మోడీ, అమిత్ షా, జ్ఞానేష్ కుమార్ వైఖరితో విసిగిపోయిన వారు, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడుకోవాలనుకునే వారందరూ ఈ మార్చ్‌లో పాల్గొనాలని కోరారు.

జడ్జిల నియామకంలో కొల్లిజియం ఇష్టానుసారం!

విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రేఖాశర్మ



న్యూఢిల్లీ, అక్టోబర్ 28: సుప్రీంకోర్టు కొలీజియంపై ఢిల్లీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ రేఖా శర్మ తీవ్ర విమర్శలు గుప్పించారు. న్యాయమూర్తులను ప్రభుత్వం నియమించే పాత వ్యవస్థ కంటే సుప్రీంకోర్టు కొలీజియం ఏమాత్రం మెరుగైనది కాదని ఆమె వ్యాఖ్యానించారు. కొలీజియం వ్యవస్థ తన ‘ఇష్టానుసారంగా న్యాయమూర్తులను నియమిస్తూనే ఉందని ఆమె పేర్కొన్నారు. న్యాయ జవాబుదారీతనం, సంస్కరణల ప్రచార సంస్థ(సీజేఏఆర్) నిర్వహించిన ఒక కార్యక్రమంలో జస్టిస్ శర్మ భారత సుప్రీంకోర్టు, హైకోరు న్యాయమూర్తుల జవాబుదారీతనం అనే అంశంపై ప్రసంగించారు. కొలీజియం వ్యవస్థ దాదాపు పూర్తిగా విఫలమైంది. చరిత్రలోకి వెళితే 1993, 1998లలో సుప్రీంకోర్టు ఇచ్చిన రెండు తీర్పుల ద్వారా ఈ కొలీజియం వ్యవస్థ ఉనికిలోకి వచ్చింది. అంతకుముందు రాజ్యాంగబద్ధమైన కోర్టుల్లో (హైకోర్టులు, సుప్రీంకోర్టు) న్యాయమూర్తుల నియామకాలను ప్రభుత్వమే చేసేది. అప్పట్లో ఈ ప్రక్రియలో బంధుప్రీతి ఎక్కువగా ఉందని, ప్రభుత్వం తన రాజకీయ భావజాలానికి అనుగుణంగా ఉన్న వ్యక్తులనే నియమిస్తున్నదని బలమైన అభిప్రాయం ఉండేది అని జస్టిస్ శర్మ అన్నారు. న్యాయమూర్తులను నియమించే అధికారాన్ని ప్రభుత్వం నుంచి తొలగించి ఆ బాధ్యతను సుప్రీంకోర్టు తన చేతుల్లోకి తీసుకుందని ఆమె చెప్పారు. నిజాయితీగా చెప్పాలంటే ఈ పరిష్కారం అసలు సమస్య కంటే దారుణంగా తయారైంది. నా దగ్గర దీనికి సంబంధించి అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఇప్పుడు బంధుప్రీతి, పక్షపాతం అనేవి మరింత స్పష్టంగా, మరింత బహిరంగంగా, మరింత రాజకీయ ప్రేరేపితంగా, పూర్తిగా బంధువుల చుట్టూ కేంద్రీకృతమై ఉన్నాయి అని ఆమె ఆరోపించారు.

సంక్షిప్త వార్తలు

రైల్వే ప్లాట్‌ఫామ్‌పై డ్రోన్ దాడి - 13 మంది మృతి



కీవ్, అక్టోబరు 29: రష్యా-ఉక్రెయిన్ మధ్య ఉద్రిక్తతలు నానాటికీ తీవ్రమవుతున్నాయి. తాజాగా ఉక్రెయిన్‌లోని ఓ రైల్వే ప్లాట్‌ఫామ్‌పై మాస్కో దళాలు డ్రోన్ దాడికి పాల్పడ్డాయి. ఈ ఘటనలో 13 మంది మరణించారు. దినిప్రో రైల్వే స్టేషన్‌లో గురువారం ఈ ఘటన చోటుచేసుకుంది. జపోరిజియాకు వెళ్తున్న రైలు.. దినిప్రో స్టేషన్‌లో ప్లాట్‌ఫామ్‌పై ఆగి ఉండగా ఈ డ్రోన్ దాడి చోటుచేసుకుంది. ఆ సమయంలో అక్కడ విపరీతమైన రద్దీ ఉంది. ఎయిర్ సైరన్లు మోగినా.. దాడి గురించి హెచ్చరించినా ప్రయాణికులు పట్టించుకోలేదని, దీంతో ప్రాణనష్టం ఎక్కువగా ఉందని స్థానిక అధికారులు వెల్లడించారు. ఇప్పటివరకు 13 మంది మరణించగా.. పదుల సంఖ్యలో ప్రయాణికులు గాయపడ్డారు.

అంబులెన్స్‌లో సిలిండర్ పేలి 10 మంది మృతి



ఇస్లామాబాద్, అక్టోబరు 29: ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిలిచి ఉన్న అంబులెన్స్‌లో ఆక్సిజన్ సిలిండర్ పేలింది. ఈ సంఘటనలో పది మంది మరణించారు. మరో నలుగురు గాయపడ్డారు. మృతుల్లో ఒక నవజాత శిశువు, ముగ్గురు మహిళలతోపాటు ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు వ్యక్తులు, ఆస్పత్రి సిబ్బంది, స్థానికులు ఉన్నారు. పాకిస్థాన్‌లోని సింధ్ ప్రావిన్స్‌లో ఈ సంఘటన జరిగింది. బుధవారం రాత్రి థార్‌పార్కర్ జిల్లాలోని డానో ధంధాల్ ప్రభుత్వ ఆస్పత్రి నుంచి మిథిలోని ప్రభుత్వ ఆస్పత్రికి ఒక నవజాత శిశువు, కొందరు రోగులను అంబులెన్స్‌లో తరలించారు.

నవంబరు 1న నిరసన ర్యాలీ జరిగి తీరుతుంది: ఖర్గే



న్యూఢిల్లీ, అక్టోబరు 29: ఓటర్ల జాబితాల సవరణలో అక్రమాలు జరిగాయంటూ ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాన్ని వాయిదా వేసే ప్రసక్తే లేదని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో భారీ నిరసన నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడమే తమ పోరాట లక్ష్యమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం చేపడుతున్న ‘ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో ఓట్ల చోరీ, అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి ఈ నిరసనకు పిలుపునిచ్చింది. ఎన్నికల సంఘం ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహరించిన తీరుపై కూడా ఖర్గే విమర్శలు చేశారు.

నిబంధనల ప్రకారమే సర్’ నిర్వహణ - కర్ణాటక మంత్రి



బెంగళూరు, అక్టోబరు 29: కర్ణాటక ఓటర్ల జాబితా నుంచి దాదాపు కోటి ఓట్లను తొలగించడాన్ని రాష్ట్ర కాంగ్రెస్ మంత్రి సతీశ్ జార్కిహోళి సమర్థించారు. ఈ ప్రక్రియ నిబంధనల ప్రకారమే, అత్యంత పారదర్శకంగా జరిగిందని ఆయన స్పష్టం చేశారు. మరణించిన వారు, ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, రెండు చోట్ల ఓటు ఉన్న డూప్లికేట్ ఓటర్ల పేర్లను మాత్రమే తొలగించారని, ఇది సరైన నిర్ణయమేనని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రంలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)లో ఎలాంటి గందరగోళం, అక్రమాలు జరగలేదని ఆయన తెలిపారు. ఈ చర్యల వల్ల అర్హులైన ఏ ఒక్క ఓటరు హక్కుకు భంగం కలగలేదని, బోగస్ ఓట్లను ఏరివేయడానికే ఈ ప్రక్రియ దోహదపడిందని వివరించారు.

ఫడ్నవిస్, గడ్కరీ అడ్డాలో కాంగ్రెస్ గెలుపు

ముంబయి, అక్టోబరు 29: మహారాష్ట్ర ఎమ్మెల్సీ ఎన్నికల్లో నాగ్‌పూర్ ఫలితం బీజేపీకి గట్టి ఎదురుదెబ్బగా మారింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సొంత ప్రాంతంలోనే కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించడంతో రాజకీయంగా చర్చ మొదలైంది. ఫలితాలు పూర్తిగా వెలువడకముందే కాంగ్రెస్‌పై విమర్శలు చేసిన బీజేపీ నేతలకు ఈ గెలుపు సమాధానంగా మారింది. ప్రధాని మోడీ పోస్టును ప్రస్తావిస్తూ కాంగ్రెస్ నేతలు ఎదురుదాడికి దిగారు. రాష్ట్రంలో ఐదు స్థానాలకు జరిగిన ఎన్నికల్లో ప్రతిపక్ష మహా వికాస్ అఘాడీ మూడు స్థానాలను గెలుచుకుంది. అధికార మహాయుతి కూటమి రెండు స్థానాలకే పరిమితమైంది. నాగ్‌పూర్ పట్టభద్రుల నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి అభిజిత్ వంజారి విజయం సాధించారు.

ఆర్టీసీకి డబుల్ ధమాకా.. తగ్గనున్న డీజిల్ భారం

కొత్త ఇ-వాహనాల కొనుగోలు సొమ్ము ఆదా
తక్కువ ఖర్చుతో పాత బస్సులే మార్పు
340 బస్సులకు రెట్రోఫిట్టింగ్
త్వరలో రోడ్ల మీదకు 240 ఎలక్ట్రిక్ బస్సులు

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: సంస్థపై భారీగా పడుతున్న డీజిల్ భారం తగ్గించుకోవడంతోపాటు, కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకయ్యే నిధులను పెద్దఎత్తున ఆదా చేసేందుకు రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) పక్కా ప్రణాళికను అమలుచేస్తోంది. కొత్త ఎలక్ట్రిక్ బస్సులను పూర్తిగా కొనుగోలు చేయడానికి భారీగా ఖర్చు అవుతున్న నేపథ్యంలో ఇప్పటికే ఉన్న పాత డీజిల్ బస్సులనే ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చడం ద్వారా ఆర్టీసీ సంస్థకు డబ్బు ఆదా కానుంది. డీజిల్ ఆధారిత వ్యవస్థల స్థానంలో ఎలక్ట్రిక్ డ్రైవ్ ట్రైన్‌లు, బ్యాటరీలను అమర్చడం ద్వారా, రవాణా శాఖ నిర్దేశించిన నిబంధనలకు అనుగుణంగా పాత బస్సులను వినియోగానికి తీసుకు రావాలని ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా సంస్థలోని డీజిల్ బస్సులను పెద్ద ఎత్తున దశల వారీగా ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చాలని నిర్ణయించింది. కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుపై ఆధారపడకుండా, ఇప్పటికే ఉన్న పాత డీజిల్ వాహనాలకు రెట్రోఫిట్టింగ్ చేయడంపై దృష్టి సారించింది. సంస్థ అధికారవర్గాల వివరాలు ప్రకారం ఆర్టీసీ పాత బస్సుల నుండి డీజిల్ ఇంజిన్‌ను తొలగించి, ఆ స్థానంలో ఎలక్ట్రిక్ మోటార్, బ్యాటరీలను అమర్చి ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే (రెట్రోఫిట్‌మెంట్) కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ విధంగా 340 బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చే పనిలో నిమగ్నమైంది. 2027 నాటికి హైదరాబాద్ పరిధిలో 2,800 ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టాలని సంస్థ యాజమాన్యం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం దాదాపు 240 బస్సులకు రెట్రోఫిట్టింగ్ కార్యక్రమం కొనసాగుతుండగా, ఈ మార్పిడి చేసిన వాహనాలను త్వరలోనే హైదరాబాద్ రోడ్లపైకి తీసుకురావడానికి ఆర్టీసీ యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది.
మియాపూర్, ఉప్పల్‌లోని ఆర్టీసీ యూనిట్లలో డీజిల్ బస్సులకు ఈ రెట్రోఫిట్టింగ్ పనులు జరుగుతున్నాయి. వీటికి అదనంగా మరో 100 డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చాలని ఆలోచన చేస్తోంది. ఇటీవల ఎలక్ట్రిక్ పవర్ ట్రైన్‌తో రెట్రోఫిట్ చేయబడిన 2019 మోడల్ డీజిల్ బస్సును, దాని రిజిస్ట్రేషన్ సవరించడానికి ఖైరతాబాద్‌లోని రవాణా శాఖ కార్యాలయానికి పంపారు. టెస్ట్ డ్రైవ్‌ను విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత, రవాణా శాఖ అధికారులు ఆ వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. త్వరలో మరో 10 బస్సులు ప్రాంతీయ రవాణా అథారిటీ (ఆర్టీఏ) తనిఖీకి వెళ్తాయని, తద్వారా వాటిని నగర రోడ్లపైకి పంపడానికి మార్గం సుగమం అవుతుందని ఆర్టీసీ అధికారులు తెలిపారు. కాగా డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ వాహనాలుగా మార్చడానికి రవాణా శాఖ నుండి తప్పనిసరి అనుమతి అవసరం. రెట్రోఫిట్టింగ్‌కు ముందు అవసరమైన అనుమతులు పొందాల్సి ఉంటుంది. ఆ తర్వాత వాహనం ఆర్సీ (రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్) కి మార్పులు చేసి, ఫిట్‌నెస్ సర్టిఫికేషన్ పొందాలి. బ్యాటరీలు, విద్యుత్ పరికరాలను అమర్చిన తర్వాత ప్రతి బస్సును క్షుణ్ణంగా తనిఖీ చేస్తారని తెలిపారు.
ఆమోదం లభించిన తర్వాత, ఆర్‌సిలో పేర్కొన్న ఇంధన రకాన్ని డీజిల్ నుండి ఎలక్ట్రిక్‌కు మారుస్తారు. అవసరమైన ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాత మార్చిన ఎలక్ట్రిక్ బస్సులను రోడ్ల మీదకు తీసుకురానున్నారు.

కెటిఆర్‌పై వ్యాఖ్యలకు చింతిస్తున్నా
'ఎక్స్' వేదికపై కొండా సురేఖ వ్యాఖ్యల ఉపసంహారణ ప్రకటన

హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త: రేవంత్‌రెడ్డి మంత్రిమండలి నుంచి బర్తరఫ్ అయిన మాజీమంత్రి కొండా సురేఖ కెటిఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఇప్పుడు విరమించుకొని 'ఎక్స్' వేదికపై కెటిఆర్ ప్రతిష్టకు భంగం కలిగించాలని నా ఉద్దేశం కాదని తెలిపారు. 'బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌పై గతంలో నేను చేసిన కొన్ని వ్యక్తిగత వ్యాఖ్యల పట్ల వివరణ ఇవ్వాలని అనుకుంటున్నాను. అప్పటి రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో, ప్రతిపక్షాన్ని విమర్శించే క్రమంలో ఆ విధంగా మాట్లాడానే తప్ప ఉద్దేశపూర్వకంగా కాదు. ఆనాడు నేను చేసిన కొన్ని నిరాధారమైన వ్యాఖ్యలు చేయకుండా ఉండవలసింది. కెటిఆర్‌ను లేదా ఆయన కుటుంబ సభ్యులను బాధపెట్టాలని గానీ, వారి ప్రతిష్టకు భంగం కలిగించాలనే దురుద్దేశం గాని నాకు ఎంతమాత్రం లేదు. నా వ్యాఖ్యలు ఆయనను, ఆయన కుటుంబసభ్యులను గానీ నొప్పించి ఉంటే అందుకు చింతిస్తూ, ఆ వ్యాఖ్యలను ఉపసంహారించుకుంటున్నాను' అంటూ ఎక్స్‌వేదికపై ప్రకటించారు. రాజకీయ విమర్శలు చేసే సమయంలో చోటుచేసుకున్న ఈ పరిణామంపై స్పందిస్తూ తన వైఖరిని వెల్లడించారు. కెటిఆర్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యల వెనుక వ్యక్తిగత దురుద్దేశం లేదని పేర్కొన్నారు. కొండా సురేఖ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు క్షమాపణలు చెప్పడంపై రాజకీయవర్గాల్లో అనేక ఊహాగానాలు బయలుదేరాయి. విపక్షంపై విమర్శలు చేసే క్రమంలో కొన్ని వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందని ఆమె చేసిన ప్రకటన రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. కొండా మురళి, కొండా సురేఖ మళ్లీ బిఆర్ ఎస్ వైపు అడుగులు వేయబోతున్నారా? అని చర్చ జరుగుతున్నది.

మూసీ డిపిఆర్ లేకుండా లక్షన్నర కోట్లంటూ బురద చల్లడం మానుకోవాలి
కెటిఆర్‌పై ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆగ్రహం


హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త: కెటిఆర్ బుర్ర పెట్టి మాట్లాడటం లేదనీ, మూసీ ప్రాజెక్టుకు డిపిఆర్ లేదని చెపుతూనే లక్షన్నర కోట్లు ఖర్చు పెడుతున్నారని మాట్లాడుతున్నారని ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తంచేశారు. సిఎల్‌పి కార్యాలయంలో గురువారం మీడియాతో మాట్లాడుతూ కెటిఆర్ పచ్చి అబద్ధాలు చెపుతున్నారని, మూసీ ప్రాజెక్టుపై జరిగింది ప్రజాభిప్రాయ సేకరణ కాదని చెప్పారు. స్టేక్ హోల్డర్స్ మీటింగ్ మాత్రమే స్టేక్ హోల్డర్స్‌తో ప్రభుత్వం సమావేశం ఏర్పాటు చేసి వాళ్ల సలహాలు, సూచనలు తీసుకుందని గుర్తుచేశారు. ఎడిబి ద్వారా టెండర్ డాక్యుమెంట్ క్లియరెన్స్ వచ్చిన తరువాత టెండర్లు పిలిచారని నిన్న నిర్వహించిన మీటింగ్, ప్రజాభిప్రాయ సేకరణ కాదనీ ఆయన వివరించారు.

రాష్ట్రంలో చాలాచోట్ల నిధుల కొరత ఉంది
పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: జడ్చర్ల ఒకేఒక్క నియోజకవర్గానికి బిల్లులు చెల్లించలేదనడం సరికాదు రాష్ట్రంలో చాలాచోట్ల నిధుల కొరత ఉందని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిపై పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. గాంధీభవన్‌లో గురువారం విలేఖరులతో మాట్లాడుతూ అనిరుధ్ 'నేను చనిపోతేనే బిల్లులు ఇస్తారా అలాగైతే నేను నియోజకవర్గం అభివృద్ధి కోసం చావడానికి సిద్ధం' చేసిన వ్యాఖ్యలు క్రమశిక్షణ కమిటీ చూసుకొంటుందని ఆయన స్పష్టం చేశారు.

రైసు మిల్లు భాగస్వాములకు తప్పని కేసులు అరెస్టులు
బియ్యం బకాయిలపై నోటీసుల అందిన వారం రోజులకు ఆస్తుల జప్తు

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: సన్నబియ్యం కామన్ వెరైటీ కింద ఎఫ్‌సిఐకి చెల్లించకుండా అక్రమాలకు పాల్పడిన మిల్లరను అరెస్టు చేసిన సిఐడి అధికారులు మిల్లుల్లో భాగస్వాములైన వారిని, వారి కుటుంబ సభ్యులను కూడా అదుపులోకి తీసుకొంటుండటంతో మిల్లులతో సంబంధం వున్న వారంతా ఆందోళన చెందాల్సిన పరిస్థితి ఏర్పడింది. బియ్యం బకాయి దారులకు నోటీసులు అందజేసిన వారం రోజుల్లోనే రెవెన్యూ రికవరీ చట్టం ప్రయోగించి ఆస్తులు జప్తు చేసే ప్రక్రియ మొదలు పెట్టేందుకు ఆరంభంగా ఆదివారం అరెస్టులతో శ్రీకారం చుట్టింది. అరెస్టుల నుంచి తప్పించు కోవడానికి కొంతమంది ముందస్తు బెయిల్ కోసం న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నట్లు తెలిసింది. సిఎంఆర్ అక్రమాలను కట్టడి చేసేందుకు రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కొరఢా విదిలించడంతో మిల్లు యజమానుల్లో మాత్రమే కాదు అందుకు సహకరించిన ఎఫ్‌సిసిఐ సివిల్‌సప్లయ్ అధికారులు కూడా ఏం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. అక్రమాలకు పాల్పడిన రైసుమిల్లు యజమానులను ఇప్పటికే అదుపులోకి తీసుకున్న సిఐడి అధికారులు ఇప్పుడు తాజాగా మిల్లుల్లో స్లీపింగ్ పార్ట్‌నర్‌ను కూడా అదుపులోకి తీసుకొనేందుకు కార్యచరణ రూపొందించారు. ముఖ్యంగా మిల్లు యజమానులుగానో భాగస్వామిగానో మిత్రులు సమీప బంధువుల ఇంటి ఇల్లాలు పేరు రికార్డులో ఉంటే వారిని కూడా అదుపులోకి తీసుకొంటుండటంతో ఎప్పుడు ఎవరు ఊచలు లెక్కించాలో తెలియని పరిస్థితి రైసు మిల్లు యజమానుల బంధుస్నేహవర్గంలో నెలకొంది. పంజాబ్,హరియాణా రాష్ట్రాల నుంచి దొడ్డు బియ్యం తక్కువకు కొనుగోలు చేసి, పాలీష్ చేసి ఇచ్చి మిల్లర్లకు రికవరి నోటీసులు జారీచేయడంతోపాటు ఆస్తుల జప్తు క్రిమినల్ కేసులు నమోదుకు ప్రభుత్వానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సన్నబియ్యం బహిరంగ మార్కెట్‌లో విక్రయించుకొని ప్రభుత్వానికి క్వింటాల్‌కు బోనస్‌తోపాటు కామన్‌వెరైటీ ప్రకటన వల్ల రూ. 520 చొప్పున ఆర్థికనష్టం జరిగింది. నిజామాబాద్ జిల్లా కలెక్టర్ సిఎంఆర్ కార్యకలాపాలు సజావుగా సాగిం చేందుకు చేసిన చేసిన సూచనల ప్రకారం సన్నబియ్యం కామన్ వెరైటీగా ప్రకటించడంతో ఆ జిల్లాలో ఆరు రైసుమిల్లు నుంచి సెప్టెంబర్ చివరి నాటికి సన్నాలకు బదులు ఇతరరాష్ట్రాల నుంచి చౌకగా కొనుగోలు చేసి పాలీష్ చేసి అందిచినట్లు సివిల్‌సప్లయ్ ఎక్స్‌అఫియో ప్రిన్సిపల్ సెక్రటరీ స్టీఫెన్ రవీంద్ర గుర్తించి వెంటనే మెమోను కూడా రద్దు చేశారు. వరంగల్ జిల్లాలో కూడా ఇప్పటి వరకు సన్నాలను పక్కదారిపట్టించిన 13 మిల్లులపై కూడా క్రిమినల్ కేసులు పెట్టారు.



ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్ ఆవిష్కరిస్తున్న విమలక్క, రమణాకర్, దరువు అంజన్న, కోదారి శ్రీనివాస్, మల్లిక్ తేజ తదితరులు

3న సిరిసిల్లలో 'తెలంగాణ ఫోక్' ఆవిర్భావ వేడుకలు
అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క

హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త: తెలంగాణ కళాకారుల అభ్యున్నతి, హక్కుల సాధనే లక్ష్యంగా తెలంగాణ ఫోక్ అసోసియేషన్, తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఏర్పాటయ్యాయని తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్, అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క తెలిపారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించి అనంతరం మాట్లాడారు. నవంబరు 3న సిరిసిల్ల పట్టణకేంద్రంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో తెలంగాణ ఫోక్ ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ వేడుకల్లో తెలంగాణలోని అన్ని జిల్లాలకు చెందిన కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐక్యతను చాటాలని పిలుపునిచ్చారు. తెలుగు సినీ పరిశ్రమ తరహాలో తెలంగాణ కళాకారుల కోసం ప్రత్యేకంగా తెలంగాణ ఫోక్ ఫెడరేషన్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ కార్యవర్గ సభ్యులు, గౌరవ సలహాదారు దరువు అంజన్న, అభినయ శ్రీనివాస్, గజ్వేల్ వేణు, కోదారి శ్రీనివాస్, మల్లిక్ తేజ, జ్ఞానేశ్వర్, కోడం సంతోష్, ఘనశ్యామ్, వస్పరి విష్ణు, సంతోష్, బోడ చంద్రప్రకాష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

రక్త దానంతో ఎంతోమంది ప్రాణాలకు రక్షణ
సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్‌లో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన డిజిపి సివి ఆనంద్



డిజిపి సివి ఆనంద్‌కు జ్ఞాపికను అందజేస్తున్న తలసీమియా అండ్ సికిల్‌సెల్ సొసైటీ సంయుక్త కార్యదర్శి అలీంబేగ్, కార్యక్రమంలో పాల్గొన్న నగర పోలీస్ కమిషనర్ విసి సజ్జనార్

హైదరాబాద్ (చార్మినార్), అక్టోబరు 29, ప్రభాతవార్త : రక్త దానం ప్రాణదానం కన్న గొప్పదని, రక్త దానం చేయటం వల్ల ఎంతోమంది ప్రాణాలను రక్షించిన వారమవుతామని డిజిపి సివి ఆనంద్ అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల మహోన్నత త్యాగాలకు నివాళిగా గురువారం హైదరాబాద్ పాతబస్తీ పేట్లబుర్జులోని సిఎఆర్ హెడ్‌క్వార్టర్స్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని డిజిపి సీవీ ఆనంద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమర వీరుల స్మరణార్థం రాష్ట్రవ్యా ప్తంగా ఈనెల నెల 21 నుంచి 31వ తేదీ వరకు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. సమాజ రక్షణ కోసం పండుగలు, సెలవులను సైతం విడిచి పెట్టి పోలీసులు శాంతి భద్రతల పరిరక్షణలో నిరంతరం త్యాగనిరతి చాటుకుంటున్నారని ఆయన కొనియాడారు. ప్రాణ దానంతో సమా నమైన రక్తదానాన్ని ఉద్యమంలా చేపట్టి, సేకరించిన రక్తాన్ని ప్రభుత్వ ఆసుపత్రులకు అందించటం ఎంతో అభినందనీయమని ఆయన తెలియజేశారు. ముఖ్యంగా తలసీమియా బాధితులకు, ప్రమాదాలలో గాయపడిన వారికి ఈ రక్తం ఇవ్వటం వల్ల ప్రాణాలను రక్షించిన వారమవుతామని ఆయన తెలిపారు.చాలా మంది రక్త దానం చేయటానికి ముందుకు రావటం లేదని,రక్తదానం,అవయవ దానంపై ప్రజలలో మరింత విశ్వాసం కలిగేలా ప్రైవేట్ ఆసుపత్రులు బాధ్యతాయుతంగా వ్యవహరించాని ఆయన పిలుపు నిచ్చారు.నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ అమర వీరుల త్యాగాలను స్మరిస్తూ వారికి నిజమైన నివాళి అర్పించాలనే సంకల్పంతోనే కమిషనరేట్ పరిధిలో పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహత్కార్యానికి సహకరించిన ఉస్మానియా, గాంధీ, నిమ్స్, కింగ్ కోఠి, నిలోఫర్, ఎన్ఎంజే కేన్సర్ హాస్పటిల్స్, చిరంజీవి బ్లడ్ బ్యాంక్, తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ, రెడ్‌క్రాస్, రోటరీ లయన్స్ క్లబ్‌తో పాటు పలు స్వచ్ఛంధ సంస్థలకు, రక్తదాతలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు.తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ సంయుక్త కార్యదర్శి అలీంబేగ్ రాష్ట్ర డిజిపి సీవీ ఆనంద్‌కు మెమొంటోను అందజేశారు.కాగా 5700 యూనిట్ల రక్తాన్ని సేకరించాలని ఉద్దేశ్యంతో నగర వ్యాప్తంగా 37 కేంద్రాలలో రక్త దాన శిబిరాలను ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ సిపి క్రైమ్ ఎం.శ్రీనివాసులు,అడిషనల్ సీపీ(లాఅండ్‌ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సిపి (ట్రాఫిక్) జోయల్ డేవిస్,డిసిపి (సిఎఆర్) హెడ్‌క్వార్టర్స్ ఆర్.వెంకటేశ్వర్లు,ట్రాఫిక్ డిసిపి రాహుల్ హెగ్డే, విమెన్ సెఫ్టీ వింగ్ డిసిపి లావణ్య నాయక్ జాదవ్, తలసీమియా అండ్ సికిల్ సెల్ సొసైటీ సంయుక్త కార్యదర్శి అలీంబేగ్‌తో పలువురు పాల్గొన్నారు.

డేటా సెంటర్లకు అగ్నిమాపక భద్రతా మార్గదర్శకాలు

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: రాష్ట్రంలోని డేటా సెంటర్లకు ప్రత్యేక అగ్నిమాపక భద్రతా మార్గదర్శకాలను తెలంగాణ అగ్నిమాపక డైరెక్టర్ జనరల్ విక్రమ్‌సింగ్‌మాన్ గురువారం సాయంత్రం జారీ చేశారు. డేటా సెంటర్లలో అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ శాఖ కీలక నిర్ణయం తీసుకుంది. ఫైర్ ఎన్‌ఓసీ దరఖాస్తుల వేగవంతమైన పరిష్కారానికి కొత్త నిబంధనలు విధించింది. నవంబర్ 6వ తేదీ నుంచి సమర్పించే తాత్కాలిక ఫైర్ ఎన్‌ఓసీ దరఖాస్తులకు కొత్త మార్గదర్శకాలు వర్తింపజేస్తున్నట్లు స్పష్టం చేసింది. సర్వర్లు, బ్యాటరీలు, యూపీఎస్, ట్రాన్స్‌ఫార్మర్ల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. డేటా సెంటర్లలో ఫైర్ అలారాలు, అగ్నిమాపక వ్యవస్థలు తప్పనిసరి చేసింది. టెక్నికల్ విభాగాల్లో వాటర్ మిస్ట్ లేదా క్లీన్ ఏజెంట్ గ్యాస్ ఫైర్ సప్రెషన్ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.
అగ్నిప్రమాద వ్యాప్తిని అడ్డుకునే విభజనలు, అత్యవసర మార్గాలు, అగ్నిమాపక నీటి నిల్వలు తప్పనిసరి చేసింది. మండే స్వభావం ఉన్న ప్యాకింగ్ సామగ్రి, వ్యర్థాలు పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించింది. ఫైర్ సేఫ్టీ వ్యవస్థలను భవన నిర్వహణ, అత్యవసర స్పందన వ్యవస్థలతో అనుసంధానం చేయాలని సూచించింది. భద్రతతోపాటు ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించింది. కీలక డిజిటల్, మౌలిక సదుపాయాల రక్షణ, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధతే లక్ష్యమని తెలంగాణ సర్కార్ స్పష్టం చేసింది. తెలంగాణలోని డేటా సెంటర్లలో అగ్నిప్రమాదాల నివారణను బలోపేతం చేయడం, అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనే సన్నద్ధతను మెరుగుపరచడం, నిర్దేశించిన అగ్నిమాపక, ప్రాణ రక్షణ భద్రతా ప్రమాణాల అమలును నిర్ధారించడం ఈ మార్గదర్శకాల ప్రధాన ఉద్దేశం. తద్వారా కీలక మౌలిక సదుపాయాలకు భద్రత కల్పించడంతోపాటు అత్యవసర పరిస్థితుల్లో సమర్థవంతమైన స్పందనకు మార్గం సుగమం కానుంది.

వేధింపులను ప్రశ్నించండి.. వివక్షను ఎదిరించండి
మహిళల భద్రతకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి
'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో డిజి చారుసిన్హా

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: మహిళల భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా భావించాలని మహిళా భద్రతా విభాగం డిజి చారుసిన్హా పేర్కొన్నారు. వేధింపులు, వివక్ష వంటి అనుచిత ప్రవర్తనను గుర్తించి ప్రశ్నించే ధైర్యాన్ని యువత అలవరచుకోవాలని సూచించారు. తెలంగాణ పోలీసు మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గురువారం 'స్టాండ్ విత్ హర్' ప్రచార కార్యక్రమంలో భాగంగా రెండురోజుల శిక్షకుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఉస్మానియా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య డాక్టర్ కుమార్ మొలుగారం, డిజి చారుసిన్హా, మహిళా భద్రతా విభాగం శిక్షణ, కంటెంట్ అభివృద్ధి విభాగం అధిపతి ఆసియా షెర్వాణి హాజరయ్యారు. రాష్ట్రంలోని వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. మహిళల భద్రతకు చట్టాల అమలు ఒక్కటే సరిపోదని, ప్రజల ఆలోచనా విధానం, సామాజిక దృక్పథం, రోజువారీ ప్రవర్తనలోనూ మార్పు రావాలని డిజి పేర్కొన్నారు. ముఖ్యంగా యువకులు మహిళల పట్ల గౌరవభావంతో మెలగాలని, లింగ వివక్ష, వేధింపులను ప్రోత్సహించే ధోరణులను వ్యతిరేకించాలని సూచించారు.



విశ్వవిద్యాలయాల్లో అందరికీ సమాన అవకాశాలు కల్పిస్తూ సురక్షితమైన విద్యా వాతావరణాన్ని ఏర్పరచాల్సిన అవసరం ఉందని ఉపకులపతి కుమార్ మొలుగారం అన్నారు. విశ్వవిద్యాలయంలో సుమారు 40 శాతం మంది అధ్యాపకులు మహిళలేనని తెలిపారు. 1,500 మంది మహిళలు నివసించేలా ప్రత్యేక బహుళ అంతస్తుల వసతి గృహాల నిర్మాణానికి చర్యలు చేపడు తున్నట్లు వివరించారు. ఈ నెల 30వ తేదీ వరకు జరిగే శిక్షణ కార్యక్రమంలో నాలుగు బ్యాచ్‌లుగా 250 మందికి పైగా విద్యార్థులు, అధ్యాపకులకు శిక్షణ ఇస్తారు. వీరు తమ కళాశాలల్లో ఇతరులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. తద్వారా వచ్చే ఆరు నెలల్లో 2,000 మందికి పైగా ఈ కార్యక్రమం ద్వారా అవగాహన కల్పించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మహిళల భద్రత, గౌరవం, సమానత్వం, పరస్పర సమ్మతిపై అవగాహనను కార్యాచరణగా మార్చి, సురక్షి తమైన సమాజ నిర్మాణానికి కృషి చేయడమే 'స్టాండ్ విత్ హర్' లక్ష్యంగా డిజి పేర్కొన్నారు.

కరవు మండలాలపై రైతుల అసంతృప్తి
జాబితాలో చోటుదక్కని పలు ప్రాంతాలు
దెబ్బతిన్న పంటలతో కొట్టుమిట్టాడుతున్న అన్నదాతలు

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: కరువు పీడిత మండలాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటనపై వివిధ జిల్లాలకు చెందిన రైతులు అసంతృప్తిగా ఉన్నారు. వివిధ జిల్లాలోని అనేక ప్రాంతాలు కరవుతో అల్లాడుతున్నప్పటికీ, కేవలం కొన్ని మండలాలను మాత్రమే కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించారని అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఎల్‌నినో వల్ల అనేక ప్రాంతాలు ప్రభావితమైనప్పటికీ, కేవలం కొన్ని మండలాలను కరవు పీడిత ప్రాంతాలుగా ప్రకటించి ప్రభుత్వం చేతులు దులుపుకోవడం సరికాదని పలువురు రైతులు అంటున్నారు. కరవు పీడిత మండలాలను నిరక్ష్యం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కరవుతో కొట్టుమిట్టాడుతున్న ప్రాంతాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ విధంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 63 మండలాలలో వర్షాభావ, కరవు పరిస్థితులతో రైతులు సంక్షోభంలో ఉండగా, కేవలం 8 మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించారని విమర్శిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ రూరల్, కరీంనగర్ అర్బన్, హుజూరాబాద్, జగిత్యాల జిల్లాలోని జగిత్యాల రూరల్, జగిత్యాల అర్బన్, కొడిమ్యాల్, సిరిసిల్ల జిల్లాలోని వీర్నాపల్లి, ఎల్లంతకుంటలతో సహా కేవలం ఎనిమిది మండలాలను మాత్రమే కరువు పీడిత ప్రాంతాలుగా ప్రకటించారు. పెద్దపల్లి జిల్లాలో ఒక్క మండలం కూడా కరవు కేటగిరీలో లేదు. అత్యంత ప్రభావితమైన సైదాపూర్ మండలం కూడా కరువు జాబితాలో లేదు. సైదాపూర్ మండలంలోని చాలా గ్రామాల్లో నీటి వనరులు లేవని రైతులు పేర్కొంటున్నారు.
భూగర్భ జలమట్టం తగ్గిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం వల్ల చాలా పొలాలు ఎండిపోయాయని సైదాపూర్ మండలం రైకల్‌కు చెందిన రైతులు వాపోతున్నారు. సైదాపూర్ మాత్రమే కాకుండా, వీణవంక, రామడుగు, చొప్పదండి, హుస్నాబాద్, వేములవాడ్, సిరిసిల్ల వంటి అనేక మండలాలు కరువుతో అల్లాడుతున్నా యని రైతు రాజమల్లయ్య తెలిపారు. వీణవంక మండలాన్ని కూడా ఆ జాబితాలో చేర్చాలని ఆయన ప్రభు త్వాన్ని కోరారు. ఇదేవిధంగా వివిధ జిల్లాల్లో పలు మండలాలు కరవుతో అల్లాడుతుంటే వాటిని వదలివేశారని చెబుతున్నారు. కాగా ఒక ప్రాంతాన్ని కరువు పీడిత ప్రాంతంగా ప్రకటించాలంటే, ఏడు ప్రమాణాలలో కనీసం ఐదు ఆ ప్రాంతంలో ఉండాలని వ్యవసాయ అధికారులు స్పష్టం చేస్తున్నారు. పంట విస్తీర్ణంలో తగ్గుదల, 21 రోజులకు పైగా సుదీర్ఘ పొడి వాతావరణం, దిగుబడి నష్టం వంటి అంశా లను పరిగణనలోకి తీసుకుని కరువు పరిస్థితిపై నిర్ణయం తీసుకుంటారని అధికారులు స్పష్టం చేశారు.



గాంధీభవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతున్న పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

ఆర్ఎస్ఎస్ కంచుకోటలో.. బిజెపి గుండెల్లో బుల్లెట్ దించాం
పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్య

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: ఆర్ఎస్ఎస్ కంచుకోట నాగపూర్‌లో కాంగ్రెస్ ఎన్నికల్లో గెలిచి బ్యాలట్‌తో బిజెపి గుండెల్లో బుల్లెట్ దింపామని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ విజయ ధరహాసంతో హర్షం ప్రకటించారు. గాంధీభవన్‌లో గురువారం మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రాతినిథ్యం వహిస్తున్న వారణాసి నియోజకవర్గంలో టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో బిజెపి అభ్యర్థి ప్రమోద్‌మిశ్రా ఓడిపోవడం, ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయం ఉన్న నాగ్‌పూర్ గ్రాడ్యుయేట్ నియోజకవర్గంలో బిజెపి ఓటమి మతరాజకీయాల పట్ల మేధావులు విసిగి పోయారనడానికి సంకేతమన్నారు. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ సొంతవూరు నాగ్‌పూర్‌లో గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాం గ్రెస్ అభ్యర్థి అభిజీత్ వంజారి, బిజెపిపై అభ్యర్థి సుధాకర్ కోహళేపై విజయం సాధించాడనీ వివరించారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ప్రాతి నిధ్యం వహిస్తున్న లక్నోలో గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని సమాజ్ వాదీ పార్టీ బిజెపి నుంచి కైవసం చేసుకుంది. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజకీయ ప్రాబల్యం ఉన్నప్పటికీ, ఐదుసార్లు ఎమ్మెల్సీగా గెలిచిన నవల్ కిశోర్ యాదవ్, పాట్నా టీచర్స్ ఎమ్మెల్సీ స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయారు. యోగి ఆదిత్యనాథ్ సొంత గడ్డ గోరఖ్‌పూర్- ఫైజాబాద్ టీచర్స్ ఎమ్మెల్సీ స్థానంలో బిజెపి అభ్యర్థి ధ్రువ్‌కుమార్ త్రిపాఠి కేవలం 307 ఓట్ల స్వల్ప మెజారిటీతో విజయం సాధించారు.

పట్టభద్రులైన దివ్యాంగులు కాంగ్రెస్‌కు ఓటు వేయాలి: ముత్తినేని వీరయ్యకు పిసిసి చీఫ్ దిశానిర్దేశం

ప్రత్యేకవసరాలు కలిగిన పట్టభద్రులు కాంగ్రెస్‌పై నమ్మకం ఉంచి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓట్లు వేయాలని దీనికి కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం కూడా చొరవ తీసుకొని క్షేత్రస్థాయిలో వారి మద్దతు కూడగట్టాలని పిసిసి చీఫ్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ పిలుపు నిచ్చారు. గురువారం గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం చైర్మన్ ముత్తినేని వీరయ్యతో ప్రత్యకంగా సమావేశమై నల్లగొండ -వరంగల్- ఖమ్మం, రంగారెడ్డి- హైదరాబాద్- మహబూబ్ నగర్ పట్ట భద్రుల ఎమ్మెల్సీల గెలుపే లక్ష్యంగా పనిచేయడానికి వికలాంగుల కాంగ్రెస్ తీసుకోవాల్సిన చర్యలు చర్చించారు.

అన్నదాతలకు డిజిటల్ భరోసా
11 కోట్ల మందికి రైతు ఐడిలు
గడువు కంటే ఐదు నెలలు ముందే పూర్తి

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: దేశ వ్యవసాయ రంగంలో ఒక చరిత్రాత్మక మైలురాయి నమోదైంది. సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అన్నదాతలను ఆర్థికంగా, పారిశ్రామికంగా మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా కేంద్రం చేపట్టిన డిజిటల్ వ్యవసాయ మిషన్ అద్భుతమైన విజయాన్ని సాధించింది. నిర్దేశిత గడువు కంటే ఐదు నెలలు ముందే ఏకంగా 11 కోట్ల మంది రైతులకు ప్రత్యేక డిజిటల్ ఐడీలను సృష్టించి సరికొత్త రికార్డు సృష్టించింది. వికసిత్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా వ్యవసాయ రంగంలో డిజిటల్ విప్లవం వేగవంతమైంది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు మంత్రిత్వ శాఖ సీనియర్ కార్యదర్శి వెల్లడించిన వివరాలు ప్రకారం వ్యవసాయ రంగంలో సాంకేతిక ఆధారిత పాలన అమలవుతోంది. ఇందులో భాగంగా రూపొందించిన అగ్రిస్టాక్ వ్యవస్థ ద్వారా రైతు రిజిస్ట్రీ, డిజిటల్ పంట సర్వే, మ్యాపింగ్ ప్రక్రియను పటిష్టంగా అమలు చేస్తున్నారు. ఈ డిజిటల్ ఐడీ ద్వారా దేశంలోని ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుంది. దీనివల్ల ప్రభుత్వ పథకాలు, సేవలను అర్హులైన రైతులకు ఎలాంటి మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా అందించడానికి వీలవుతుంది. కాగా కౌలు రైతులు, అసలైన సాగుదారులు కూడా ఈ డిజిటల్ జాబితాలో చోటు దక్కించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఎల్‌నినోతో వ్యవసాయ సంక్షోభం
మహారాష్ట్రలో రైతులకు ఐఎఎస్, ఐపిఎస్‌ల అండ
సిఎం సహాయనిధికి ఒకరోజు వేతన విరాళం

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త: ఎల్ నినో ప్రభావంతో మహారాష్ట్రలో వర్షాభావ పరిస్థితులతో కరువు ఏర్పడింది. సాగు, తాగునీరు లేక ప్రజలు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయం దెబ్బతిని పంటలు ఎండిపోయి పెట్టుబడులు నష్టపోయిన అక్కడి రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని రైతులకు అండగా నిలిచేందుకు అక్కడి ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు ముందుకు వచ్చారు. ఇందులో భాగంగా అక్టోబరులోని ఒక రోజు వేతనాన్ని సిఎం సహాయ నిధికి విరాళంగా ఇవ్వడానికి ముందుకు వచ్చారు. ఇప్పటికే ఆ రాష్ట్ర పునరావాస, సహాయక శాఖ ఈ నెల 14న 305 తాలూకాలను కరవు పీడిత ప్రాంతాలుగా అధికారికంగా ప్రకటించింది. కరువు ప్రభావిత ప్రాంతాల్లోని రైతులకు భూమి శిస్తు నుంచి మినహాయింపు కల్పించారు. పంట రుణాలను 10 యేళ్ల వాయిదావేసి తిరిగి కొత్తగా రుణాలు ఇచ్చేలా పునర్ వ్యవస్థీకరించనున్నట్లు ప్రకటించింది. అంతే గాకుండా వ్యవసాయ రుణాల వసూళ్లను తక్షణమే నిలిపి వేస్తామని ప్రభుత్వం తెలిపింది.. కరువు ప్రభావిత ప్రాంతాల విద్యార్థులకు పరీక్షా రుసుములను రద్దు చేయనున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర రైతుల కోసం అధికారుల సంఘం తమ ఒక రోజు వేతనాన్ని కరవు సహాయనిధికి జమ చేస్తున్నట్లు లేఖను విడుదల చేసింది.



ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థుల భారీ ప్రదర్శనలో పాల్గొన్న రాజ్యసభ సభ్యుడు ఆర్ .కృష్ణయ్య

ఫీజుల బకాయిలు 8,500 కోట్లు వెంటనే చెల్లించాలి

విద్యానగర్ శంకర్ మఠ్ వద్ద విద్యార్థుల భారీ ప్రదర్శన

ఆర్. కృష్ణయ్య ఆధ్వర్యంలో హోరెత్తిన నిరసన

హైదరాబాద్ అక్టోబర్ 29 (ప్రభాతవార్త) : రాష్ట్రంలో చదువుకుంటున్న 14 లక్షల మంది విద్యార్థులకు సంబంధించిన 8,500 కోట్ల ఫీజు రీయింబర్స్మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం విద్యానగర్ శంకర్ మఠ్ వద్ద విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. కోర్సులు పూర్తి చేసిన 6 లక్షల మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు రాక తీవ్ర అవస్థలు పడుతున్నారని, ప్రభుత్వానికి వీరి ఆర్తనాదాలు వినిపించడం లేదా అని నాయకులు ధ్వజమెత్తారు. రాష్ట్ర బి.సి. విద్యార్థి సంఘం కన్వీనర్ పర్లగొర్ల మోడీరాందేవ్ యాదవ్ నాయకత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ భారీ ప్రదర్శనను ఉద్దేశించి జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ.. ఫీజుల బకాయిలు చెల్లిస్తామని అసెంబ్లీలో ముఖ్యమంత్రి ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు బడ్జెట్ విడుదల చేయకపోవడం శోచనీయమన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ, విశ్వవిద్యాలయాల పరిధిలోని కాలేజీల్లో ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు ఇస్తామని యాజమాన్యాలు పట్టుబడుతున్నాయని తెలిపారు. సర్టిఫికెట్లు లేక ఉన్నత విద్య, ఉద్యోగాలు, విదేశీ విద్య అవకాశాలను విద్యార్థులు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజుల కోసం సర్టిఫికెట్లను ఆపవద్దని సుప్రీంకోర్టు, హైకోర్టుల తీర్పులు, ప్రభుత్వ ఉత్తర్వులు ఉన్నప్పటికీ యాజమాన్యాలు, యూనివర్సిటీలు వాటిని ధిక్కరిస్తూ విద్యార్థులను వేధిస్తున్నాయని మండిపడ్డారు. ఆంధ్రప్రదేశ్ తరహాలో స్కాలర్‌షిప్‌లను ప్రతి విద్యార్థికి ..5,000 నుండి ..20,000 వరకు పెంచాలని, విద్యార్థుల ఖాతాలోకి నిధుల వివరాలను మెసేజ్ రూపంలో పంపాలని సూచించారు. ప్రభుత్వానికి వివిధ రూపాల్లో రూ. 11 లక్షల కోట్ల రాబడి వచ్చినా, కాంట్రాక్టర్లకు వేల కోట్లు చెల్లిస్తూ.. విద్యార్థుల భవిష్యత్తుకు కేటాయించేందుకు రూ. 8 వేల కోట్లు లేవనడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానం ప్రకారం కాలేజీ విద్యార్థుల ఫీజులను పూర్తిగా చెల్లించాలి. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జిల్లపల్లి అంజి, బీసీ సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పగిళ్ళ సతీష్, రాష్ట్ర కన్వీనర్ నిఖిల్ పటేల్, అల్లం యాదయ్య, సుద్దగొని నరేష్ గౌడ్, రామాంజనేయులు, కిరణ్, రఘుపతి, వంశీ, బాలయ్య తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎల్‌నినో దెబ్బ-తెలంగాణలో 23.40 లక్షల ఎకరాల్లో పంట నష్టం

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం అన్నదాతలను కోలుకోలేని దెబ్బతీసింది. వర్షాభావ పరిస్థితులు, తీవ్రమైన ఎండల కారణంగా రాష్ట్ర వ్యాప్తంగా పంటలు పూర్తిగా ఎండిపోయి రైతులు తీవ్ర నష్టం ఎదుర్కొంటున్నారు. ఈ మేరకు తెలంగాణ వ్యాప్తంగా భారీగా పంట నష్టం జరిగినట్లు సమాచారం. ఈ క్రమంలో 23.40 లక్షల ఎకరాల్లో(దాదాపు 18.6శాతం) పంట నష్టం జరిగినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. పత్తి 15.88లక్షల ఎకరాలు, వరి 4.79లక్షల ఎకరాలు, కందులు 1.58లక్షల ఎకరాలు, మొక్కజొన్న 0.70లక్షల ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించింది. కాగా, పంట నష్టంపై తుది నివేదికను సిద్ధం చేయాల్సి ఉంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 365 కరవు మండలాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విషయం తెలిసిందే.

నవంబర్ 2న బిజెపి మహా పాదయాత్ర... పాల్గొననున్న అమిత్‌షా

సన్నాహాలు చేస్తున్న బిజెపి రాష్ట్ర నాయకత్వం

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: హైదరాబాద్‌లోని మొజాంజాహీ మార్కెట్ నుంచి అఫ్జల్‌గంజ్ వరకు బీజేపీ మహా పాదయాత్ర నవంబర్ 2న సాయంత్రం 4 గంటలకు ప్రారంభించనుంది. ఈ మహా పాదయాత్రలో అమిత్ షా పాల్గొననున్నారు. కాగా, ఆ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బిజెపి రాష్ట్ర నాయకత్వం సన్నాహాలు చేస్తుంది. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర కీలక నేతలంతా పాల్గొంటారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పై చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టేందుకు బిజెపి భారీ వ్యూహంతో ముందుకు వచ్చింది. ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. అరాచకాన్ని అడ్డుకోండి అనే శక్తివంతమైన నినాదంతో బిజెపి మహా పాదయాత్రను చేపట్టనుంది. నవంబర్ 1న ఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్‌లో కాంగ్రెస్ పార్టీ ఓట్ చోరీ ఆరోపణలతో భారీ ర్యాలీకి నిర్ణయించింది. ఆ మరుసటి రోజునే బీజేపీ అధి నాయకత్వం హైదరాబాద్ కేంద్రంగా పాదయాత్రకు డిసైడ్ అయింది. అమిత్ షా స్వయంగా ఈ పాదయాత్రలో పాల్గొని తెలంగాణ రణక్షేత్రంలో బిజెపి శ్రేణులకు దిశానిర్దేశం చేసే విధంగా ఆయన షెడ్యూల్ ఫిక్స్ అయింది. దీంతో.. బీజేపీ అధినాయకత్వం తెలంగాణ కేంద్రంగా తమ టార్గెట్ ఏంటనే సంకేతాలు స్పష్టం చేస్తోంది. కాంగ్రెస్ ఓట్ చోరీ డ్రామాకు అమిత్ షా కౌంటర్ ఇచ్చేందుకు ఈ పాదయాత్ర చేపట్టారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టడమే ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశంగా పార్టీ నేతలు చెబుతున్నారు. హైదరాబాద్‌లో మహాపాదయాత్ర ప్రాంతాన్ని బీజేపీ మార్చింది. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా పాల్గొననుండటంతో ట్యాంక్‌బండ్ నుంచి మొజాంజాహీ మార్కెట్‌కు మార్చింది. బహిరంగ సభ కోసం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానాన్ని బీజేపీ నేతలు పరిశీలించారు.

ఓటు హక్కు పోతే మిగతా హక్కులూ ప్రమాదంలో పడ్డట్టే

రాజ్యాంగ పరిరక్షణకు ఢిల్లీకి తరలివెళ్దాం: సిఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: ఓటు హక్కు చోరీకి గురైతే మిగతా హక్కులన్నీ ప్రమాదంలో పడ్డట్టేనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు దేశ ప్రజలంతా ముందుకు రావాలని రాహుల్ గాంధీ ఇచ్చిన పిలుపుకు తాను మద్దతు తెలుపుతున్నానన్నారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా రేవంత్ రెడ్డి గురువారం పోస్టు చేశారు. రాహుల్ గాంధీకి మద్దతుగా తాను ఢిల్లీలో ఉంటానని, యావత్ తెలంగాణ సైతం రాహుల్‌కు అండగా నిలుస్తుందన్నారు. ఇది ఒక్క పార్టీ పోరాటం కాదని భారతదేశ పోరాటం అన్నారు. మన ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని, మన గొంతును వినిపించే హక్కును, మన ఉనికిని కాపాడుకునేందుకు జరుగుతున్న పోరాట అన్నారు. ఓటు చోరీకి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ గొంతెత్తాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు, ప్రజాస్వామ్యాన్ని రక్షించుకునేందుకు ఢిల్లీకి తరలివెళ్దామని పిలుపునిచ్చారు. కాగా దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవడానికి నవంబర్ 1న న్యూఢిల్లీలోని రామ్‌లీలా మైదాన్ వేదికగా చేపడుతున్న చలో ఢిల్లీ రామ్‌లీలా మార్చ్ లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.

ఐఎస్ఎమ్ 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయండి

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్- 2026 కర్టెన్ రైజర్‌లో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్,అక్టోబరు29,ప్రభాతవార్త: సెమీకండక్టర్ మిషన్ (ఐఎస్ఎమ్) 2.0లో తెలంగాణను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ఫలితంగా... ఫ్యాబ్ ఇండస్ట్రీ, చిప్ డిజైన్ విభాగాల్లోనూ తెలంగాణ అగ్రగామిగా ఎదిగేందుకు మరింత అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. గురువారం సాయంత్రం ఢిల్లీలో నిర్వహించిన "ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026" కర్టెన్ రైజర్ లో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర డిఫెన్స్ ఎగుమతులు గతంతో పోలిస్తే 103 శాతం పెరిగాయన్నారు. రాష్ట్రంలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని 2030 నాటికి 5 గిగావాట్లకు చేర్చేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామన్నారు. 2047 నాటికి దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి చేర్చాలనే సంకల్పంతోనే గతేడాది "తెలంగాణ రైజింగ్" విజన్ కు శ్రీకారం చుట్టామన్నారు.

షేక్ హసీనా దేశం విడిచిన వీడియోలు తీసిన ఆర్మీ అధికారి తహ్సీఫ్ సౌదీ అనుమానాస్పద మృతి



ఢాకా, అక్టోబరు 29: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా 2024 ఆగస్టులో దేశం విడిచి ఇండియాకు వస్తున్న సమయంలో, ఈ ఘటనకు సంబంధించిన వీడియో వైరల్ అయింది. ఆమె మిలిటరీ హెలికాప్టర్ ఎక్కుతున్న వీడియో అప్పుడు సోషల్ మీడియాలతో సంచలనంగా మారింది. ఈ వీడియోతో సంబంధం ఉందని భావిస్తున్న మాజీ ఎయిర్ ఫోర్స్ ఆఫీసర్ కేఎం తహ్సీఫ్ సౌదీ ఇప్పుడు అనుమానాస్పదంగా మరణించారు. షేక్ హసీనా డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌కు తిరిగి వెళ్తానని ప్రకటించిన సమయంలో ఈ మరణం చోటుచేసుకుంది. ఢాకాలోని తురాగ్ నది లో ఆయన మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. 28 ఏళ్ల సౌరీ అక్టోబర్ 27 నుంచి కనిపించకుండా పోగా, ఈనెల 28న ఆయన మృతదేహం లభ్యమైంది. సౌరీది హత్యేనని వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. గుర్తుతెలియని మృతదేహంగా భావించినప్పటికీ, చేతి గడియారం ద్వారా గుర్తించారు.

ఖేలో ఇండియా గేమ్స్‌ను ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలి

- కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయ - ఖేలో ఇండియా గేమ్స్ ప్రారంభోత్సవానికి ప్రధాని నరేంద్ర మోడీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలి: మంత్రి వాకిటి శ్రీహరి

హైదరాబాద్, అక్టోబరు29, ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించనున్న ప్రతిష్టాత్మక ఖేలో ఇండియా గేమ్స్ విజయవంతం కావడానికి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఏర్పాట్లు, కార్యాచరణ ప్రణాళికపై కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయా గురువారం న్యూఢిల్లీలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పారిశ్రామికాభివృద్ధి, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొని, రాష్ట్రంలో ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలను కేంద్ర మంత్రితో చర్చించారు. తెలంగాణలో ఖేలో ఇండియా గేమ్స్‌ను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించి, దేశవ్యాప్తంగా క్రీడాకారులు, క్రీడాభిమానుల దృష్టిని ఆకర్షించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర మంత్రి మన్సుఖ్ మాండవీయా సూచించారు. ఈ జాతీయ స్థాయి క్రీడా పోటీల నిర్వహణలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, నిర్ణీత సమయంలో అవసరమైన ఏర్పాట్లన్నింటినీ పూర్తి చేయాలని తెలంగాణ ప్రభుత్వ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ అనేది కేవలం క్రీడా పోటీలకే పరిమితం కాకుండా, రాష్ట్ర క్రీడా సామర్థ్యాన్ని దేశానికి పరిచయం చేసే గొప్ప అవకాశమని ఈ సందర్భంగా చర్చించారు. క్రీడా వేదికల సిద్ధత, మౌలిక సదుపాయాల కల్పన, క్రీడాకారులకు వసతి, రవాణా, భద్రత, వైద్య సదుపాయాలు, సాంకేతిక ఏర్పాట్లు, పోటీల నిర్వహణకు అవసరమైన సిబ్బంది సమన్వయం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని కేంద్ర మంత్రి సూచించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో క్రీడాకారులు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, అధికారులు హాజరయ్యే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని తెలిపారు. క్రీడాకారులు తమ ప్రతిభను పూర్తిస్థాయిలో ప్రదర్శించేందుకు అనువైన వాతావరణాన్ని కల్పించడంతో పాటు, పోటీల నిర్వహణలో పారదర్శకత, సమయపాలన, నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. కాగా, తెలంగాణలో జరగనున్న ఖేలో ఇండియా గేమ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రధానమంత్రి ప్రారంభోత్సవానికి హాజరైతే ఖేలో ఇండియా గేమ్స్‌కు మరింత జాతీయ ప్రాధాన్యత లభిస్తుందని, దేశవ్యాప్తంగా యువ క్రీడాకారులకు స్ఫూర్తి కలుగుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. క్రీడలను ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలకు అనుగుణంగా తెలంగాణలోనూ క్రీడా సంస్కృతిని మరింత విస్తరించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని పేర్కొన్నారు. ఖేలో ఇండియా గేమ్స్‌ను విజయవంతంగా నిర్వహించడం ద్వారా తెలంగాణ రాష్ట్రానికి క్రీడా రంగంలో జాతీయ స్థాయిలో మరింత గుర్తింపు తీసుకురావడంతో పాటు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్న క్రీడా మౌలిక సదుపాయాలను దేశానికి పరిచయం చేసే అవకాశం లభిస్తుందని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు.

ఖేలో ఇండియా గేమ్స్ నిర్వహణ కోసం తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ రూపొందించిన సమగ్ర ప్రణాళికను రాష్ట్ర ప్రభుత్వ అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కేంద్ర మంత్రికి వివరించారు.



సిఇసి జ్ఞానేశ్‌పై ఇండియా కూటమి ప్రజా అభిశంసన కార్యక్రమం

నేడు ఖర్గేనివాసంలో కూటమి ఎంపిలందరూ హాజరు!

న్యూఢిల్లీ, అక్టోబరు 29: దాదాపు రెండు వారాల విరామం తర్వాత, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై మరోసారి ఒత్తిడి పెంచేందుకు ఇండియా కూటమి పార్టీలు సిద్ధమయ్యాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆయనకు వ్యతిరేకంగా ప్రజా అభిశంసన కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రతిపక్షాలు నిర్ణయించాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసమైన 10, రాజాజీ మార్గ్‌లో ఈ కార్యక్రమం జరగనుంది. సుమారు 20 రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇందులో పాల్గొనే అవకాశం ఉంది. నాలుగు గంటల పాటు జరిగే ఈ కార్యక్రమం సాయంత్రం 4 గంటలకు ప్రారంభమవుతుంది. నాయకులు మధ్యాహ్నం 3:30 గంటలకల్లా కార్యక్రమ వేదికకు చేరుకోవాలని సూచించారు. రాత్రి 8 గంటల ప్రాంతంలో కార్యక్రమం ముగిసే అవకాశం ఉంది. మాజీ లోక్‌సభ స్పీకర్ మీరా కుమార్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించనుండగా, రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున ఖర్గే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ముగింపు ప్రసంగం చేయనున్నారు. తీర్మానంపై జరిగే చర్చలో పాల్గొనే ప్రతి రాజకీయ పార్టీ తరఫున ఒక ప్రతినిధికి మాట్లాడే అవకాశం కల్పించనున్నారు. పౌర సమాజ ప్రతినిధులు కూడా పాల్గొని తమ ఆందోళనలను వ్యక్తం చేయడంతో పాటు డిమాండ్లను వినిపించనున్నారు. మొత్తం సుమారు 30 మంది వక్తలు చర్చలో పాల్గొంటారని అంచనా. భారత ఎన్నికల సంఘం పనితీరులో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలను ప్రస్తావించేందుకు, ఓటర్ల జాబితా నుంచి తమ పేర్లు తొలగించబడ్డాయని చెబుతున్న వ్యక్తులను కూడా ఇండియా కూటమి పార్టీలు ఈ కార్యక్రమానికి ఆహ్వానించాయి. ఈ కార్యక్రమంలో అధికార పక్షానికి కేటాయించిన ట్రెజరీ బెంచీలు ఉండవు. ప్రధాని లేదా కేంద్ర హోంమంత్రి పాత్రను ఎవరైనా పోషిస్తారా అని ప్రశ్నించగా, సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ స్పందిస్తూ, వారి పాత్రను పోషించాలని ఎవరూ కోరుకోవడం లేదు. అయితే ఈ వార్త చూసిన తర్వాత ప్రధాని ఇక్కడికి రావాలనుకుంటే, ఆయన మాట్లాడేందుకు తగిన సమయం కేటాయిస్తామని వ్యాఖ్యానించారు. పార్లమెంటును అపహాస్యం చేసినట్లుగా ఈ కార్యక్రమం కనిపించకూడదని ప్రతిపక్షాలు భావించినట్లు తెలుస్తోంది.

అందుకే మాక్ పార్లమెంట్ నిర్వహించడానికి బదులుగా ప్రజా అభిశంసనకార్యక్రమాన్ని చేపట్టాలని పార్టీలు నిర్ణయించినట్లు వెల్లడించాయి. ఎన్నికల ప్రక్రియలో అక్రమాలు జరిగాయన్న ప్రతిపక్షాల ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ బాధ్యత వహించాలన్న డిమాండ్ల నేపథ్యంలో ఈ కార్యక్రమం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ

- సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లకుండా వినియోగం - గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవల విస్తరణ - ఆవాసాల్లో మౌలిక సదుపాయాలు - డిప్యూటీ సిఎం భట్టి, మంత్రి లక్ష్మణ్

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానంగా ఆర్థిక, సామాజిక అభ్యున్నతికి ఉద్దేశించిన ప్రత్యేక అభివృద్ధి నిధులను సమర్థవంతంగా వినియోగించి, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో గురువారం ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధుల వినియోగంపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు నిర్దేశిత లక్ష్యాలకు మాత్రమే వినియోగించేలా పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను అమలు చేయాలని ఈ సందర్భంగా విక్రమార్క స్పష్టం చేశారు. నిధుల వినియోగంలో జాప్యం చోటుచేసుకోకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. రైతు భరోసా, సబ్సిడీ విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ రైతులకు అందుతున్న ప్రయోజనాలను సమగ్రంగా నమోదు చేయాలని సూచించారు. భూమి యాజమాన్యం ఆధారంగా అమలవుతున్న పథకాల వల్ల సబ్‌ప్లాన్ నిధుల వినియోగంలో ఏర్పడుతున్న వ్యత్యాసాలను గుర్తించి, అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఆదేశించారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరించి, పథకాల వారీగా లబ్ధిదారుల పేర్లు, గ్రామాలు, సామాజిక వర్గం, అందిన ప్రయోజనాల వివరాలతో డిజిటల్ రికార్డు రూపొందించాలన్నారు. ప్రతి శాఖ తన పరిధిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అందించిన ప్రయోజనాలను స్పష్టమైన గణాంకాలతో వెల్లడించాలని అన్నారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సుమారు 1,300 ఎకరాల మేర ఖాళీ ప్రభుత్వ భూమిని అవసరాలకు అనుగుణంగా వినియోగించాలని చెప్పారు. ఇప్పటికే గుర్తించిన స్థలాలను అర్హులైన కుటుంబాలకు అందించేందుకు అవసరమైన అనుమతులు, తదుపరి చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. గృహ స్థలాలు లేని అర్హులైన కుటుంబాలకు స్థలాలు సమకూర్చేందుకు అవసరమైన చోట భూసేకరణ ప్రతిపాదనలను పరిశీలించాలని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ వర్గాల సామాజిక అవసరాలను గుర్తించి కమ్యూనిటీ హాళ్లు, శ్మశానవాటికలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని భట్టి విక్రమార్క సూచించారు. స్థానిక అవసరాల ఆధారంగా ప్రాధాన్య క్రమంలో ప్రతిపాదనలు సిద్ధం చేసి, వివిధ శాఖల సమన్వయంతో పనులను చేపట్టాలని వెల్లడించారు. మంత్రి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ నిధులు దారి మళ్లకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలన్నారు.

గ్లోబల్ సమిట్‌తో యువత ఉపాధికి రేవంత్ కృషి

తెలంగాణను భూస్థాపితం చేసిన బిఆర్ఎస్

భువనగిరి లోక్ సభ సభ్యుడు చామల కిరణ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త: తెలంగాణ యువతకు ఉద్యోగాలు కల్పించాలని సిఎం రేవంత్ రెడ్డి గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నారనీ భువనగిరి లోక్ సభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. గురువారం ఢిల్లీలో గ్లోబల్ సమిట్ వేదికగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి పెట్టుబడుల కోసమే గ్లోబల్ సమ్మిట్ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తోందనీ బిఆర్ఎస్ హయాంలో ఒక్క గ్లోబల్ సమ్మిట్ నిర్వహించలేదని అన్నారు. తొమ్మిది లక్షల కోట్లు పెట్టుబడులు తెచ్చామని కెటిఆర్ ఫేక్ మాటలు మాట్లాడుతున్నారనీ ఆరోపించారు. గ్లోబల్ సమ్మిట్ పై కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు ఎంపి చామల కిరణ్ రెడ్డి బదులు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్నది గ్లోబల్ సమ్మిట్ గోబెల్స్ సమ్మిట్ కాదు కాంగ్రెస్ ప్రభుత్వం ఏమీ చేయవద్దు అనేది కెటిఆర్ లక్ష్యం అని అన్నారు. రాష్ట్రంలో కరువు రావాలని కెటిఆర్ కోరుకున్నారనీ, బిఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్ల దుర్మార్గపు పాలనతో ప్రజలు కాంగ్రెస్ పార్టీని పర్మినెంట్ గా అధికారంలో ఉంచుతారనే భాద కెటిఆర్ లో ఉందనీ అన్నారు. ప్రపంచంలో ఎల్ నినో ప్రభావంతో కరువు వచ్చిందనీ ఏ.ఐ ద్వారా ఉద్యోగాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడిందని అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా లాంటి దేశాల్లో పెద్ద, పెద్ద కంపెనీలు ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నాయి అని ఆయన వివరించారు. స్కిల్ డెవలప్మెంట్ పై ఆధారపడాల్సిన పరిస్థితి వచ్చిందనీ, తొమ్మిదిన్నరేళ్లలో రాష్ట్రంలో రూ.8 లక్షల కోట్ల అప్పులు చేశారనీ అన్నారు.

అర్మేనియా పార్లమెంట్‌లో ఎంపిల మధ్య తీవ్ర ఘర్షణ

ప్రతిపక్షంపైకి కుర్చీ విసిరిన అధికార పార్టీ ఎంపి!



ఎరెవాన్, అక్టోబరు 29: అర్మేనియా పార్లమెంట్‌లో గురువారం అధికార, ప్రతిపక్ష పార్టీల సభ్యుల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. అధికార సివిల్ కాంట్రాక్ట్ పార్టీ ఎంపీలు, ప్రతిపక్ష స్ట్రాంగ్ అర్మేనియా వర్గానికి చెందిన సభ్యుల మధ్య మొదలైన వాగ్వాదం చివరకు భౌతిక దాడులకు దారితీసింది. ఈ క్రమంలో అధికార పార్టీ ఎంపీ ఒకరు ప్రతిపక్ష సభ్యుల వైపు కుర్చీని విసిరారు. ఈ ఘటనపై స్పందించిన అర్మేనియా ప్రధాని నికోల్ పషిన్యాన్ తమ పార్టీ సభ్యుల చర్యలను సమర్థిస్తూ, కుర్చీతో అయినా, మరేదైనా సరే అది సముచితమైనదే అని వ్యాఖ్యానించడం వివాదానికి దారితీసింది. జూన్‌లో జరిగిన పార్లమెంటరీ ఎన్నికల తర్వాత కొత్త పార్లమెంట్‌లో చోటుచేసుకున్న అత్యంత తీవ్ర ఘర్షణగా ఈ ఘటన నిలిచింది. గత కొన్ని నెలలుగా అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతుండగా, గురువారం అవి పరాకాష్టకు చేరుకున్నాయి. అధికార సివిల్ కాంట్రాక్ట్ పార్టీ ఎంపీ టారోన్ చఖోయన్ ప్రసంగిస్తున్న సమయంలో ఈ వివాదం ప్రారంభమైంది. ప్రతిపక్ష స్ట్రాంగ్ అర్మేనియాతో పాటు ఇతర ప్రతిపక్ష నేతలు అవినీతిలో కూరుకుపోయారని ఆయన ఆరోపించారు. ప్రతిపక్ష నేత నారెక్ కరాపెట్యాన్ కుటుంబ సభ్యులు కూడా రాజకీయాల్లో ఉన్నారని ప్రస్తావిస్తూ చఖోయన్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

గిరిజన సమస్యల పరిష్కారం

- బాధ్యతల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు - జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ వెల్లడి

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త రాష్ట్రంలోని గిరిజన వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ కట్టుబడి ఉందని ఆ కమిషన్ సభ్యులు జటోతు హుస్సేన్‌నాయక్ స్పష్టం చేశారు. వివిధ శాఖల అధికారులు నిర్లక్ష్యం లేకుండా తమ బాధ్యతలను నిర్వర్తించాలని సూచించారు. గిరిజనుల సమస్యలను పరిష్కరించడంలో జాతీయ ఎస్టీ కమిషన్ నిర్వహించే పాత్ర గురించి వారిలో అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన వర్గాల సమస్యలు, వాటి పరిష్కారాల విషయమై రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఎస్టీ కమిషన్ పర్యటిస్తోంది. ఇందులో భాగంగా నిజామాబాద్ జిల్లా పర్యటన సందర్భంగా, హుస్సేన్ నాయక్ సిరికొండ మండలంలోని సర్పంచ్ తండా, గడ్డమీది తండా, కొండాపూర్, గోప్యా తండాలతో పాటు, నవీపేట మండలంలోని మాన్ సింగ్ తండాను సందర్శించారు. గిరిజన నివాసితులతో మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆయా నివాస ప్రాంతాలలో అందుబాటులో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఇంకా కల్పించాల్సిన ప్రాథమిక సౌకర్యాల వివరాలను కూడా ఆయన వివరాలు సేకరించారు. అనంతరం, ఆయన ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీసెస్ కాంప్లెక్స్‌లో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి, పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించాలన్నారు.

బాబ్లి గేట్లు మూసివేత

హైదరాబాద్, అక్టోబరు 29,ప్రభాతవార్త: సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి గురువారం బాబ్లీ ప్రాజెక్టు గేట్లను మూసివేశారు. సిడబ్ల్యుసి ఇఇ ఎన్ చరణ్, నాందేడ్ ఇరిగేషన్ అధికారి సిఆర్ బన్సద్, ఎస్సారెస్పీ ఎఇఇ కొత్తరవి, ఎస్ రిక్కిసైమన్‌లు ఈ కార్యక్రమంలో హాజరై గేట్లు దించారు. ప్రతి ఏడాది జులై 1నుంచి అక్టోబరు 28వరకు గేట్లు తెరిచి వుంచుతారు. ఈయేడు 14గేట్లు ఎత్తిన తరువాత బాబ్లి నుంచి 0.20టిఎంసి నీరు మాత్రమే ఎస్సారెస్పీలోకి వచ్చింది.

రక్తదానం.. మరొకరికి ప్రాణదానం: ఎసిపి రణవీర్ రెడ్డి

ఆర్టీసి కళాభవన్‌లో ఘనంగా సిటీ పోలీస్ మెగా రక్తదాన శిబిరం

చిక్కడపల్లి అక్టోబర్ 29 (ప్రభాతవార్త) : రక్తదానం చేయడం అంటే మరొకరికి ప్రాణదానం చేయడమేనని ఆపదలో ఉన్నవారికి రక్తం ఇచ్చి ఆదుకోవడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని చిక్కడపల్లి ఏసీపీ రణవీర్ రెడ్డి పిలుపునిచ్చారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సూచన మేరకు, పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని గురువారం చిక్కడపల్లి పోలీసుల ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లి ఆర్టీసీ కళాభవన్ లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం రణవీర్ రెడ్డి మాట్లాడుతూ రక్తదాన శిబిరానికి స్పందించి స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన నిరుద్యోగ అభ్యర్థులను ప్రత్యేకంగా అభినందించారు. సామాజిక బాధ్యతతో ప్రాణాలను కాపాడేందుకు యువత ముందు వరుసలో ఉండటం ప్రశంసనీయమని పేర్కొన్నారు. అనంతరం రక్తదానం చేసిన అభ్యర్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. కార్యక్రమానికి ముందు చిక్కడపల్లి సిటీ సెంటర్ లైబ్రరీ నుంచి నిరుద్యోగ జేఏసీ నేత శంకర్ నాయక్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువత భారీగా తరలివచ్చి రక్తదానం చేశారు. శంకర్ నాయక్ మాట్లాడుతూ రక్తదానం అనేది ఒకరి ప్రాణాన్ని నిలబెట్టే అత్యంత పవిత్రమైన కార్యం. దిక్కుతోచని స్థితిలో ఉన్న కుటుంబానికి రక్తదానం ద్వారా ప్రాణదానం చేసి అభయాన్ని అందించవచ్చు.

ఆంధ్రా తుఫాను సహాయక చర్యల్లో తెలంగాణ

ప్రభావిత ప్రాంతాలకు రాష్ట్ర విద్యుత్ బృందాలు

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త ఆంధ్రాలో అర్నాబ్ తుపాను సృష్టించిన బీభత్సంలో సహాయ సహకారాలు అందించేందుకు తెలంగాణ ముందుకొచ్చింది. ఆ రాష్ట్ర సిఎం చంద్రబాబు విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. ఈ నేపథ్యంలో విద్యుత్ వ్యవస్థ దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టేందుకు రాష్ట్రానికి చెందిన విద్యుత్ బృందాలు తరలి వెళ్లాయి. తుఫాన్ ప్రభావంతో ముఖ్యంగా అనకాపల్లి, విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో తుఫాన్ కారణంగా పంటలకు నష్టం వాటిల్లడంతో పాటు, విద్యుత్ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతిన్నదని ఏపి ప్రభుత్వం తెలంగాణ సర్కార్ దృష్టికి తీసుకొచ్చింది. ప్రాథమిక అంచనాల ప్రకారం సుమారు 16 వేలకు పైగా విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయని, వందల గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయిందని వివరించింది. ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు విద్యుత్తు సిబ్బంది, యంత్రాలు అవసరమని పేర్కొంటూ తెలంగాణ ప్రభుత్వ సహాయాన్ని కోరింది. దీనిపై సిఎం, డిప్యూటీ సీఎంల ఆదేశాల మేరకు విద్యుత్ పునరుద్ధరణ పనులను వేగవంతం చేసేందుకు టెక్నికల్ సహాయక బృందాలు వెళ్లాయి.

నియామకాలు, ప్రమోషన్లలో వర్గీకరణ తప్పనిసరి

ఎస్సీ వర్గీకరణపై సర్కార్ కఠిన ఆదేశాలు

హైదరాబాద్, అక్టోబరు 29, ప్రభాతవార్త తెలంగాణలో ఎస్సీ వర్గీకరణ అమలు విషయంలో రాష్ట్ర సర్కార్ మరో కీలక ముందడుగు వేసింది. ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్ల అమలుపై ఉన్న సందిగ్ధతలకు తెరదించుతూ సాంఘిక సంక్షేమ శాఖ మెమో నెం. 1628 పేరిట స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఆ శాఖ ప్రభుత్వ కార్యదర్శి విజయేందిర బోయి పేరిట వెలువడిన ఈ ఉత్తర్వుల్లో ఎస్సీ వర్గీకరణ చట్టం, విధివిధానాలను ప్రతి విభాగం తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. తాజా మెమో ప్రకారం ప్రత్యక్ష నియామకాలకు సంబంధించి ప్రభుత్వ కొలువుల భర్తీ ప్రక్రియలో రోస్టర్ పాయింట్లకు అనుగుణంగా వర్గీకరణ వర్తిస్తుందని పేర్కొన్నారు. అలాగే బదిలీలు, పదోన్నతులు, ప్రమోషన్లు, అపాయింట్‌మెంట్ బై ట్రాన్స్‌ఫర్ ప్రక్రియల్లోనూ చేయాలని స్పష్టం చేశారు.



ఫిఫా ప్రపంచ కప్‌లో ఆఫ్ఘనిస్థాన్ విజయం

2-1 తేడాతో భారత్ ఓటమి

బాకు: బాకులో గురువారం జరిగిన ఫీఫా అండర్15 ప్రపంచ కప్ ఫెస్టివల్ అజర్‌బైజాన్-2026 క్వార్టర్‌ఫైనల్ మ్యాచ్‌లో భారత్, ఆఫ్ఘనిస్తాన్ చేతిలో 1-2 తేడాతో ఓటమి చవిచూసింది. భారత్ ఆటను ప్రారంభించి ఆరవ నిమిషంలో గోల్ చేసేందుకు దగ్గరగా వచ్చింది. మూడు నిమిషాల తర్వాత, నిబాస్ లలావంపుయియా వైపు ఒక త్రూ బాల్‌ను అందించాడు. 15వ నిమిషంలో ఆఫ్ఘనిస్తాన్ గోల్ చేసి ఆధిక్యం సాధించింది. ముస్తఫా షాట్ కొట్టి తన జట్టును ఆధిక్యంలోకి తీసుకువెళ్లాడు. తప్పిదం కారణంగా (27వ) భారత్ మరింత కష్టాలో పడింది. ఖైర్ మహమ్మద్ నజారీ ఒత్తిడికి గురిచేయడంతో, నారా మీటీ లౌషంబం తప్పుగా ఇచ్చిన పాస్‌ను సుల్తానీ అడ్డుకున్నాడు. ఆ తర్వాత ఆ ఆఫ్ఘనిస్తాన్ ఫార్వర్డ్ భారత డిఫెండర్లను దాటుకుని ముందుకు వెళ్లి, సమీప పోస్ట్ వద్ద నెట్ పైకప్పులోకి ఒక శక్తివంతమైన షాట్‌ను సంధించాడు. భారత్ ఎదురుదాడి ద్వారా ప్రతిస్పందించడానికి ప్రయత్నించినప్పటికీ, తమకు లభించిన కార్నర్‌లు మరియు సెట్‌పీస్ అవకాశాలను సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైంది. లాల్‌రెమ్‌రువాట్‌ఫెలా (37వ) బాల్‌ను నియంత్రించి నిబాస్‌కు అందించగా, అతను దాన్ని గోల్‌గా మలిచి ఆధిక్యాన్ని తగ్గించాడు. ఆఖరి దశలలో స్కోరును సమం చేయడానికి భారత్ తీవ్రంగా ప్రయత్నించింది, కానీ ఆఫ్ఘనిస్తాన్ రక్షణ పటిష్టంగా నిలబడి విజయాన్ని దక్కించుకుంది.



టోక్యో ఓపెన్‌లో పోహంకోవా విజయం

నవోమి ఒసాకా సంచలన ఓటమి

టోక్యో: గురువారం జరిగిన టోరే పాన్ పసిఫిక్ ఓపెన్‌లో మాజీ ఛాంపియన్ నవోమి ఒసాకా ను మియా పోహంకోవా ఓడించి సంచలనం సృష్టించింది. తద్వారా తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని నమోదు చేసుకుని, టోక్యోలో క్వార్టర్ ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ప్రపంచ 144వ ర్యాంకర్, 2019 టోక్యో ఛాంపియన్ అయిన ఒసాకాను గంటా 35 నిమిషాల్లో 6-3, 7-5 తేడాతో ఓడించింది. ఈ విజయంతో పోహంకోవా క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకుంది.

పోహంకోవా తన నిలకడైన ప్రదర్శనలతో అందరి దృష్టిని ఆకర్షిస్తూ, మహిళల టెన్నిస్‌లో వర్ధమాన ప్రతిభావంతులలో ఒకరిగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటోంది. గత సంవత్సరం ఇదే సమయానికి, ఆమె ప్రపంచ ర్యాంకింగ్‌లో 659వ స్థానంలో ఉండేది. ఆమె ఈ సీజన్ ప్రారంభంలో ఒక ఐటిఎఫ్ డబ్ల్యూ75 టైటిల్‌ను గెలుచుకుని, ఏప్రిల్‌లో జరిగిన ఒక ఐటిఎఫ్ డబ్ల్యూ100 ఈవెంట్ ఫైనల్‌కు చేరుకుంది. సెప్టెంబర్‌లో, ఈ స్లోవేకియా క్రీడాకారిణి వరుసగా జరిగిన జూగితి 125స్థాయి టోర్నమెంట్‌ల సెమీఫైనల్స్‌కు చేరుకుని, ఆ తర్వాత డబ్ల్యూటిఎ1000 వుహాన్ ఓపెన్‌లో రెండు విజయాలను నమోదు చేసింది.





రెజ్లింగ్ వరల్డ్‌లో సుజీత్ ఓటమి

మహిళల విభాగం సెమీస్‌లోకి మనీషా

అస్తానా: ప్రపంచ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భాగంగా అస్తానాలో గురువారం జరిగిన పురుషుల ఫ్రీస్టైల్ 65 కేజీల క్వార్టర్‌ఫైనల్‌లో భారత్ రెజ్లర్, ఆసియా ఛాంపియన్ సుజీత్ కల్కల్ స్వల్ప తేడాతో ఓటమి చవిచూడగా, మహిళల విభాగంలో భారత్ రెజ్లర్ మనీషా రెండు స్టెప్‌అవుట్‌లు, రెండు టేక్‌డౌన్‌లు సాధించి, మంగోలియాకు చెందిన బోలోర్టుయా ఖురెల్ఖూను ఓడించి మహిళల 69 కేజీల సెమీ ఫైనల్స్‌కు చేరుకుంది. ఆసియా క్రీడల ఛాంపియన్ అయిన సుజీత్, తజికిస్తాన్‌కు చెందిన అబ్దుల్‌మజీద్ కుడియేవ్ చేతిలో 3-3 తేడాతో ఓడిపోయాడు. క్వార్టర్‌ఫైనల్‌లో, సుజీత్ కుడియేవ్‌పై 3-1 ఆధిక్యం సాధించి, టేక్‌డౌన్ కోసం ఆ తాజిక్ రెజ్లర్ వెనుకకు వెళ్ళడానికి ప్రయత్నించాడు. అయితే, కుడియేవ్ టేక్‌డౌన్ సాధించగలిగాడు. ఆ తాజిక్ రెజ్లర్ తన 3-3 ఆధిక్యాన్ని నిలుపుకొని విజయాన్ని కైవసం చేసుకున్నాడు. ఇక పురుషుల 97 కేజీల విభాగంలో, క్వార్టర్ ఫైనల్స్‌లో వికీ హూడా జపాన్‌కు చెందిన ఆరష్ యోషిడా చేతిలో టెక్నికల్ సుపీరియారిటీతో 2-12 తేడాతో ఓటమి చవిచూశాడు. ఇక మహిళల విభాగంలో మనీషా రెండు స్టెప్‌అవుట్‌లు, రెండు టేక్‌డౌన్‌లు సాధించి, మంగోలియాకు చెందిన బోలోర్టుయా ఖురెల్ఖూను 6-0 తేడాతో ఓడించి మహిళల 69 కేజీల సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ఆమె అంతకుముందు క్వార్టర్‌ఫైనల్స్‌లో కెనడాకు చెందిన లారెన్స్ బ్యూరెగార్డ్‌ను 6-2 తేడాతో ఓడించింది. మహిళల 55 కేజీల విభాగంలో, అహిల్యా షిండే క్యూబాకు చెందిన యాయ్నెలిస్ సాన్జ్ వెర్డెసియాపై 8-1 తేడాతో విజయం సాధించి తన ప్రచారాన్ని ప్రారంభించింది, అయితే క్వార్టర్‌ఫైనల్స్‌లో టర్కీకి చెందిన టుబా డెమిర్ చేతిలో 6-9 తేడాతో ఓడిపోయింది.

నేడు న్యూజిలాండ్‌తో నాలుగో టి20

క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన టీమిండియా

ఆక్లాండ్: ఆక్లాండ్ వేదికగా ఈ నెల 30న భారత్, న్యూజిలాండ్ నాల్గవ, చివరి టీ20 మ్యాచ్ జరగనుంది. తొలి మూడు మ్యాచ్‌ల్లో విజయం సాధించిన భారత్ ఇప్పటికే సిరీస్‌ను కైవసం చేసుకుంది. అయినప్పటికి కూడా భారత జట్టు క్లీన్ స్వీప్‌పై కన్నేసింది. శుక్రవారం జరిగే నాలుగో టీ20లో గెలిస్తే ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో భారత్ 4-0 ఆధిక్యంతో నిలుస్తుంది. ఈ క్రమంలో నాలుగో టీ20 మ్యాచ్‌లో విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. మరోవైపు ఇప్పటికే సిరీస్‌ను కోల్పోయిన న్యూజిలాండ్ 4వ టీ20 మ్యాచ్‌లో గెలిచి భారత ఆధిక్యాన్ని తగ్గించాలని భావిస్తోంది. అయితే సిరీస్ ఫలితం ఇప్పటికే తేలిపోవడంతో టీమ్ మేనేజ్‌మెంట్ కీలక ఆటగాళ్లకు విశ్రాంతి ఇచ్చి, బెంచ్‌లో ఉన్న వారికి అవకాశం ఇచ్చే ఆలోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. ముఖ్యంగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తికు ఈ మ్యాచ్‌లో చోటు దక్కుతుందా అనేది ఆసక్తికరంగా మారింది. బ్యాటింగ్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తూ భారత్ ఇప్పటివరకు ఎనిమిదో స్థానం వరకు బలమైన బ్యాటింగ్ లైనప్‌తో ఆడింది. భారీ స్కోర్లు నమోదవుతున్న ఈ సిరీస్‌లో ఆ వ్యూహం అద్భుతంగా పనిచేసింది. అయితే మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ప్రయోగాలకు అవకాశం ఉండటంతో తుది జట్టులో మార్పులు కనిపించే ఛాన్స్ ఉంది. ముఖ్యంగా కుల్దీప్‌కు ఎక్కువకాలం బెంచ్‌పై కూర్చోబెట్టడం అతడి ఆత్మవిశ్వాసంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. వెస్టిండీస్‌తో జరిగిన స్వదేశీ సిరీస్‌లో రెండు మ్యాచ్‌లు ఆడిన అతడు.. న్యూజిలాండ్‌తో తొలి మూడు టీ20ల్లో చోటు దక్కించుకోలేదు. మిడిల్ ఓవర్లలో వికెట్లు తీసే సామర్థం ఉన్న కుల్దీప్‌ను ఇప్పుడు ఉపయోగించుకోవాలని భారత్ భావించవచ్చు. మరోవైపు ఇషాన్ కిషన్ ఫిటెనెస్‌పై ఇంకా స్పష్టత లేదు. వరుణ్ చక్రవర్తి కూడా గత కొన్ని నెలలుగా స్థిరమైన ఫామ్ కోసం ప్రయత్నిస్తున్నాడు. మరోవైపు మూడో టీ20లో ఆడిన అక్షర్ పటేల్, నామన్ ధీర్ కు బౌలింగ్ చేసే అవకాశం కూడా రాలేదు. అక్షర్ ఈ సిరీస్‌లో రెండు వికెట్లు మాత్రమే తీసుకున్నాడు. అతడి కెరీర్ టీ20 ఎకానమీ 7.70 కాగా ఈ సిరీస్‌లో 9.58గా ఉంది. పేస్ విభాగంలో భువనేశ్వర్ కుమార్ చివరి ఓవర్లలో యార్కర్లతో ఆకట్టుకున్నా. తొలి మూడు మ్యాచ్‌ల్లో 72 బంతుల్లో 139 పరుగులు సమర్పించుకున్నాడు. నాలుగేళ్ల విరామం తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన అతడు గణాంకాలను మెరుగుపరుచుకోవాలని చూస్తున్నాడు. ప్రిన్స్ యాదవ్ గత రెండు మ్యాచ్‌ల్లో మయాంక్ యాదవ్‌పై పైచేయి సాధించాడు. ఇప్పుడు మయాంక్‌కు అవకాశం వస్తుందా లేదా ప్రిన్స్‌ను కొనసాగిస్తారా అనేది చూడాలి.









హైలో ఓపెన్‌లో సింధు, లక్ష్య విజయం

ప్రణయ్ నిష్క్రమణ

సార్‌బ్రూకెన్: హైలో ఓపెన్‌లో పీవీ సింధు, లక్ష్య సేన్ రెండో రౌండ్‌కు చేరుకోగా, పలువురు ఇతర భారత షట్లర్లు కూడా ఈ సూపర్ 500 టోర్నమెంట్‌లో ముందంజ వేశారు. అయితే, ఫ్రాన్స్‌కు చెందిన ఆరో సీడ్ టోమా జూనియర్ పోపోవ్ చేతిలో హెచ్ఎస్ ప్రణయ్ తొలి రౌండ్‌లోనే ఓటమి చవిచూశాడు. రెండో సీడ్ సింధు యూఏఈకి చెందిన ప్రకృతి భరత్‌ను కేవలం 28 నిమిషాల్లో 21-10, 21-10 తేడాతో ఓడించింది. రెండు గేమ్‌లను తన ఆధీనంలో ఉంచుకున్న సింధు సునాయాస విజయాన్ని అందుకుంది. ఇక ఏడవ సీడ్ లక్ష్య ఫిన్లాండ్‌కు చెందిన జోకిమ్ ఒల్డోర్ఫ్‌తో మరింత కఠినమైన సవాలును ఎదుర్కొన్నాడు. తొలి గేమ్‌ను 16 -21 తేడాతో కోల్పోయిన తర్వాత, సేన్ బలంగా పుంజుకుని తర్వాతి రెండు గేమ్‌లను 21-9, 21-13 తేడాతో గెలుచుకుని, కేవలం గంటకు పైగా సమయంలోనే తన పునరాగమన విజయాన్ని పూర్తి చేసుకున్నాడు. పురుషుల సింగిల్స్‌లో కూడా కిరణ్ జార్జ్ ముందంజ వేశాడు, మలేషియాకు చెందిన చీమ్ జూన్ వెయ్‌ను వరుస గేమ్‌లలో 21-18, 21-17 తేడాతో ఓడించాడు. మరోవైపు, ప్రణయ్ పోపోవ్ చేతిలో 21-23, 16-21 తేడాతో ఓడిపోయాడు. చైనీస్ తైపీకి చెందిన చి యు జెన్, ఫిన్లాండ్‌కు చెందిన కల్లే కొల్జోనెన్‌ల చేతిలో వరుసగా ఓడిపోయిన తర్వాత తరుణ్ మన్నేపల్లి, శంకర్ సుబ్రమణియన్ కూడా పురుషుల సింగిల్స్ పోటీ నుండి నిష్క్రమించారు. మహిళల సింగిల్స్‌లో, ఆరో సీడ్ ఉన్నతి హూడా చెకియాకు చెందిన టెరెజా స్వాబికోవాను 17-21, 21-12, 21-11 తేడాతో ఓడించింది. మొదటి గేమ్ కోల్పోయిన తర్వాత, హూడా పట్టు సాధించి తర్వాతి రెండు గేమ్‌లను గెలుచుకుని రెండో రౌండ్‌లో తన స్థానాన్ని సురక్షితం చేసుకుంది. ఇషారాణి బారువా జర్మనీకి చెందిన మిరాండా విల్సన్‌పై 21-19, 21-9 తేడాతో ఘన విజయం నమోదు చేయగా, హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో అన్మోల్ ఖర్బ్ శ్రీలంకకు చెందిన రణిత్మ లియనగేను 21-18, 22-20 తేడాతో ఓడించింది.

సేవల రంగం వృద్ధి 14 %.. రిటైల్ ట్రేడ్‌లో 19.9% వృద్ధి



న్యూఢిల్లీ, అక్టోబరు 29: భారత సేవల రంగం వృద్ధి వేగం ఆగస్టులో మరింత పుంజుకుంది. జూలైలో 13.5 శాతంగా ఉన్న సేవల ఉత్పత్తి వృద్ధి రేటు ఆగస్టులో 14 శాతానికి చేరింది. కేంద్ర అర్థగణాంకశాఖ గురువారం విడుదల చేసిన ట్రయల్ ఇండెక్స్ ఆఫ్ సర్వీసెస్ ప్రొడక్షన్ ఐఓ నివేదిక ఈ విషయాన్ని వెల్లడించింది. మొత్తం 19 సేవల ఉపరంగాల్లో 17 రంగాలు వృద్ధిని నమోదు చేశాయి. వీటిలో రెండంకెల వృద్ధి సాధించిన రంగాలసంఖ్య జూలైలో 10 ఉండగా, ఆగస్టులో 13కి పెరిగింది. ఇండియా చీఫ్ పాలసీ అడ్వైజర్ డీకే శ్రీవాస్తవ మాట్లాడుతూ, జూన్ 2026 నుంచి సేవల ఉత్పత్తి సూచీ వరుసగా రెండంకెల వృద్ధిని నమోదు చేస్తోందని పేర్కొన్నారు. జూన్‌నుంచి ఆగస్టు వరకు మూడు నెలల్లో సగటువృద్ధి 13.6 శాతంగా నమోదైందన్నారు. దేశ జిడిపిలో సేవల రంగానికి ఉన్న ప్రాధాన్యత దృష్ట్యా, ఈ గణాంకాలు 2026-27ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసి కంలో మెరుగైన జిడిపి వృద్ధికి సంకేతాలిస్తున్నాయని వివరించారు.





భారీ స్థాయిలో దిగివచ్చిన వెండి ధరలు

ముంబయి, అక్టోబరు 29: గ్లోబల్ బులియన్ మార్కెట్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల కారణంగా బంగారం, వెండి ధరల్లో విభిన్నమైన ట్రెండ్ కనిపిస్తోంది. గ్లోబల్ మార్కెట్ సంకేతాలు, స్థానిక అవసరాల్లో వస్తున్న మార్పుల వల్ల హైదరాబాద్ రీటైల్ మార్కెట్‌లో పసిడి ధరలు నిలకడగా కొనసాగుతుండగా, వెండి ధర మాత్రం భారీ స్థాయిలో తగ్గింది. గత కొన్ని రోజులుగా ఆల్ టైమ్ గరిష్ఠాల వద్ద పయనించిన వెండి ధర ఒక్కసారిగా దిగిరావడం కొనుగోలుదారులకు పెద్ద ఉపశమనం అందించింది. స్థానిక మార్కెట్‌లో కేజీ వెండి ధరపై ఏకంగా రూ.5వేల వరకు కోత పడింది. దీంతో ప్రస్తుతం కిలో వెండి విక్రయ ధర రూ.2.15 లక్షల మార్కు వద్ద కొనసాగుతోంది. దేశంలోని ముంబయి, బెంగళూరు, న్యూఢిల్లీ మార్కెట్లలో కూడా ఇంచుమించు ఇదేవిధంగా కొనసాగుతున్నాయి. పండగల ముగింపు, పారిశ్రామిక రంగాల నుంచి డిమాండ్ మందగించడం వంటి అంశాలు ఈ పతనానికి ప్రధాన కారణంగా కనిపిస్తున్నాయి. మరోవైపు పసిడి విక్రయాల్లో ఎలాంటి హెచ్చుతగ్గులు నమోదు కాలేదు. గడిచిన కొద్ది రోజులుగా నమోదైన ధరల వద్దే పసిడి ట్రేడ్ అవుతోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,43,950 వద్ద స్థిరంగా ఉంది. అదే సమయంలో, ఆభరణాల తయారీకి ఉపయోగించే 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,31,950 వద్ద కొనసాగుతోంది.

భారత ఎన్నికల సంఘం

ఓటు V.O.T.E


ఈ క్రింది గ్రాడ్యుయేట్ నియోజకవర్గాలలో మీ ఓటు హక్కును వినియోగించుకోవడానికి నమోదు చేసుకోండి:

మీరు 31.10.2023న లేదా అంతకు ముందు పట్టభద్రులై, ఈ క్రింది జిల్లాల నివాసి అయితే, మీరు సంబంధిత పట్టభద్రుల నియోజకవర్గంలో ఓటరుగా నమోదు చేసుకోవచ్చు.

మహబూబ్ నగర్-రంగా రెడ్డి-హైదరాబాద్ పట్టభద్రుల నియోజకవర్గం పరిధి:
మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణపేట, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాలు.

వరంగల్-ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గం పరిధి:
వరంగల్, హన్మకొండ, మహబూబాబాద్, జనగాం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట (పాక్షికంగా), ఖమ్మం మరియు భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ, సూర్యాపేట, మరియు యాదాద్రి భువనగిరి

- పట్టభద్రుల నియోజకవర్గం ఎలక్టోరల్ రోల్స్: 01 నవంబర్ 2026ను అర్హత తేదీగా సూచిస్తూ ఎలక్టోరల్ రోల్స్ డి-నోవో (తాజా ఓటర్ల) జాబితా తయారీ.
- ఫారం-18 లో వివరాలు నింపి 06 నవంబర్ 2026 వరకు సమర్పించవచ్చు.
- ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణ: 25 నవంబర్ 2026



- క్లైయిమ్‌లు మరియు అభ్యంతరాల దరఖాస్తుల స్వీకరణ : 25 నవంబర్ 2026-10 డిసెంబర్ 2026 వరకు
- ఓటర్ల జాబితా తుది ప్రచురణ : 30 డిసెంబర్ 2026

ఆఫ్‌లైన్ ఎన్‌రోల్‌మెంట్: దరఖాస్తులు ఫారమ్-18లో మహబూబ్ నగర్ - రంగారెడ్డి - హైదరాబాద్ పట్టభద్రుల నియోజక వర్గమునకు ఎలక్టోరల్ నమోదు అధికారి & అదనపు కమీషనర్, GHMC హైదరాబాద్ మరియు వరంగల్ - ఖమ్మం - నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గంనకు ఎలక్టోరల్ నమోదు అధికారి & అదనపు కలెక్టర్, నల్గొండ మరియు సంబంధించిన నోటిఫైడ్ అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారుల/డిజిగ్నేటెడ్ ఆఫీసర్ వద్ద స్వీకరించబడతాయి.

ఆన్‌లైన్ నమోదు: దరఖాస్తులు, ప్రధాన ఎన్నికల అధికారి, తెలంగాణ వెబ్‌సైట్ https://ceotelangana.nic.in ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చు.

"ఏదైనా స్పష్టీకరణలు మరియు సందేహాల కోసం, దయచేసి సంబంధిత పట్టభద్రుల నియోజక వర్గాల ఎలక్టోరల్ నమోదు అధికారులను మరియు 1950 నెంబరుకి ఫోన్ చేసి సమాచారము పొందవచ్చును.

For further details call 1950 10.30am - 5pm. Toll Free

Follow Us
CEOTelangana | CEOTelangana | CEO_Telangana | ChiefElectoralOfficerTelangana | LinkedIn CEOTelangana | CEOTelangana

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.